


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




**సీఎం చంద్రబాబు చెన్నై పర్యటన ఖరారు**

రేపు సదరన్ జోనల్ కౌన్సిల్ మీట్‌కు హాజరు

- వివరాలు 5 లో..

# జయహో బీసీ...



- స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపుపై కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం
- గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం అమలు
- ఇకపై మేయర్, చైర్మన్ పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు
- 28 జిల్లాలకూ జిల్లా పరిషత్‌లు ఏర్పాటు చేస్తాం
- పంచాయతీ నుంచి పార్లమెంట్ దాకా వెన్నుదన్నుగా
- బీసీల్లో లెజెండరీ నాయకత్వాన్ని అందించింది టీడీపీనే
- స్థానిక సంస్థల్లో వారికి రిజర్వేషన్ల అమలు చేసింది మేమే
- నాడు ఎన్టీఆర్ హయాంలోనే నాంది పలికారు
- వైసీపీ నాడు బీసీలకు తీరని ద్రోహం చేసింది
- ఈ నిర్ణయంతో కోర్టుల్లో కేసులూ వేయొచ్చు
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- జయహో బీసీ నినాదాలతో మార్మోగిన సభ

2

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో చారిత్రాత్మక ప్రకటన చేసింది. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు వర్తింపజేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. సామాజిక న్యాయానికి, బీసీ సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అసెంబ్లీ సాక్షిగా స్పష్టం చేశారు. పట్టణ స్థానికసంస్థల్లో మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల ఎన్నికలను ప్రత్యక్ష ఎన్నికల ద్వారా చేపడతామని వెల్లడించారు. ఈ మేరకు ప్రత్యేక క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ఇప్పటివరకు 13 జిల్లా ప్రజా పరిషత్‌లే ఉండటంతో పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్రవ్యాప్తం గా 28 జిల్లా ప్రజాపరిషత్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటిం చారు. స్థానిక సంస్థల్లో బీసీలకు తొలిసారిగా రిజర్వేషన్‌లను 20 శాతం వర్తింప చేస్తూ ఎన్టీఆర్ నాడు తీసుకున్న నిర్ణయం మొదలు కుని.. ఇప్పటివరకు జరిగిన పరిణామాలను సభలో వివరించారు. గత ప్రభుత్వంలో వైసీపీ చేసిన ద్రోహాన్ని ఎండగట్టారు.

## మెగా డీఎస్సీ అద్భుతం

- 16 వేల పోస్టులు పారదర్శకంగా భర్తీ చేశారు
- ఏపీ పారిశ్రామికాభివృద్ధి విధానం బాగుంది
- అమరావతి ప్రపంచంలోనే అద్భుత నగరం అవుతుంది
- లోకేష్‌తో భేటీలో ఢిల్లీ మంత్రి ప్రశంసల వర్షం




ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా పారదర్శకంగా రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి 16 వేల మంది ఉపాధ్యాయ నియామకాలు చేపట్టిన తీరుపై ఢిల్లీ పరిశ్రమల శాఖ మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్ శిర్సా ప్రశంసల వర్షం కురిపించారు. మంగళవారం ఆయన నేతృత్వం లో ప్రత్యేక ప్రతినిధుల బృందం ఏపీలో పర్యటించి ఇక్కడి పారిశ్రామిక విధానాలు, పాలనా సంస్కరణలను అధ్యయనం చేస్తోంది. సచివాలయం ఆర్టీజీఎస్‌లో మంత్రి నారా లోకేష్‌తో ఆయన భేటీ అయ్యారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా మెగా డీఎస్సీ నియామకాలు పూర్తి చేసిన లోకేష్‌కు అభినందనలు తెలిపారు. పారిశ్రామికాభివృద్ధి విధానం బాగుందని ప్రశంసించారు. అమరావతి ప్రపంచంలోనే అద్భుత నగరంగా మారుతుందని తెలిపారు. అనంతరం ప్రతినిధుల బృందాన్ని మంత్రి నారా లోకేష్ సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సమావేశంలో ఢిల్లీ ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి సజ్జన్ సింగ్ యాదవ్, రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

3

## క్యాబినెట్‌లో కీలక నిర్ణయాలకు ఆమోదం

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం వెలగపూడి సచివాలయంలో క్యాబినెట్ సమావేశంజరిగింది. 55కు పైగా అజెండా అంశాలపై చర్చించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. బీసీలకు గ్రామీణ స్థానికసంస్థల్లో 34శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించింది. మేయర్, చైర్మన్ల ఎన్నిక ఇకపై ప్రత్యక్ష పద్ధతిలో చేపట్టాలని నిర్ణయించింది. జెడ్పీ స్థానాలను 28కి పెంచాలని నిర్ణయం తీసుకుంది. 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ ప్రకటనకు ఆమోదముద్ర వేసింది. అమరావతి రైల్వేలైన్‌కు ల్యాండ్ పూలింగ్, బీసీ విద్యార్థుల కోసం జేఈఈ, నీట్ కోచింగ్ సెంటర్లు, అవయవ మార్పిడి ట్రాన్స్‌ప్లాంటేషన్ బిల్లుకు ఆమోదముద్ర వేసింది.

- స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు
- గ్రామీణంలో 34, పట్టణంలో 33.33 శాతం
- కర్నూలులో అగస్త్య గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు
- విశాఖలో గ్రీన్‌టెక్ సోలార్, డేటా సెంటర్లు
- 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ ప్రకటన
- అమరావతి రైల్వేలైన్‌కు ల్యాండ్ పూలింగ్
- బీసీ విద్యార్థులకు జేఈఈ, నీట్ కోచింగ్ సెంటర్లు
- అవయవ మార్పిడికి ట్రాన్స్‌ప్లాంటేషన్ బిల్లు



3

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఖరారు





అమరావతి(చైతన్యరథం): ఏపీలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీలను కూటమి ప్రభుత్వం ఖరారు చేసింది. ఎస్సీ, బీసీల నుంచి ఒక్కొక్కరికి అవకాశం కల్పించింది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, టీడీపీ అనంతపురం లోకసభ నియోజకవర్గ అంగన్ వాడీ సంఘం అధ్యక్షురాలు వడ్డెర సామాజిక వర్గానికి చెందిన దళవాయి రమాదేవి పేర్లను ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు సంబంధిత దస్త్రాన్ని గవర్నర్ ఆమోదం కోసం లోక్ భవన్‌కు పంపినట్లు సమాచారం. శాసనసభలో గవర్నర్ కోటాఎమ్మెల్సీల ఖరారుపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ ఎస్సీ సామాజిక వర్గం నుంచి వర్ల రామయ్య, వడ్డెర సామాజిక వర్గం నుంచి రమాదేవిని ఎంపిక చేశాం. ఎన్నికల్లో ఎమ్మెల్యే సీటు ఇవ్వలేకపోయినందున ఒక సాధారణ మహిళలకు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చాం. చరిత్రలో మొదటిసారి వడ్డెర్లకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించామని తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగాయి



3

- గత పాలనలో ఫేక్ డేటాను తొలగించాం
- మండలిలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్

# జయహో బీసీ...

- స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపుపై కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం
- గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు
- పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు
- నిబంధనలకు అనుగుణంగా పెంపుపై నిర్ణయం
- ఇకపై మేయర్, చైర్మన్ పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు
- అందుకోసమే ప్రత్యేకంగా క్యాబినెట్ సమావేశం
- 28 జిల్లాలకూ జిల్లా పరిషత్‌లు ఏర్పాటు చేస్తాం
- పంచాయతీ నుంచి పార్లమెంట్ దాకా వెన్నుదన్నుగా
- బీసీల్లో లెజెండరీ నాయకత్వాన్ని అందించింది టీడీపీనే
- స్థానిక సంస్థల్లో వారికి రిజర్వేషన్ల అమలు చేసింది మేమే
- గత ప్రభుత్వం బీసీ నాయకత్వానికి తీరని ద్రోహం చేసింది
- బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ప్రకటన



అమరావతి(చైతన్యరథం): బీసీ రిజర్వేషన్లపై కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో కీలక ప్రకటన చేసింది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుపై క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయాన్ని మంగళవారం రెండోరోజు అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. కూటమి ప్రభుత్వం సామాజిక న్యాయానికి, బీసీ సాధికారతకు కట్టుబడి ఉందని అసెంబ్లీ సాక్షిగా స్పష్టం చేశారు. పంచాయతీ నుంచి పార్లమెంట్ దాకా సామాజిక న్యాయమే అజెండా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని వెల్లడించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు తొలిసారిగా రిజర్వేషన్లను వర్తింపచేస్తూ ఎన్టీఆర్ నాడు తీసుకున్న నిర్ణయం మొదలుకుని ఇప్పటివరకు జరిగిన పరిణామాలను సీఎం చంద్రబాబు సభలో వివరించారు. నిబంధనలకు అనుగుణంగా అన్ని పరిమితులకు లోబడి స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్ల పెంపుపై క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంత స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక ప్రాంత సంస్థల్లో 33.33 శాతం మేర రిజర్వేషన్‌లను బీసీ వర్గాలకు వర్తింపచేయనున్నట్టు ప్రకటిం చారు. ఉమ్మడి రాష్ట్రానికి తొలిసారి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేసిన పంచాయతీరాజ్ చట్ట ప్రకారం రిజర్వేషన్ల పెంపును అమ లు చేస్తున్నట్టు తెలిపారు. 1995, 2001, 2006, 2013 సంవత్సరాల్లో 34 శాతం రిజర్వేషన్‌లతోనే స్థానికసంస్థల ఎన్నికలను నిర్వహించినట్టు సభకు గుర్తు చేశారు. సామాజిక న్యాయం అజెండాతో పనిచేయడం వల్లే ఎర్రన్నాయుడు, కేఈ కృష్ణమూర్తి, యనమల, దేవేందర్‌గౌడ్, అయ్యన్నపాత్రుడు వంటి లెజెండరీ నాయకత్వం బీసీ వర్గాల నుంచి వచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వం స్థానికసంస్థల్లో బీసీల రిజర్వేషన్‌లను 24 శాతానికి కుదించడం ద్వారా 16,800 మంది స్థానిక బీసీ నేతలకు రాజకీ యాల్లో అవకాశాలు దక్కలేదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల సామాజిక, రాజకీయ, ఆర్థిక అభ్యున్నతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసు కుందని స్పష్టం చేశారు. స్థానికసంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్‌లను వర్తింపచేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ ని నెరవేరుస్తూ ప్రత్యేక క్యాబినెట్ సమావేశం నిర్వహించి రిజర్వే షన్ల పెంపుపై నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. ఈ 34 శాతం రిజర్వేషన్ ప్రతిపాదనను శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదిం చాలని కోరారు.

### సుస్థిర పాలనకు పట్టణ స్థానిక సంస్థల్లో ప్రత్యక్ష ఎన్నికలు

ఆయారాం.. గయారాం అనే విధానం కాకుండా సుస్థిరమైన పాలన అందించడం కోసమే పట్టణ స్థానికసంస్థల్లో మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల ఎన్నికలను ప్రత్యక్ష ఎన్నికల ద్వారా చేపడతా మని సీఎం వెల్లడించారు. ఈ మేరకు క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. దీంతోపాటు జిల్లాల విభజన జరిగినా ప్రస్తుతం 13 జిల్లా ప్రజాపరిషత్‌లే ఉండటంతో పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లా ప్రజాపరిషత్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. 16వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన రూ.2,300 కోట్ల గ్రామీణ గ్రాంట్లు, రూ.1,562 కోట్ల పట్టణ గ్రాంట్లు రావాలంటే స్థానిక ఎన్నికలు నిర్వహించడం అత్యంత ఆవశ్యకమని, సరైన అభ్యర్థుల ఎంపిక ద్వారా భావి నాయకత్వాన్ని అందించాలని కూటమి నేతలను కోరారు. గ్రామీ ణ, పట్టణ ప్రాంతాలను గాంధీజీ స్ఫూర్తితో అభివృద్ధి చేయడానికి కూటమి అంతా కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

### ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు బీసీలే వెన్నెముక

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను, గ్రామీణ వ్యవస్థను, వ్యవసా యాన్ని, చేతివృత్తులను నిలబెట్టింది బీసీ సమాజమేనని కొనియా డారు. రాష్ట్రంలో 50.42 శాతం ఉన్న బీసీల శ్రమకు, చీరను నేసి అగ్గిపెట్టెలో పెట్టే అద్భుత నైపుణ్యానికి సాంకేతికతను జోడించి వారి శక్తిని ప్రపంచానికి అందిస్తామన్నారు. బీసీ రెసిడెన్షియల్ స్కూళ్లను అత్యుత్తమంగా మార్చి విద్యకు మెరుగైన బాటలు వేస్తా మన్నారు. విద్య, నైపుణ్యం, ఉపాధి, ఎంటర్‌ప్రెన్యూర్లు, రాజకీయ ప్రాతినిధ్యం ద్వారా వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కేవలం రోడ్లు, భవనాలు, మౌలికసదుపాయాలు మాత్రమే అభివృద్ధి కాదని, ఆర్థిక అసమానతలు లేకుండా జీవన ప్రమాణా లు పెంచుతూ చివరి వ్యక్తిని ముందుకు తేవడమే అసలైన అభివృ ద్ధి అని చెప్పారు. బీసీ రిజర్వేషన్లు ఎవరికీ వ్యతిరేకం కాదని, రాజ్యాంగ పరిధిలో చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా సామాజిక న్యాయం సాధించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటిం చారు. బీసీ అంటే వెనుకబడిన వారు కాదు..అవకాశం రాక వెనుకబడిన వారు మాత్రమే అని స్పష్టం చేశారు.

### ఎంపీటీసీ నుంచి ఎంపీగా అవకాశం

1984లో ఎన్టీఆర్ స్థానిక సంస్థలు, మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజా పరిషత్‌లలో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించగా, 73, 74వ రాజ్యాంగ సవరణల స్ఫూర్తితో తన హయాంలో 'యాక్ట్ ఆఫ్ 5' కింద బీసీలకు 34 శాతం మేర రిజర్వేషన్లు పెంచాం. అదే కోటా ప్రకారం 1995, 2001, 2006, 2013 స్థానిక ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేశారు. పార్టీ ప్రోత్సహించి స్థానిక సంస్థల్లో భాగస్వామ్యం కల్పిస్తే క్షేత్రస్థాయి నుంచి నేతలుగా ఎదు గుతారు. కర్నూలు జిల్లాకు చెందిన ఎంపీటీసీ బస్తిపాటి నాగరాజు ను ఎంపీగా చేసి సముచిత న్యాయం చేశామని ఉదహరించారు. పంచాయతీల నుంచి కేంద్ర మంత్రివర్గం వరకు బీసీలకు ప్రాధా న్యం ఇచ్చేలా చర్యలు చేపడతామని వివరించారు.

### కోర్టుల్లో కేసులు వేస్తే చరిత్ర హీనులే

శాసనసభలో ఈ ప్రకటన చేయగానే వైసీపీ కోర్టుల్లో కేసులు వేసేందుకు సిద్ధంగా ఉంటుందని సీఎం వ్యాఖ్యానించారు. మెగా డీఎస్సీ విషయంలోనూ ఇదే తరహాలో వందలాది కేసులు వేశారని తెలిపారు. ఈ రిజర్వేషన్ల విషయంలో కోర్టులకు వెళ్లి కేసులు వేస్తే వారు చరిత్ర హీనులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. ఇంతటి చారిత్రక సమావేశానికైనా వైసీపీ నేతలు హాజరవుతారని భావించా నని, కానీ రాకపోవడం దారుణమని వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున కూడా జాతీయ జెండా ఎగురవేయకుండా నిర్ల క్ష్యం చేస్తూ అవమానించిన వ్యక్తులను ఏమనాలని ప్రశ్నించారు. గత పాలకులపై కేసులు 20 ఏళ్లుగా కింది కోర్టుకు, హైకోర్టుకూ ఊగిసలాడుతూనే ఉన్నాయని ఎద్దేవా చేశారు.

### బీసీలకు ద్రోహంలో వైసీపీ నెంబర్‌వన్

2019లో గత పాలకులు బీసీ రిజర్వేషన్ల విషయంలో 176 జీవో తెచ్చి నాటకాలు ఆడారని, సుప్రీంకోర్టుకు కూడా అప్పీలు చేయ కుండా వదిలేశారని విమర్శించారు. 559, 560 జీవోల ద్వారా రిజర్వేషన్‌లను 34 శాతం నుంచి 24.15 శాతానికి తగ్గించి 16,800 మంది బీసీ నాయకత్వానికి తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. బీసీలకు ద్రోహం చేయడంలో వైసీపీ నెంబర్‌వన్ అని ధ్వజమెత్తారు. గత పాలకులు బీసీలపై కక్షగట్టి, తమ వెనుక లేరన్న భావనతో ఇబ్బందులు పెట్టారని తెలిపారు. అచ్చెన్నా యుడు, కొల్లు రవీంద్ర, అయ్యన్నపాత్రుడు, పల్లా శ్రీనివాస్, కూన రవికుమార్ వంటి బీసీ నేతలపై కేసులు పెట్టి వేధించారని చెప్పా రు. రేపల్లెలో అమర్నాథ్ గౌడ్ అనే కుర్రాడిని పెట్రోలు పోసి తగులబెట్టారని, టీడీపీకి మద్దతిస్తున్నారన్న కారణంతో తోట చంద్ర య్య గొంతుపై కత్తిపెట్టారని, కంచర్ల జాలయ్య, నందం సుబ్బయ్య ప్రాణాలు కోల్పోయినా సిద్ధాంతాలను వదులుకోలేదని గుర్తు చేశారు. చివరికి బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా కనీసం కుర్చీ లు కూడా వేయకుండా అవమానించారని గుర్తుచేశారు. ప్రసంగం ముగించగానే ముఖ్యమంత్రి వద్దకు బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు వెళ్లి అసెంబ్లీ సమావేశ మందిరంలో కృతజ్ఞతలు తెలిపారు. జయహో బీసీ అంటూ నినాదాలతో సభ మార్మోగింది.



# స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు

- గ్రామీణంలో 34, పట్టణంలో 33.33 శాతం
- కర్నూలులో అగస్త్య గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు
- విశాఖలో గ్రీన్‌టెక్ సోలార్, డేటా సెంటర్లు
- 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ ప్రకటన
- అమరావతి రైల్వేలైన్‌కు ల్యాండ్ పూలింగ్
- బీసీ విద్యార్థులకు జేఈఈ, నీట్ కోచింగ్ సెంటర్లు
- అవయవ మార్పిడి ట్రాన్స్‌ప్లాంటేషన్ బిల్లుకు ఆమోదం
- ఏపీ క్యాబినెట్ భేటీలో కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర



అమరావతి(చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం వెలగపూడి సచివాలయంలో క్యాబినెట్ సమావేశం జరిగింది. 55కు పైగా అజెండా అంశాలపై చర్చించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. కేంద్రం నుంచి స్థానిక సంస్థలకు రావాల్సిన నిధులను పొందేందుకు పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలను అత్యవసరంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. చట్టంలోని నిబంధనల ప్రకారం బీసీ రిజర్వేషన్లతోనే పట్టణ స్థానిక సంస్థలు, గ్రామీణ స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. గ్రామీణ స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పనకు ఆమోదం తెలిపింది. పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించింది. ఏపీ పంచాయితీరాజ్ చట్టం-1994కు అనుగుణంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు నిర్ణయం తీసుకుంది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో ఎలాంటి మార్పు ఉండబోదని స్పష్టం చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న రిజర్వేషన్లు యథాతథంగా కొనసాగుతాయని వెల్లడించింది.

### అక్టోబరులోగా స్థానిక ఎన్నికలు

బీసీ రిజర్వేషన్లకు కోసం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని క్యాబినెట్ దృష్టికి ఉన్నతాధికా రులు వెల్లడించారు. పట్టణ ప్రాంతాల్లోని స్థానిక సంస్థల్లో ప్రత్యక్ష ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయం తీసుకుంది. నగర, పట్టణ, నగర పంచాయితీల్లోని మేయర్, చైర్మన్ల ఎన్నిక ఇకపై ప్రత్యక్ష పద్ధతిలో చేపట్టాలని నిర్ణయించింది. పాత పద్ధతిలో ఓ డిప్యూటీ మేయర్‌కే పరిమితం కావాలని నిర్ణయించింది. ఇప్పటివరకూ ఉన్న 13 జిల్లా పరిషత్‌ల సంఖ్యను 28కి పెంచాలని నిర్ణయం తీసుకుంది. జిల్లాల విభజనకు అనుగుణంగా జెడ్పీలను ఏర్పాటు చేసేలా కార్యా చరణ చేపట్టాలని నిర్ణయించింది. ఈ ఏడాది అక్టోబరు లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి ఆర్థిక సంఘం నిధులు రూ.16,500 కోట్లు మురిగిపోకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయం తీసుకుంది. అలాగే పరిశ్రమలు, ఐటీ, ఇంధనం, పర్యాటక రంగాలపై విస్తృతంగా చర్చ జరిగింది.

## ఏపీ క్యాబినెట్‌లో కీలక నిర్ణయాలు

- కర్నూలులో అగస్త్య గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు ఆమోదముద్ర
- 12 గిగావాట్ల సిలికాన్ ఇంగాట్, వేఫర్ ప్లాంట్‌కు గ్రీన్‌సిగ్నల్
- విశాఖలో అక్షత్ గ్రీన్‌టెక్ సోలార్ సెల్, మాడ్యూల్ ప్లాంట్, డేటా సెంటర్ల ప్రతిపాదనలు, ఎస్‌పీబీ నిర్ణయాలకు ఆమోదం
- తిరుపతి, సూర్యలంక, కేసరపల్లి, కాకినాడలో స్టార్ హోటళ్ల ఏర్పాటుకు ఆమోద ముద్ర
- అమరావతి రైల్వేలైన్‌కు ల్యాండ్ పూలింగ్‌పై నిర్ణయం
- హ్యామ్ మోడల్‌లో రోడ్లు, పార్కుల అభివృద్ధిపై నిర్ణయం
- 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ ప్రకటనపై నిర్ణయం
- బీసీ విద్యార్థుల కోసం జేఈఈ, నీట్ సెంటర్ల ఏర్పాటు
- ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటుబిల్లుకు ఆమోదం
- ఉన్నత విద్యలో ఫీజుల నిర్ణయానికి కొత్త కమిషన్ బిల్లు
- ఏపీఎస్‌బీసీఎల్‌కు రూ.5 వేల కోట్ల వర్కింగ్ క్యాపిటల్ రుణం
- అవయవ మార్పిడి ట్రాన్స్‌ప్లాంటేషన్ బిల్లుకు ఆమోదం

# మెగా డీఎస్సీ అద్భుతంగా నిర్వహించారు

- 16 వేల టీచర్ పోస్టులు పారదర్శకంగా భర్తీ చేశారు
- ఢిల్లీలో అయితే కోర్టులు, కేసుల చిక్కులే అధికం
- మంత్రి నారా లోకేష్‌కు ఢిల్లీ మంత్రి ప్రశంసలు



అమరావతి(చైతన్యరథం): ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా పారదర్శ కంగా రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి 16వేల మంది ఉపాధ్యాయ నియామకాలు చేపట్టిన తీరుపై ఢిల్లీ పరిశ్రమల శాఖ మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్ శిర్సా ప్రశంసల వర్షం కురిపించారు. మంగళ వారం ఆర్టీజీఎస్‌లో మంత్రి నారా లోకేష్‌తో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భం గా డీఎస్సీ ద్వారా 16 వేల మంది ఉపా ధ్యాయులను ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ఎలా నియామకాలు చేపట్టగలిగారని లోకేష్‌ని అడిగారు. ఢిల్లీలో టీచర్ రిక్రూట్‌మెంట్ అంటేనే కోర్టులో కేసులు, ఫిర్యాదులు, గందర గోళాలు సృష్టించేసి దాని జోలి కెళ్లాలంటే భయపడేలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఏపీలో ఎలాంటి వివాదాలు లేకుండా పారదర్శకంగా టీచర్ రిక్రూట్మెంట్ పూర్తిచేసిన లోకేష్‌కు అభినం దనలు తెలిపారు. దీనికి మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ తాము డీఎస్సీ ద్వారా పరీక్ష నిర్వహించి ఎక్కడా ఎలాంటి చిన్న పొరపాట్లకు తావు లేకుండా 16 వేల మందికి పైగా ఉపా ధ్యాయ నియామకాలు చేపట్టామన్నారు. దీనిపైన కూడా ప్రతిపక్ష పార్టీ చాలా ఆరోపణలు చేసి విఫలమైందని వివరిస్తూ.. కోర్టుల్లో కేసులు వేసి మరీ ఎక్కడా చిన్న అక్రమం జరిగినట్లు ఆధారాలు చూపించలేక పోయిన విష యాన్ని వివరించారు. త్వరలో మరో 3 వేల మంది కిపైగా ఉపాధ్యాయ నియా మకాలు చేపట్టనున్నట్లు చెప్పారు. విద్యా శాఖ తనకు ఎంతో ఇష్టమైన శాఖని, విద్యాశాఖలో వినూత్నవిధానాలు అమలు చేయడం ద్వారా సత్ఫలితాలు సాధిస్తు న్నామని తెలిపారు. మొట్టమొదటిసారి ప్రైవేటు పాఠశాలల నుంచి 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అమలుచేస్తున్న విద్యా సంస్క రణలపై ప్రజల్లో పెరిగిన నమ్మకానికి ఇదో ఉదాహరణగా పేర్కొన్నారు. ఉపాధ్యాయుల కార్యకలాపాలు, విద్యాశాఖలో మొత్తం కార్యకలాపాలను పర్యవేక్షించడానికి లీప్ యాప్ రూపొందించి నట్లు వివరించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగాయి

- గత వైసీపీ హయాంలో ఫేక్ డేటాను తొలగించాం
- శాసనమండలిలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్



అమరావతి(చైతన్యరథం): ప్రజాప్రభుత్వ పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల మూసివేత, గత మూడేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు వివరాలపై శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. గత రెండేళ్లలో రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలను మూసివేయలేదని ఒక ప్రశ్నకు సమాధానంగా బదులిచ్చారు. మరోవైపు గత వైసీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు 2022-23 ఏడాదిలో 7.6శాతం, 2023-24 ఏడాదిలో 3.03 శాతం, 2024-25లో 3.24శాతం తగ్గాయని తెలిపారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవకతవకలను నివారించి నకిలీ డేటాను తొలగించడంతో 2025-26లో 1.69శాతం వరకు మాత్రమే ప్రవేశాలు తగ్గాయని వివరించారు. 2026-27 ఏడాదికి వచ్చే సరికి 0.94 శాతం ప్రవేశాలు పెరిగాయని చెప్పారు.

# స్థానిక సంస్థల బలోపేతానికి ముందడుగు

### బీసీ రిజర్వేషన్లపై మంత్రి లోకేష్ స్పందన



అమరావతి(చైతన్యరథం): స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లపై మంత్రి నారా లోకేష్ స్పందించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఏపీ మంత్రి మండలి తీసుకున్న మరో చారిత్రక నిర్ణయం బీసీలకు రాజకీయ సాధికార తకు గొప్ప అవకాశం కానుంది. గ్రామీణ స్థానికసంస్థల్లో (ఆర్ఎల్ బీఎస్) బీసీలకు 34శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో (యూఎల్‌బీ ఎస్) బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మ కం. ప్రజాప్రభుత్వం బీసీలకు జై కొట్టింది... జయహో బీసీ అంటోంది. ఏపీ పంచాయతీరాజ్ చట్టం 1994కు అనుగుణంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు నిర్ణయం తీసుకోవడం కీలకమైన అంశం. నగర, పట్టణ, నగర పంచాయతీల్లోని మేయర్, చైర్మన్ల ఎన్నిక ఇకపై ప్రత్యక్ష పద్ధతిలో చేపట్టాలని, 13 జెడ్పీలను 28 జిల్లా పరిషత్‌లుగా ఏర్పాటు చేయాలని క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాలతో స్థానిక సంస్థల బలోపేతం, పాలనా వికేంద్రీకరణకు గొప్ప ముందడుగు పడిందని పేర్కొన్నారు.

చైతన్యరథం

# ఏపీ పారిశ్రామికాభివృద్ధి విధానం భేష్

- డేటా లేక్, స్మార్ట్ గవర్నెన్స్ పాఠాలు మాకూ నేర్పండి
- అమరావతి ప్రపంచంలోనే అద్భుత నగరం అవుతుంది
- లోకేష్‌తో ఢిల్లీ పరిశ్రమల మంత్రి మన్‌జిందర్ సింగ్ శిర్సా
- ఏపీ ప్రతినిధులను ఢిల్లీకి పంపించాలని ఆహ్వానం




అమరావతి(చైతన్యరథం): అమరావతి రాజధాని నిర్మాణ తీరును చూశాం..నిజంగా ఇదొక అద్భుతం.. ప్రపంచంలోనే ఇదొక గొప్ప నగరంగా మారుతుందని ఢిల్లీ పరిశ్రమల మంత్రి మన్‌జిందర్ సింగ్ శిర్సా ప్రశంసించారు. చంద్రబాబు విజనరీ ముఖ్యమంత్రి.. అభివృద్ధికి,దార్శనికతకు ఆయనొక విశ్వవిద్యాలయం.. పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యంలో ఏపీ ప్రభుత్వం మార్గదర్శిగా నిలుస్తుందని కొనియాడారు. ఏపీని చూసి ఢిల్లీ ప్రభుత్వం నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని వ్యాఖ్యానించారు. పెట్టుబడుల ఆకర్షణ, స్మార్ట్ గవర్నెన్స్ తదితర అనేక రంగాల్లో మాకు మీ సహకారం కావాలని మంత్రులు లోకేష్, టీజీ భరత్‌లను కోరారు. ఢిల్లీ మంత్రి మన్‌జిందర్ సింగ్ శిర్సా నేతృత్వంలో ప్రత్యేక ప్రతినిధుల బృందం ఏపీలో పర్యటించి ఇక్కడి పారిశ్రామిక విధానాలు, పాలనా సంస్కరణలను అధ్యయనం చేస్తోంది. సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్)లో రాష్ట్ర పరిశ్రమల శాఖ అధికారులతో ఈ బృందం మంగళవారం సమావేశమైంది. ఈ బృందానికి మంత్రి నారా లోకేష్, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌లు సాదర స్వాగతం పలికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానం గురించి వివరించారు.

## పెట్టుబడులకు స్వర్గధామంగా ఆంధ్రప్రదేశ్

దేశంలోనే ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు స్వర్గధామంగా మారిందని లోకేష్ వివరించారు. 2026ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ 18 బిలియన్ డాలర్ల పెట్టుబడులను సాధించిందన్నారు. భారత దేశం ఆకర్షిస్తున్న పెట్టుబడుల్లో 25 శాతం పెట్టుబడులు ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే వస్తున్నాయని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా క్లస్టర్‌ఆధారిత అభివృద్ధి దిశగా పారిశ్రామికాభివృద్ధి సాధిస్తున్నా మని తెలిపారు. తిరుపతి ప్రాంతంలో ఎలక్ట్రానిక్ క్లస్టర్ ఏర్పాటు చేయడం ద్వారా ఆ రంగానికి చెందిన పరిశ్రమలు, అనుబంధ రంగ పరిశ్రమలన్నీ ఒకేచోట నెలకొల్పడానికి కావాల్సిన అనువైన వాతావరణం ఏర్పాటు చేశామని, రాష్ట్రంలో మొత్తం 22 క్లస్టర్లను ఏర్పాటుచేస్తున్నామని చెప్పారు. అమరావతి, తిరుపతి, విశాఖ పట్నం ప్రాంతాలను ఎకనామిక్ జోన్‌లుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇటీవలే ఉత్తరాంధ్ర ప్రగతికి కీలకం కానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభించామన్నారు. రాయలసీమలోని కర్నూలు జిల్లాలో 300 ఎకరాల్లో డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తున్నా మని తెలిపారు. డేటా లేక్ ద్వారా పాలనను మరింత సరళీకృతం చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వంలోని అన్ని శాఖలకు చెందిన డేటాను ఒకచోట అనుసంధానించి డేటా లేక్ రూపొందించామని, దాని ద్వారా స్మార్ట్ గవర్నెన్స్ ప్రజలకు చేరువ చేస్తున్నామని వివరించారు. డేటా కేవలం ఒక సోర్సు నుంచి కాకుండా పలు సోర్సుల ద్వారా సేకరించి ఎప్పటికప్పుడు విశ్లేషించి డేటాను నిరంతరం అప్‌డేట్ చేస్తూ పారదర్శక పాలన అందిస్తున్నామని వివరణాత్మకంగా చెప్పారు.

## పనితీరుకు ర్యాంకులు

ప్రభుత్వ పనితీరును కూడా తాము ఎప్పటికప్పుడు విశ్లేషించు కుంటున్నామని, ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కార్యక్రమాలపై ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుని పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ పరిశీలిస్తూ పనిచేస్తున్నామని తెలిపారు. మంత్రుల మొదలు ప్రభుత్వంలో కిందిస్థాయి ఉద్యోగి వరకు వారి పనితీరుకు ర్యాంకు లు ఇస్తున్నామన్నారు. ఆయా ప్రాంతాల్లో సభలు నిర్వహించి నప్పుడు అక్కడ ఆ సభల్లోనే ప్రజల సమక్షంలో మంచిగా పని చేసిన ఉద్యోగులను అభినందిస్తున్నామని తెలిపారు. ఈ ప్రభు త్వంపై ప్రజలో ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, వారి ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా తమ ప్రభుత్వం నిరంతరం  పాటు పడుతోందన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ మాట్లాడు తూ పెట్టుబడులు పెట్టడానికి ఏపీ అన్ని విధాలా అనుకూలమైన రాష్ట్రంగా నిలుస్తోందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చే వారికి ఎలాంటి అవరోధాలు లేకుండా అను మతులన్నీ సులభంగా వచ్చేలా సింగిల్ డెస్క్ పోర్టల్ అమలు చేస్తున్నామని వివరించారు. డేటా సెంటర్లు, షిప్ బిల్డింగ్, సెమీ కండక్టర్స్, మెడికల్ డివైజులు, ఫార్మా, ఏరోస్పేస్, డిఫెన్స్, డ్రోన్‌ల మొదలు రాష్ట్రంలో 22 ప్రత్యేక క్లస్టర్లు అభివృద్ధి చేస్తున్నామ న్నారు. గత రెండేళ్లుగా నూతన పారిశ్రామికాభివృద్ధి విధానం 4.0 ద్వారా సత్ఫలితాలు సాధిస్తున్నామని చెప్పారు.

## ఏపీ సహకారం కావాలి

పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామికాభివృద్ధి విధానాల అమలు తదితర అనేక అంశాల్లో ఆంధ్రప్రదేశ్‌ను చూసి మేము చాలా నేర్చుకోవాల్సి ఉందని ఢిల్లీ ప్రభుత్వ పరిశ్రమల శాఖ మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్ శిర్సా తెలిపారు. తాను చాలా ప్రభుత్వా లను చూస్తున్నానని కానీ డేటాను ఇంత సమర్థవంతంగా వినియో గించుకుని సత్ఫలితాలు సాధిస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే నని ప్రశంసించారు. పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్‌కు ఆంధ్రప్రదేశ్ దేశానికే మార్గదర్శిగా నిలిచిందని పేర్కొన్నారు. అమరావతిలో ఇంత పెద్ద నిర్మాణ పనులు జరుగుతుండటం చూసి ఆశ్చర్యపో యానన్నారు. ఢిల్లీలో ఇలా నిర్మాణాలు జరగడానికి ఆస్కారం లేదన్న ఆయన భవిష్యత్తులో అమరావతి ప్రపంచంలోనే ఒక గొప్ప నగరంగా అభివృద్ధి చెందుతుందనడంలో ఎంత మాత్రం అనుమానం లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక విశ్వవిద్యాలయం లాంటి వారు.. ఆయన పుత్రుడు లోకేష్.. మీ విశ్వవిద్యాలయంలో ఇప్పుడు మాకు కూడా అడ్మిషన్ ఇవ్వండి అని సరదాగా చమత్కరించారు. పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామి క విధానాల రూపకల్పన, డేటా డ్రైవెన్ గవర్నెన్స్ అమలు, స్మార్ట్ గవర్నెన్స్ తదితర అంశాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికున్న అపార అనుభవంతో ఢిల్లీ ప్రభుత్వానికి ఏపీ సహకారం అందించాలని కోరారు. ఏపీ బృందాన్ని ఢిల్లీకి పంపాలని, అక్కడ తమ అధికారు లకు ఇక్కడ చేపడుతున్న కార్యక్రమాలు, విధానాల గురించి వివరించాలని కోరారు. దీనికి మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ ఢిల్లీ ప్రభుత్వానికి తాము పూర్తి సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం ప్రతినిధుల బృందాన్ని మంత్రి నారా లోకేష్ సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సమావేశంలో ఢిల్లీ ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి సజ్జన్ సింగ్ యాదవ్, రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.





# లోకేష్‌ను కలిసిన దళవాయి రమాదేవి ఎమ్మెల్సీగా ఎంపికపై కృతజ్ఞతలు



అమరావతి(చైతన్యరథం): మంత్రి నారా లోకేష్‌ను టీడీపీ అనంతపురం లోక్‌సభ నియోజకవర్గ అంగన్‌వాడీ సంఘం అధ్యక్షురాలు దళవాయి రమాదేవి కుటుంబసభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి కార్యకర్తగా తన సేవలను గుర్తించి శాసనమండలి సభ్యురాలిగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి నారా లోకేష్ ఆమెను అభినందిస్తూ తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ పార్టీ కోసం నిస్వార్థంగా కష్టపడే నిజమైన కార్యకర్తలను, నాయకులను గుర్తించి సముచిత స్థానం కల్పించడంలో ముందుంటుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మరింత నిబద్ధతతో పని చేయాలని ఆమెకు సూచించారు.

# మత్స్యకారుల గల్లంతుపై సీఎం చంద్రబాబు సమీక్ష

- గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశం
- బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా



అమరావతి(చైతన్యరథం): బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలంలోని ఓడలరేవు, దుమ్మలపేట, వాసలతిప్ప గ్రామానికి చెందిన మత్స్యకారుల బోటు సముద్రంలో గల్లంతైన ఘటనపై సీఎంవో అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. బోటులో ఉన్న ఎనిమిది మంది మత్స్యకారుల ఆచూకీ కోసం చేపడుతున్న గాలింపు చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గల్లంతైన బోటు, మత్స్యకారుల ఆచూకీ లభించే వరకూ గాలింపు చర్యలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఆగస్టు 3న ఉదయం 10 గంటల సమయంలో ఓడలరేవు జెట్టి నుంచి మత్స్యకారుల బోటు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లిందని అధికారులు వివరించారు. ఉదయం 11 గంటల వరకు కుటుంబసభ్యులతో ఫోన్ ద్వారా సంబంధాలు కొనసాగగా, ఆ తర్వాత ఎలాంటి సమాచారం అందలేదని తెలిపా రు. బోటులో వీఎచ్ఎఫ్ సెట్‌తో పాటు మత్స్యకారుల వద్ద మొబైల్ ఫోన్లు కూడా ఉన్నట్లు అధికారులు వివరించారు. అదేరోజు సుమారు సాయంత్రం 6 గంటల ప్రాంతంలో బోటు చేపల వేట ప్రాంతానికి చేరుకుని ఉండవచ్చని అధికారులు అంచనా వేశారు. 12వ తేదీ నాటికి బోటు తిరిగి రావాల్సి ఉన్నా రాలేదని... దీంతో వెంటనే ఆచూకీ కోసం ప్రత్యేకంగా గాలింపు చర్యలు చేపట్టామని వివరించారు. కోస్ట్‌గార్డ్ నౌకలను అప్రమత్తం చేసి గాలింపు చేపడుతున్నట్లు కోస్ట్‌గార్డ్ కమాండెంట్ చెప్పారని అధికారులు వివరించారు. కాకినాడ, భైరవపాలెం, విశాఖపట్నం, పారాదీప్ ప్రాంతాలకు చెందిన మత్స్యకారుల బోట్లను కూడా అప్రమత్తం చేసి గల్లంతైన బోటు ఆచూకీపై సమాచారం సేకరిస్తున్నామన్నారు. గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ గాలింపు చర్యలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు వారికి తెలియజేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. మత్స్యకారుల సురక్షిత ఆచూకీ కోసం అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను వినియోగించాలని, అవస రమైన ప్రతి చర్యను సమన్వయంతో చేపట్టాలని స్పష్టం చేశారు. బోటు ఆచూకీ లభించే వరకు కోస్ట్‌గార్డ్, మత్స్యశాఖ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో గాలింపు కొనసాగించాలని స్పష్టం చేశారు. బాధిత కుటుంబాలు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## సీఎం చంద్రబాబు చెన్నై పర్యటన ఖరారు

అమరావతి(చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు బుధ, గురువారాల్లో చెన్నైలో పర్యటించనున్నారు. ఈ మేరకు సీఎం పర్యటన షెడ్యూల్ ఖరారైంది. బుధవారం సాయంత్రం 5:30 గంటలకు విజయవాడ ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో చెన్నై వెళ్లనున్నారు. రాత్రి చెన్నైలోని తాజ్ ఫిషర్‌మ్యాన్స్ కోవ్ రిసార్ట్‌లో బస చేయనున్నారు. ఆగస్టు 20న గురువారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు జరిగే 31వ 'సదరన్ జోనల్ కౌన్సిల్' సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సమావేశం అనంతరం సాయంత్రం 5:15 గంటలకు ఉండవల్లి నివాసానికి చేరుకోనున్నారు.

## అనుకూల నివేదిక కోసం లంచం డిమాండ్

**మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అరెస్ట్**





అమరావతి(చైతన్యరథం): ప్రకాశం జిల్లాలో మైనింగ్ క్వారీలో జరిగిన ప్రమాదం కేసులో అనుకూల నివేదిక కోసం లంచం డిమాండ్ చేసిన వ్యవహారంలో పలువురి ప్రమేయం ఉన్నట్లు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) గుర్తించింది. ఈ నేపథ్యంలో మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శివశంకర్‌ను సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు. అలాగే ప్రైవేట్ మైనింగ్ సంస్థ ప్రతినిధి, కన్సల్టెంట్‌ను అరెస్ట్ చేశారు. వీరిని విజయవాడ కోర్టులో హాజరు పరచనున్నారు. గతంలో మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌కు రూ.లక్ష లంచం ఇచ్చినట్లు కూడా సీబీఐ గుర్తించింది. అనుకూల నివేదికతో పాటు మైనింగ్ సంస్థ నుంచి త్రైమాసిక లంచాల కోసం రూ.2 లక్షలు ఏర్పాటు చేసినట్లు కనుగొంది. మైనింగ్ క్వారీ ప్రమాదంలో అనుకూల నివేదిక కోసం రూ.2 లక్షల నగదు తీసుకుంటూ డిప్యూటీ డైరెక్టర్‌ను సీబీఐ అధికారులు రెడ్ హ్యాం డెడ్‌గా పట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆ నగదు ను సీబీఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఒంగోలు, కడప, హైదరాబాద్‌లలో నిందితులకు చెందిన ఇళ్లలో కూడా సీబీఐ సోదాలు చేపట్టింది. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని సీబీఐ అధికారులు ఈ సందర్భంగా వివరించారు.

## డ్రోన్ టెక్నాలజీ రంగంలో

# ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలుపుతాం

- కర్నూలు జిల్లాను జాతీయ స్థాయి హబ్‌గా మారుస్తాం
- సీఎం చంద్రబాబు విజన్‌తో ఓర్వకల్లు డ్రోన్ సిటీకి శ్రీకారం
- పౌర విమానయాన మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు



ఓర్వకల్లు(చైతన్యరథం): డ్రోన్ టెక్నాలజీ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలుపుతామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. మంగళవారం కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలోని పాలకొలను, చింతలపల్లె, కొమరోలు, పాలిమేరల్లో ఉన్న కర్నూలు డ్రోన్ సిటీలో ఏర్పాటు చేసిన డ్రోన్ ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను తిలకించారు. అక్కడే అక్కడే ఏపీ డ్రోన్ పరిశ్రమల సీఈవోల రౌండ్ టేబుల్ సమావేశంలో కేంద్ర పౌర విమానాయాన శాఖ మంత్రి పాల్గొన్నారు. మంత్రికి టీడీపీ నాయకులు సీఎన్ సుధాకర్‌రెడ్డి, పుసులూరు ప్రభాకర్‌రెడ్డి, వెంకటరమణతో పాటు అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు డ్రోన్ సిటీని ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందన్నారు. దేశంలోనే కర్నూలు డ్రోన్ సిటీ మొట్టమొదటిది అని.. డ్రోన్ టెక్నాలజీలో కర్నూలు జిల్లాను జాతీయస్థాయి హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు విజన్‌తో ఓర్వకల్లు డ్రోన్ సిటీకి శ్రీకారం చుట్టారన్నారు. 2024లో అమరావతిలో జరిగిన డ్రోన్ సమ్మిట్‌లోనే సీఎం చంద్రబాబు కర్నూలులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేయాలని ఆలోచన చేశారన్నారు. ఇది ఆయన ముందు చూపునకు నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ఏ-1 మిషన్ లెర్నింగ్ క్వాంటమ్ టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీ వంటి భవిష్యత్ సాంకేతికతను ప్రోత్సహించడంలో సీఎం ఎప్పుడూ ముందుంటా రన్నారు. డ్రోన్ తయారీ టెస్టింగ్ పరిశోధన, శిక్షణ, ఆవిష్కరణలు, ఇతర అనుబంధ కార్యకలాపాలకు డ్రోన్ సిటీని జాతీయ, అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఓర్వకల్లు డ్రోన్ సిటీలో తయారీ పరిశోధన, శిక్షణ టెస్టింగ్ సర్టిఫికేషన్ సేవలను అనుసంధానించి సమగ్ర డ్రోన్ ఏకో సిస్టమ్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. పౌర విమానయాన మంత్రిత్వ శాఖకు సీఐ-డీజీసీఏ తదితర సంస్థల సమన్వయంతో సాండ్ బాక్స్ టెస్టింగ్ సర్టిఫికేషన్ వంటి సదుపాయాలను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

## ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో..

# నిందితుడు షేక్ సాదిక్ ఖాన్‌పై కేసు



కాకినాడ(చైతన్యరథం): పిఠాపురం మండలంలో పంచాయతీ రాజ్ శాఖ ఏఈగా పనిచేస్తున్న నూకరాజు తన కుటుంబంతో సహా గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుడు కాకినాడకు చెందిన ప్రో రైఫిల్ షూటింగ్ నిర్వాహకుడు షేక్ సాదిక్ ఖాన్‌పై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కాకినాడ సర్పవరం పోలీసు స్టేషన్‌లో 103(1), 306(50), 127(1), 351 (3), 108, 299 బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మృతుడు నూకరాజు వియ్యంకుడు భాస్కర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశారు. జూలై 2వ తేదీన తన కుమారుడు జగదీ శ్వర్‌రెడ్డి చనిపోవడంలో షేక్ సాదిక్ ప్రమేయం ఉందని ఆరోపిం చారు. అలాగే సాదిక్ ఖాన్.. నూకరాజు కూతురు ఇంటికి వస్తూ వారి ఆస్తి వివరాలు సేకరిం చాడని ఫిర్యాదులో భాస్కర్‌రెడ్డి ప్రస్తావించా రు. తన భర్తను సాదిక్ ఖాన్ చంపినట్లుగా నూకరాజు కూతురు, తన కోడలు సౌజన్య చనిపోయే ముందు లేఖలో రాశారని భాస్కర్‌రెడ్డి ప్రస్తావించారు. సాదిక్ ఖాన్ తన కోడలు సౌజన్యను ఏదో ప్రైవేట్ విషయాలను అడ్డుపెట్టుకుని బ్లాక్ మెయిల్, టార్చర్ చేశాడని అన్నారు. ఆమె ఫోన్ ట్రాప్ చేస్తూ ఆస్తి కోసం బెదిరించేవాడని ఫిర్యాదులో వివరించారు. సౌజన్యను ముస్లిం మత ఆచారాలను పాటించాలని, ఇస్లాం బుక్ చదివి, ఇస్లాంలోకి మారాలని, వాటిని రోజు రాయించే వాడని, గత్యంతరం లేని పరిస్థితుల్లో సాదిక్ చెప్పినట్లుగా సౌజన్య చేసిందని భాస్కర్‌రెడ్డి తెలిపారు. సౌజన్యను లోబర్చుకుని తన ఇంటిని, తన భర్త ఫోన్, ఎస్‌బీఐ లాకర్, ఆస్తి డాక్యుమెంట్స్ అన్ని తీసుకున్నట్లు లేఖలో సౌజన్య రాశారని నూకరాజు వియ్యంకుడు భాస్కర్‌రెడ్డి చెప్పారు. గత్యంతరం లేకే సౌజన్యతో కలిసి నూకరా జు కుటుంబం ఆత్మహత్య చేసుకుందని ఫిర్యాదు లో వివరించారు. ఇటీవల మరణించిన తన కొడుకు జగదీశ్వర్‌రెడ్డి మృతిపై తనకు అనుమానాలు ఉన్నాయని, దీనిపై దర్యాప్తు చేయాలని నూకరాజు వియ్యంకుడు భాస్కర్‌రెడ్డి కోరారు.

# కొబ్బరి రైతుకు కూటమి అండ



- దెబ్బతిన్న ప్రతి చెట్టుస్థానంలో కొత్త మొక్క నాటడమే లక్ష్యం
- ఒక్కో మొక్కకు రూ.1,000 సాయం..
- కాల్వల్లో పూడికతీతతో ఉప్పునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- కొబ్బరి తోటల్లో అంతర పంటలతో రైతులకు అదనపు ఆదాయం
- శాసనసభలో వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

అమరావతి (చైతన్య రథం): కోనసీమలో కొబ్బరి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు తాత్కాలిక ఉపశమనం కాకుండా శాశ్వత పరిష్కారం చూపే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ, బండారు సత్యానందరావు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, దెబ్బతిన్న ప్రతి కొబ్బరి చెట్టు స్థానంలో కొత్త మొక్క నాటించడంతో పాటు కాలువలు, డ్రెయిన్ల పూడికతీత ద్వారా సమస్య మూలాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు. రాష్ట్రంలో 1.18 లక్షల హెక్టార్లలో కొబ్బరి సాగు జరుగుతుండగా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోనే 0.36 లక్షల హెక్టార్లలో కొబ్బరి సాగవుతోందని మంత్రి తెలిపారు. కోనసీమ జిల్లాలో సుమారు 10 వేల హెక్టార్లలో కొబ్బరి తోటలు కౌలు రైతుల ద్వారా సాగవుతున్నాయని వివరించారు.

గత ఐదేళ్లుగా కాలువల్లో సక్రమంగా పూడికతీత చేపట్టకపోవడంతో సముద్రపు ఉప్పునీరు బ్యాక్ వాటర్ రూపంలో వెనక్కి వచ్చి నేలలో లవణీయత పెరిగిందని మంత్రి పేర్కొన్నారు. దీని ప్రభావంతో పైకి ఆరోగ్యంగా కనిపించే కొబ్బరి చెట్లు కూడా అకస్మాత్తుగా కుంగిపోయి చనిపోతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సమస్యను తాను స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించానని, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ఆయా ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. దెబ్బతిన్న ప్రతి కొబ్బరి మొక్క స్థానంలో కొత్త మొక్క నాటేందుకు ఒక్కో మొక్కకు రూ. 1,000 చొప్పున ఆర్థిక సహాయం అందించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశామని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. కొత్త మొక్కలు నాటడంతోనే సమస్య పరిష్కారం కాదని మంత్రి స్పష్టం చేశారు. కాలువలు, డ్రెయిన్లలో పూడిక తొలగించకుండా ఎన్ని మొక్కలు నాటినా, ఎంత పెట్టుబడి పెట్టినా ఆశించిన ఫలితం ఉండదన్నారు. అందుకే సమస్యకు మూలమైన డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మొదటి విడతలో శంకరగుప్తం కాలువ పనులకు నిధులు కేటాయించామని, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇప్పటికే శంకుస్థాపన చేశారని తెలిపారు. ఈ పనులు పూర్తయితే రెండు, మూడు నియోజకవర్గాల్లో ఉప్పునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. మిగిలిన కాలువలను కూడా ఒక సమగ్ర ప్రాజెక్టుగా చేపట్టి శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

కొబ్బరి రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. కొబ్బరి అభివృద్ధి మండలి (సీడీబీ) సహకారంతో 2017-18 నుంచి 2024-25 వరకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 5,250 హెక్టార్లను పథకం పరిధిలోకి తీసుకొచ్చినట్లు వివరించారు. కొత్త కొబ్బరి తోటల విస్తరణకు హెక్టారుకు రూ.56 వేల సబ్సిడీని రెండేళ్లలో రూ.28 వేల చొప్పున రెండు సమాన వాయిదాల్లో అందిస్తున్నామన్నారు. ఉద్యానవన తోటల విస్తరణకు సంబంధించిన కార్యక్రమం కింద గుంటలు తవ్వడం, మొక్కలు నాటడం, సాగు పరికరాలు తదితరాలకు మూడేళ్లపాటు హెక్టారుకు రూ.2,47,950 వరకు ఆర్థిక సహాయం అందించే అవకాశం ఉందన్నారు. కోనసీమలో కొబ్బరి రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక ప్రాంతీయ కొబ్బరి బోర్డు కార్యాలయం ఏర్పాటు చేయాలని 2024లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ కేంద్ర మంత్రికి లేఖ రాశారని మంత్రి గుర్తుచేశారు. కేంద్రంలోని కొబ్బరి బోర్డు సహకారంతో కొత్త ప్లాంటేషన్లను ప్రోత్సహించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

కొబ్బరి రైతుల ఆదాయాన్ని పెంచేందుకు అంతర పంటల సాగును పెద్దఎత్తున ప్రోత్సహిస్తామని అచ్చెన్నాయుడు చెప్పారు. పామాయిల్ తోటల్లో మాదిరిగానే కొబ్బరి తోటల్లో కోకో, అరటి, కూరగాయలు వంటి అంతర పంటలు సాగు చేస్తే రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. ఈ దిశగా వ్యవసాయ, ఉద్యానవన శాఖల ద్వారా రైతులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. కోనసీమలో దెబ్బతిన్న ప్రతి కొబ్బరి చెట్టు స్థానంలో కొత్త మొక్క నాటించాలన్నదే మా లక్ష్యం. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా దీనికి ఒక నిర్దిష్ట కాలపరిమితి పెట్టుకుని పనిచేస్తాం. కొత్త మొక్కలు నాటించడంతో పాటు ఉప్పునీటి సమస్యకు కారణమైన కాలువలు, డ్రెయిన్ల సమస్యను కూడా పరిష్కరించి కొబ్బరి రైతులకు శాశ్వత భరోసా కల్పిస్తాం అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# చరిత్రలో బీసీలు మరిచిపోలేనిరోజు

- స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పన
- బీసీలకిచ్చిన మరో హామీని నిలబెట్టుకున్న కూటమి
- బీసీలపై కక్షగట్టి రిజర్వేషన్లకు 10 శాతం కోతపెట్టిన జగన్
- వైసీపీ నిర్వాకంతో 16,800 పదవులకు దూరమైన బీసీలు
- సీఎం చంద్రబాబు రాకతో బీసీలకు మంచిరోజులు
- చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేశ్‌కు ధన్యవాదాలు
- సంక్షేమ దన్నుతో బీసీలకు ఆర్థిక భరోసా: మంత్రి సవిత



అమరావతి (చైతన్య రథం): 'చరిత్రలో ఈరోజు బీసీలు మరిచిపోలేని రోజు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు, పట్టణ ప్రాంతాల్లో 33.33 శాతం అమలు కాబోతున్నాయి' అని బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి మంత్రి ఎస్ సవిత సంతోషం వ్యక్తంచేశారు. బీసీలకు ఎన్నికల ముందు ఇచ్చిన మరో హామీని నిలబెట్టుకున్నందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు జగన్ ప్రభుత్వం కోత పెట్టడంవల్ల 16 వేలకు పైగా పదవులకు బీసీలు దూరమయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. వర్షాకాల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంగళవారం శాసనసభలో స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల బిల్లు చర్చ సందర్భంగా బీసీ సంక్షేమ మంత్రి ఎస్.సవిత మాట్లాడారు. బీసీల పక్షపాతి ప్రభుత్వం తమదని మరోసారి రుజువైందన్నారు. స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పించాలని నిర్ణయించామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 34 శాతం, పట్టణ ప్రాంతాల్లో 33.33 శాతం రిజర్వేషన్లు అమలు చేయబోతున్నామన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పనపై మంత్రిమండలిలో ఆమోదించామన్నారు. అసెంబ్లీలో కూడా ఆమోదిస్తున్నామన్నారు. బీసీల అభ్యున్నతికి ఆనాడు అన్న ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు బీసీలకు మొట్టమొదటిసారిగా 1994లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేశారన్నారు. ఇప్పుడు మరోసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్ల కల్పనతో బీసీలకు రాజ్యాధికారంలో అవకాశం కలుగుతుందన్నారు. తమను తాము పాలించుకునే అవకాశం కలుగుతుందని, చరిత్రలో నేడు మరిచిపోలేని రోజు అని మంత్రి సవిత ఆనందం వ్యక్తం చేశారు.

**బీసీలను ప్రోత్సహించిన టీడీపీ**

బీసీలను రాజకీయంగా ప్రోత్సహించిన పార్టీ టీడీపీయేనని మంత్రి సవిత తెలిపారు. నేడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కీలకమైన బీసీ నాయకులందరూ టీడీపీ ప్రోత్సహించినవారేనన్నారు. కింజరాపు ఎర్రన్నాయుడు, దేవేందర్ గౌడ్, కేఈ కృష్ణమూర్తి, యనమల రామకృష్ణుడు, తన తండ్రి ఎస్ రామచంద్రారెడ్డివంటి ఎందరో బీసీ నేతలు అన్న ఎన్టీఆర్, సీఎం చంద్రబాబు ప్రోత్సాహంతో రాజకీయాల్లో తమదైన ముద్ర వేశారని మంత్రి సవిత తెలిపారు.

**బీసీ రిజర్వేషన్లకు జగన్ కోత**

సీఎం చంద్రబాబు అధికారంలో ఉన్న ప్రతిసారీ బీసీలకు మేలు చేసేలా పాలన సాగిస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. బీసీలు ఎప్పుడూ టీడీపీ పక్షపాతమేనని జగన్ కక్షగట్టారన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లలో కోత పెట్టి 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించిందన్నారు. రిజర్వేషన్లలో కోత వల్ల 16,800 పదవులకు బీసీలు దూరమయ్యారన్నారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని మంత్రి నారా లోకేశ్ తన పాదయాత్రలో గుర్తించారన్నారు. అధికారంలోకి రాగానే బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఆనాడే హామీ ఇచ్చారన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో సీఎం చంద్రబాబునాయుడు సైతం బీసీలకు రిజర్వేషన్లను పునరుద్ధరిస్తామని భరోసా ఇచ్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్ల కల్పిస్తూ బిల్లును రూపొందించామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయనున్నామన్నారు. బీసీలకు మరోసారి రాజకీయ పట్టం కల్పిస్తున్న సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు, మంత్రి నారా లోకేశ్ కు మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు.

**కూటమి రాకతో బీసీలకు సంక్షేమ దన్ను**

సీఎం చంద్రబాబు రాకతో బీసీలకు మరోసారి మంచిరోజులు వచ్చాయని మంత్రి సవిత తెలిపారు. సంక్షేమ పథకాలు అమలుచేస్తూ, బీసీలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత బీసీలకు మొదటి బడ్జెట్‌లో రూ.39 వేల కోట్లు, రెండో బడ్జెట్‌లో రూ.47 వేలు కోట్లు, మూడో బడ్జెట్ లో రూ.51 వేల కోట్లు కేటాయించామన్నారు. బీసీలపట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. చట్టసభలలో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడానికి అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రప్రభుత్వ తదుపరి చర్యకు పంపించామని గుర్తు చేశారు. నామినేటెడ్ పోస్టుల భర్తీలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామన్నారు. గీత కార్మికులకు మద్యంషాపులు, బార్లు కేటాయింపుల్లోనూ 10 శాతం మేర కేటాయించామన్నారు. మద్యం షాపుల లైసెన్స్‌లో 50 శాతం రాయితీ ఇచ్చామన్నారు. వడ్డెరలకు క్వారీల కేటాయింపుల్లో 33 శాతం మేర రిజర్వేషన్లు, 50 శాతం మేర సినరేజీ మినహాయింపు ఇచ్చామన్నారు. చేపల వేట నిషేధకాలంలో మత్స్యకారులకు ఆర్థిక సాయం రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచామన్నారు. 62,541 నేతన్నలకు 200లు, 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. 85,940 మంది నేతన్నలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ఇస్తున్నామన్నారు. 71,536 మంది చేనేతలకు నేతన్నల సేవలో పథకం వర్తింప జేశామన్నారు. ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా చేనేతలకు మేలు కలుగజేయాలన్న సంకల్పంతో నేతన్నల సేవలో పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కింద 2024-26 మధ్య 15.67 లక్షల బీసీ లబ్ధిదారులకు రూ.15,588.64 కోట్లు చెల్లించామన్నారు. తల్లికి వందనం పథకం కింద రూ.15 వేల చొప్పున 10.46 లక్షల మంది బీసీ విద్యార్థులకు రూ.1,360.61 కోట్లు అందజేశామన్నారు. ఆటో డ్రైవర్ సేవలో పథకంలో భాగంగా 40,610 మంది ఆటో డ్రైవర్లకు రూ.60.91 కోట్లు కేటాయించామన్నారు. స్త్రీ శక్తి పథకం వల్ల ఆటో డ్రైవర్లకు నష్టం కలుగకూడదన్న ఉద్దేశంతో ఈ పథకాన్ని సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారన్నారు. పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకునే బీసీలకు కూటమి ప్రభుత్వం అదనంగా రూ. 20 వేలు రాయితీ అందజేస్తోందన్నారు. తల్లికివందనం, స్త్రీ బస్, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, ఉచిత ఇసుక, పెన్షన్లు ఇలా ప్రభుత్వ పథకాలన్నింటిలోనూ ఎక్కువగా లబ్ది పొందేది బీసీలేనని మంత్రి సవిత తెలిపారు.

# హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులకు

# రూ.1,323.75 కోట్ల పరిపాలనా అనుమతి

- సీఎం చంద్రబాబు చొరవపై మంత్రి మండిపల్లి హర్షం
- రాయచోటి సెగ్మెంట్‌లో రూ.350 కోట్లతో పనులు
- 25 వేల ఎకరాల ఖాళీ చెరువులు నింపుతాం
- ప్రజలకు నీటి భరోసా కల్పిస్తాం: మంత్రి మండిపల్లి




అమరావతి (చైతన్య రథం): హంద్రీ-నీవా సుజల స్రవంతి ఫేజ్-2లో భాగంగా మిగిలిన మెయిన్ కెనాల్, సీసీ లైనింగ్, నీవా బ్రాంచ్ కెనాల్ తదితర పనులను పూర్తి చేసేందుకు రూ.1,323.75 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేయడంపై రవాణా, యువజన, క్రీడా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. హెచ్ఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్‌ను తొలుత లైనింగ్ లేకుండా నిర్మించడంతో డిజైన్ చేసిన 2,520 క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని పూర్తిస్థాయిలో అందించేందుకు ఇబ్బందులున్నాయని, అందువల్ల మిగిలిన కాలువ పనులతోపాటు సీసీ లైనింగ్ పనులను పూర్తి చేయాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో హెచ్ఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్ కిమీ 400.500 నుంచి 485.300/490.000 వరకు మిగిలిన పనులకు రూ.750.07 కోట్లు, అన్నమయ్య జిల్లాలో కిమీ 490.000 నుంచి 554.175 వరకు మెయిన్ కెనాల్ పనులతోపాటు అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో నీవా బ్రాంచ్ కెనాల్ పనులకు రూ.573.68 కోట్లు కేటాయించే ప్రతిపాదనకు అనుమతి లభించిందని తెలిపారు. రాయచోటి నియోజకవర్గ పరిధిలో హెచ్ఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్ కిమీ 490 నుంచి 535 వరకు సుమారు 45 కి.మీ. మేర పనులున్నాయి. ఈ పనులకు సుమారు రూ.290 కోట్లు, అదనంగా రూ.60 కోట్లతో కలిపి మొత్తం సుమారు రూ.350 కోట్ల విలువైన పనులు చేపట్టే అవకాశముంది. ప్రస్తుతం కిమీ 463 నుంచి 554 వరకు హెచ్ఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్ పనులను ఒకే సింగిల్ ప్యాకేజీగా చేపట్టే ప్రతిపాదన ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో నియోజకవర్గ పరిధిలోని 490-535 కి.మీ. పనులు కూడా సమగ్ర ప్యాకేజీలో భాగం కానున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ పనులు పూర్తయితే హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు పూర్తి సామర్థ్యంతో పనిచేసి, కేవీ పల్లి, గాలివీడు, చిన్నమండెం, సంబేపల్లి, రాయచోటి, పీలేరు, చిత్తూరు ప్రాంతాలకు తాగునీరు అందించడంతోపాటు సాగునీటి అవసరాలను తీర్చేందుకు మరింత ఉపయోగపడుతుందని, 25 వేల ఎకరాల ఖాళీ చెరువులు నింపి ప్రజలకు నీటి భరోసా కల్పిస్తామని మంత్రి పేర్కొన్నారు.

అలాగే హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్ ద్వారా శ్రీనివాసపురం, అడవిపల్లి రిజర్వాయర్లను అనుసంధానం చేసి, మార్గమధ్యంలోని ఖాళీ చెరువులను నింపేలా కార్యాచరణ చేపట్టాలని మంత్రి సూచించారు. ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించడంలో హెచ్ఎన్ఎస్ఎస్ పనులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా ప్రజల చిరకాల నీటి అవసరాలను గుర్తించి హెచ్ఎన్ఎస్ఎస్ పనులకు భారీగా నిధులు కేటాయించి పరిపాలనా అనుమతులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చొరవ, దూరదృష్టితో ఈ ప్రాంతానికి తాగునీరు, సాగునీటి భరోసా మరింత బలోపేతం కానుందని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. హెచ్ఎన్ఎస్ఎస్ మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు సాధ్యమైనంత త్వరగా నీటి ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కోరారు.

## వేగంగా ఎఫ్‌సీవీ పొగాకు కొనుగోలు

- నో-బిడ్స్ మరింత తగ్గాలి..
- రైతులకు మెరుగైన ధర దక్కేలా చర్యలు
- పొగాకు బోర్డు ఉన్నతాధికారులకు అచ్చెన్న ఆదేశం
- తాజా పరిస్థితిని సమీక్షించిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో ఎఫ్‌సీవీ పొగాకు వేలాలు, కొనుగోళ్ల తాజా పరిస్థితిపై మంగళవారం వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పొగాకు బోర్డు సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కొనుగోళ్ల వేగం పెరగడం, నో-బిడ్ శాతం క్రమంగా తగ్గుతుండటం సానుకూల పరిణామమని పేర్కొన్న మంత్రి, ఇదే వేగాన్ని కొనసాగిస్తూ రైతులకు మరింత మెరుగైన ధర లభించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇప్పటివరకు 117 వేలాలు పూర్తయ్యాయని, సుమారు 60 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలు జరిగిందని, ప్రస్తుతం సగటు ధర కిలోకు సుమారు రూ.210 వద్ద కొనసాగుతోందని అధికారులు మంత్రికి వివరించారు. ఇటీవల రోజుల్లో కొనుగోళ్లు వేగం పుంజుకుని రోజుకు సగటున 1.5 నుంచి 2 మిలియన్ కిలోల వరకు అమ్మకాలు జరుగుతున్నాయని తెలిపారు. అదే సమయంలో నో-బిడ్ శాతం క్రమంగా తగ్గుతూ రావడం రైతులకు ఊరటనిచ్చే పరిణామమని మంత్రి పేర్కొన్నారు. పొగాకు రైతుల ప్రయోజనాలే ప్రాధాన్యంగా కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. పొగాకు కొనుగోలు కంపెనీలు, ట్రేడర్లతో మరోసారి చర్చించి కొనుగోళ్ల పరిమాణాన్ని పెంచాలని, 'నో-బిడ్స్'ను మరింత తగ్గించాలని పొగాకు బోర్డు అధికారులకు సూచించారు. ముఖ్యంగా రైతులకు లభిస్తున్న సగటు ధర మరింత పెరిగేలా కంపెనీలు, ట్రేడర్లతో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పొగాకు రైతులు ఇబ్బందులు పడకుండా వేలాలు, కొనుగోళ్ల పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు మెరుగైన ధర దక్కేలా పొగాకు బోర్డు, కొనుగోలు కంపెనీలు, ట్రేడర్లతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై కూటమి ప్రత్యేక శ్రద్ధ

- అనారోగ్యానికి గురైన విద్యార్థులను గుర్తించి సకాలంలో కార్పొరేట్ వైద్యం
- దేశంలో మరే రాష్ట్రంలోనూ పేద విద్యార్థులకు ఇలాంటి పథకం లేదు
- మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి
- అనారోగ్య సమస్యలతో చనిపోయిన 7గురు విద్యార్థుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ



అమరావతి (చైతన్య రథం): దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా దురదృష్టవశాత్తు అనారోగ్య కారణాలతో చనిపోయిన పేద విద్యార్థుల కుటుంబాలకు స్వాంతన పథకంతో కూటమి ప్రభుత్వం బాసటగా నిలిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. అనారోగ్య సమస్యలతో దురదృష్టవశాత్తు చనిపోయిన అంబేద్కర్ గురుకులాల విద్యార్థుల తల్లిదండ్రులకు మంగళవారం అమరావతి సచివాలయంలో మంత్రి స్వాంతన చెక్కులు పంపిణీ చేశారు. ఒక్కో విద్యార్థికి రూ.3 లక్షల చొప్పున 7గురు విద్యార్థుల కుటుంబాలకు రూ.21 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనలతో రూ.5 కోట్లతో కార్పస్ నిధితో స్వాంతన పథకం తీసుకొచ్చాం. అంబేద్కర్ గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో అనారోగ్యానికి గురైన విద్యార్థులను వెంటనే గుర్తించి సకాలంలో కార్పొరేట్ వైద్యం అందిస్తున్నాం. దురదృష్టవశాత్తు చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు బాసటగా స్వాంతన పథకంతో రూ.3 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నాం. ఇప్పటివరకు 11మంది విద్యార్థుల కుటుంబాలకు బాసటగా రూ.33 లక్షల విలువైన స్వాంతన చెక్కులు పంపిణీ చేశాం. దేశంలో మరే రాష్ట్రంలోనూ పేద విద్యార్థుల కోసం ఇలాంటి పథకం లేదు. పేద విద్యార్థుల ఆరోగ్యం, వారి కుటుంబాల సంక్షేమంపట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనం. తల్లిదండ్రులు తమ పిల్లలకు బంగారు భవిష్యత్తును అందించేందుకు తమ ప్రేమానురాగాలకు దూరంగా హాస్టళ్లలో ఉంచి చదివిస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంతోపాటు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. అంబేద్కర్ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. కూటమి ప్రభుత్వం వచ్చాక గురుకులాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

## గుడివాడలో లెగసీ వేస్ట్ తొలగించని ఏజన్సీపై పట్టాభిరామ్ ఆగ్రహం

**- మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి పరిస్థితి చక్కదిద్దే ప్రయత్నం**



గుడివాడ (చైతన్య రథం): కృష్ణా జిల్లా గుడివాడ మున్సిపాల్టీలోని డంపింగ్ యార్డ్‌లో లెగసీ వేస్ట్‌ని తొలగించే ఏజన్సీ నిర్లక్ష్య వైఖరిపై స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్‌లో లెగసీ వేస్ట్ త్వరితగతిన తొలగించకపోవడంవల్ల, పట్టణంలో రోజువారీ వచ్చే చెత్తని డంప్ చేయడం మున్సిపాల్టీకి పెద్ద సమస్యగా మారింది. విషయం తెలుసుకున్న చైర్మన్ పట్టాభిరామ్ మంగళవారం గుడివాడ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, ఇతర అధికారులతో మాట్లాడి, లెగసీ వేస్ట్‌ని తొలగించడంలో ఏజన్సీ జాప్యంవల్ల సమస్య తలెత్తినట్లు తెలుసుకున్నారు. ప్రతి రోజూ వచ్చే చెత్తని తరలించే విషయంలో మున్సిపాల్టీ ఇబ్బందులుపడుతుంటే, ఏజన్సీ లెగసీ వేస్ట్‌ని తొలగించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లెగసీ వేస్ట్ తొలగించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఏజన్సీని ఆదేశించారు. లెగసీ వేస్ట్‌ని వెంటనే తొలగించకపోతే తగిన చర్యలు తీసుకుంటామని చైర్మన్ పట్టాభిరామ్ హెచ్చరించారు.

# జెండామోసిన బీసీలకు రాజ్యాధికారం



## కూటమి ప్రభుత్వ చారిత్రాత్మక నిర్ణయం: హోంమంత్రి అనిత

అమరావతి (చైతన్య రథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం బీసీల రాజకీయ సాధికారతలో చారిత్రాత్మక అడుగని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకోవడంలో తాను కూడా భాగస్వామి కావడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందని తెలిపారు. "బీసీలు కేవలం ఓటు బ్యాంకు కాదు. తెలుగుదేశం పార్టీకి, కూటమికి మొదటి నుంచి వెన్నెముక. పార్టీ కష్టకాలంలోనూ జెండాను వదలకుండా, ఎండనక వాననక గడపగడపకూ తిరిగి పార్టీని ప్రజల్లో నిలబెట్టిన బీసీ కార్యకర్తలకు రాజకీయంగా సముచిత గౌరవం, అవకాశాలు కల్పించాలన్నదే మా ప్రభుత్వ సంకల్పం" అని పేర్కొన్నారు. "నిన్నటి వరకు పార్టీ కోసం జెండా మోసిన సామాన్య బీసీ కార్యకర్త... రేపు అదే గ్రామంలో సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధిగా ప్రజలకు నాయకత్వం వహించాలి. బీసీలకు అవకాశాలు కల్పించడమే కాదు, వారిని అధికారంలో భాగస్వాములను చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం" అని అనిత తెలిపారు. స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న 24.15 శాతం బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచుతామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేసే దిశగా ప్రభుత్వం ముందడుగు వేయడం, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. తెలుగుదేశం ఆవిర్భావం నుంచే బీసీల రాజకీయ ఎదుగుదలకు పెద్దపీట వేసిందని, స్వర్గీయ ఎన్టీఆర్ బీసీలకు రాజకీయ గుర్తింపు, అవకాశాలు కల్పిస్తే... అదే స్ఫూర్తితో సీఎం చంద్రబాబు బీసీలను నాయకత్వ స్థానాల్లో నిలబెడుతున్నారని పేర్కొన్నారు. "బీసీల సంక్షేమం అంటే కేవలం పథకాలు, ఆర్థిక సహాయం మాత్రమే కాదు. రాజకీయంగా నిర్ణయాలు తీసుకునే స్థానాల్లో వారిని కూర్చోబెట్టడమే నిజమైన సాధికారత. జెండా మోసిన చేతులకే అధికార బాధ్యతలు అప్పగించే ఈ చారిత్రాత్మక నిర్ణయంలో మంత్రివర్గ సహచరురాలిగా భాగస్వామిని కావడం నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది" అని హోంమంత్రి అనిత అన్నారు. బీసీల ఆత్మగౌరవాన్ని మరింత పెంచే ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌తో పాటు మంత్రివర్గ సహచరులకు హోంమంత్రి వంగలపూడి అనిత ధన్యవాదాలు తెలిపారు.

# బీసీ బిడ్డలకు ఐఐటీ-జేఈఈ, నీట్ శిక్షణ

- రాష్ట్రంలో రూ.6.86 కోట్లతో 2 ఎక్స్‌లెన్స్ సెంటర్ల ఏర్పాటు
- అమలాపురంలో బాలురు, తిరుపతిలో బాలికల సెంటర్లు
- ఫస్ట్, సెకండర్ ఇంటర్‌లో 160మంది చొప్పున 320 మందికి శిక్షణ
- ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ఫస్ట్ ఇంటర్ తరగతులు ప్రారంభం
- ఎక్స్‌లెన్స్ సెంటర్ల ఏర్పాటుపై మంత్రి సవిత హర్షం
- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు



అమరావతి (చైతన్య రథం): బీసీ విద్యార్థులు ఐఐటీ -జేఈఈ, నీట్ ప్రవేశ పరీక్షల్లో సత్తా చాటేలా కూటమి ప్రభుత్వం రెండు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఒక్కో కేంద్రం ద్వారా 320 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. రూ.6.86 కోట్లతో ఈ రెండు కేంద్రాలను ఏర్పాటు చేయడంపై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి మంత్రి ఎస్.సవిత హర్షం వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు, మంత్రి నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీ బిడ్డల విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. బీసీ గురుకులాలు, హాస్టళ్ల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోందన్నారు. టెన్త్, ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులతో సత్తాచాటుతున్న బీసీ విద్యార్థులకు ఉన్నత విద్య అందించే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం రెండు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించిందన్నారు. ఈ కేంద్రాల ద్వారా ఐఐటీ -జేఈఈ, నీట్ ప్రవేశ పరీక్షల్లో సత్తా చాటేలా శిక్షణ ఇవ్వనున్నామన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే ఏపీ వెనుకబడిన తరగతుల సంక్షేమ నివాస విద్యాసంస్థల సంఘం ఆధ్వర్యంలో ఈ రెండు కేంద్రాలను అమలాపురం, తిరుపతిలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అమలాపురంలో ఏర్పాటు చేయనున్న సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కేంద్రంలో బాలురకు, తిరుపతిలో బాలికలకు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. త్వరలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 160 మంది విద్యార్థులకు అడ్మిషన్లు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఎంపీసీలో 80మంది, బైపీసీలో 80 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఇప్పటికే ఎంజేపీ గురుకుల విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులను ఎక్స్ లెన్స్ సెంటర్‌కు ఎంపిక చేయనున్నామన్నారు. ఈ కేంద్రాల ద్వారా బీసీ విద్యార్థులు ఐఐటీ -జేఈఈ, నీట్ ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఎయిమ్స్, ఇతర ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అధిక సంఖ్యలో ప్రవేశాలు సాధించేలా అవకాశాలు కల్పించడమే శిక్షణా కేంద్రాల ఏర్పాటు ప్రధాన ఉద్దేశమని బీసీ సంక్షేమ మంత్రి సవిత తెలిపారు. రెండు కేంద్రాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.6.86 కోట్లు వెచ్చించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించనున్నామన్నారు. బీసీ బిడ్డల ఉన్నత విద్యకు ప్రోత్సహిస్తున్న సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు, మంత్రి లోకేశ్‌కు మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు.

## ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా నాగబాబు నియామకంపట్ల మంత్రి దుర్గేష్ హర్షం



అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్‌లో పచ్చదనం పెంపు, అటవీ విస్తీర్ణం, పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ 'ఆంధ్రప్రదేశ్ సొసైటీ ఫర్ గ్రీనింగ్ అండ్ రీఫారెస్టేషన్ ఫర్ ఎకలాజికల్ ఎన్‌రిచ్‌మెంట్ (ఏపీ గ్రీన్)' ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా కేబినెట్ హోదా కల్పిస్తూ ఎమ్మెల్సీ కొణిదెల నాగేంద్రరావు (నాగబాబు) నియామకం పట్ల మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తంచేశారు. ఎమ్మెల్సీ నాగబాబు నేతృత్వంలో "పచ్చని ఆంధ్రప్రదేశ్ -ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్" ఆశయ సాధన దిశగా రాష్ట్రం వేగంగా అడుగులు వేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఏపీ గ్రీన్ లక్ష్యాలు, కార్యక్రమాల అమలులో వివిధ ప్రభుత్వ శాఖలు, జిల్లా స్థాయి సంస్థల మధ్య సమన్వయం సాధించడంతో వాటి పురోగతిని ఎప్పటి కప్పుడు పర్యవేక్షించడంవంటి కీలక బాధ్యతలను ఎమ్మెల్సీ నాగబాబు సమర్థవంతంగా నిర్వహిస్తారని మంత్రి దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో అటవీ పరిరక్షణ మరియు పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే ఏపీ గ్రీన్ ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించిన నేపథ్యంలో 2047నాటికి ఈ లక్ష్యాన్ని సమర్థవంతంగా సాధించే దిశగా నూతన ఛైర్‌పర్సన్ నాయకత్వంలో కార్యాచరణ కొనసాగాలని అభిప్రాయపడ్డారు.

# ప్రజలతో బంధం బలోపేతం చేస్తూ..

- 23వ రోజూ విజయవంతంగా 'ఇంటింటికీ తెలుగుదేశం-2026'
- 66.72 లక్షల ఇళ్లకు చేరువైన ఇంటింటి కార్యక్రమం
- నేడు 2.51 లక్షల కుటుంబాలతో టీడీపీ శ్రేణుల మమేకం
- ప్రజాభిప్రాయం, స్థానిక అవసరాలను తెలుసుకుంటూ క్షేత్రస్థాయిలో ముందుకు

అమరావతి (చైతన్య రథం): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు.. క్షేత్రస్థాయిలో ప్రజలతో నేరుగా మమేకమై వారి అభిప్రాయాలు, అవసరాలను తెలుసుకునే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న "ఇంటింటికీ తెలుగుదేశం -- 2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం 23వ రోజూ రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగింది.

23వ రోజున మరో 2.51 లక్షల కుటుంబాలకు చేరువైంది. దీంతో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 66.72 లక్షల ఇళ్లను టీడీపీ నాయకులు, కార్యకర్తలు సందర్శించారు. రోజురోజుకూ విస్తరిస్తున్న ఇంటింటి పర్యటనల ద్వారా కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు.. ప్రజల నుంచి నేరుగా ఫీడ్‌బ్యాక్ తీసుకోవడంపై పార్టీశ్రేణులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నాయి. ప్రతి ఇంటివద్ద ప్రజలతో మాట్లాడి వారికి అందుతున్న సంక్షేమ ప్రయోజనాలు, స్థానికంగా జరుగుతున్న అభివృద్ధి, మౌలిక వసతుల పరిస్థితిపై అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. ప్రజలనుంచి వచ్చే స్పందనను తిరిగి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే రెండువైపుల అనుసంధాన వేదికగా 'ఇంటింటికీ తెలుగుదేశం-2026' కొనసాగుతోంది.



# ఏడాదిలోగా సీమ నీటి ఎద్దడికి చెక్

- తుంగభద్ర నీటిపై సమగ్ర సమీక్ష
- రాయలసీమ ప్రాంత ఎమ్మెల్యేలు, సీఈలతో సమావేశం
- వచ్చే జూలైకి సీమ ప్రజల తాగునీటి కొరత నివారణ
- జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి



విజయవాడ (చైతన్య రథం): తుంగభద్ర డ్యాంలో నీటి లభ్యత, రాయలసీమ ప్రాంత తాగునీటి అవసరాలు, ఎల్ఎల్సీ, హెచ్ఎల్సీ నీటి కేటాయింపులు, వినియోగంపై విజయవాడ క్యాంపు కార్యాలయంలో జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష నిర్వహించారు. రాయలసీమ ప్రాంత ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్చార్జులు, సిఈలు, తుంగభద్ర డ్యాం ఇంజనీర్లతో జరిగిన సమీక్షలో ఎల్నినో వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రాయలసీమలో తాగునీటి అవసరాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. 2027 జూలై వరకు రాయలసీమ ప్రాంతంలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారని చెప్పారు. తుంగభద్ర డ్యాంలో నీటి లభ్యత, రాష్ట్రాల వాటాలపై చర్చించారు. తుంగభద్ర నీటిలో కర్ణాటక వాటా 65.56 శాతం, ఆంధ్రప్రదేశ్ వాటా 31.36 శాతం, తెలంగాణ వాటా 3.07 శాతంగా ఉందని తెలిపారు. ప్రస్తుత అంచనాల ప్రకారం ఈ ఏడాది తుంగభద్ర డ్యాంకు సుమారు 105 టీఎంసీ నీరు మాత్రమే వచ్చే అవకాశం ఉందని అధికారులు వివరించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ వాటాగా సుమారు 32.9 టీఎంసీ అందుబాటులో ఉండే అవకాశం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ వాటాలో హెచ్ఎల్సీకి 11.88 టీఎంసీ, ఎల్ఎల్సీకి 16.09 టీఎంసీ, కేసీ కెనాల్కు 4.95 టీఎంసీ కేటాయింపుగా ఉంటాయని అధికారులు వివరించారు. పరిమితంగా లభించే నీటి వనరులను అత్యంత పొదుపుగా వినియోగించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రవాటాగా లభించే స్వల్ప నీటి నిల్వలను ప్రధానంగా తాగునీటి చెరువులు నింపడానికి మాత్రమే వినియోగించాలని స్పష్టం చేశారు. ఎల్నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి లభ్యతపై అనిశ్చిత పరిస్థితులుండే అవకాశం ఉన్నందున ప్రతి నీటి చుక్కను సమర్ధవంతంగా వినియోగించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. తాగునీటికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ నీటి నిర్వహణ చేపట్టాలని అధికారులకు సూచించారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సమర్ధవంతమైన వాటర్ మేనేజ్మెంట్తో రాయలసీమ ప్రజలకు తాగునీటి భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మాదిరిగా ముందుచూపు లేకుండా నీటిని వినియోగిస్తే రిజర్వాయర్లలో నిల్వలు ఉండవన్నారు. కరువు పరిస్థితుల్లో ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించి అప్రమత్తం చేయాల్సిన బాధ్యత ప్రతిపక్షాలపై కూడా ఉందని మంత్రి అన్నారు. అయితే ప్రజలను తప్పుదోవ పట్టించేలా రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం సరికాదని సూచించారు. ఎల్నినో నేపథ్యంలో 2027 జూలై వరకు తాగునీటికే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్రం సూచించిన పరిస్థితుల్లో, రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో నీటి నిర్వహణ చేపడుతోందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. రాయలసీమ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందని, అందుబాటులో ఉన్న నీటిని ప్రాధాన్యతా క్రమంలో వినియోగిస్తూ ప్రజలకు తాగు నీటి భద్రత కల్పిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

సమావేశంలో ఎమ్మెల్యే లు కాల్వ శ్రీనివాసులు, పరిటాల సునీత, జేసి అస్మిత్ రెడ్డి, బండారు శ్రావణి, బొగ్గుల దస్తగిరి, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, జయ నాగేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ బిటి నాయుడు, ఆలూరు ఇన్ఛార్జి వైకుంఠం జ్యోతి, మంత్రాలయం ఇన్ఛార్జి రాఘవేంద్రరెడ్డి, ఆధోని టిడిపి ఇన్ఛార్జి మీనాక్షి నాయుడు, ఇరిగేషన్ సలహాదారులు ఎం వెంకటేశ్వర రావు, ఈఎన్సీలు నరసింహమూర్తి, వరప్రసాద్, కర్నూలు సిఈ కబీర్ భాషా, తుంగభద్ర డ్యాం సిఈ నారాయణ నాయక్, కడప సిఈ బాలచంద్రరెడ్డి, ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

## హైకోర్టులో మీడియేషన్ సెంటర్

- ఆర్బిట్రేషన్ సెంటర్ ఏర్పాటుకూ గ్రీన్‌సిగ్నల్
- ఏవో పోస్టు భర్తీకి కేబినెట్ ఆమోదం
- సత్వర న్యాయ సేవల విస్తృతం కోసం చర్యలు
- న్యాయ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి



అమరావతి (చైతన్య రథం): రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం హైకోర్టులో మీడియేషన్ సెంటర్, ఆర్బిట్రేషన్ సెంటర్ ఏర్పాటుకు మంత్రివర్గ సమావేశంలో ఆమోద ముద్ర వేసినట్టు న్యాయ, మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో న్యాయ శాఖకు సంబంధించిన రెండు కీలకమైన అంశాలకు ఆమోద ముద్ర వేసిన విషయాలను మంత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు. 14మంది సిబ్బందితో మీడియేషన్ సెంటర్‌తో పాటుగా 15మంది సిబ్బందితో ఆర్బిట్రేషన్ సెంటర్ ఏర్పాటుకు ఆమోదముద్ర వేయడం జరిగిందన్నారు. హైకోర్టులో పరిపాలన సౌలభ్యం కోసం ఒక అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ) పోస్టును డైరెక్టరేట్ ఆఫ్ ప్రిజన్స్ కింద పనిచేస్తున్న పీపీ లేదా ఏపీపీ ద్వారా డిప్యుటేషన్‌పై భర్తీ చేయడానికి కూడా మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపిందని మంత్రి ఫరూక్ తెలిపారు. రాష్ట్రంలో న్యాయ సేవలను ప్రజలకు మరింత చేరువచేయడానికి, విస్తృత చర్యలు తీసుకోవడంలో భాగంగా పరిపాలనాపరంగా కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి, సత్వర న్యాయానికి ప్రత్యేకంగా దృష్టిసారించి న్యాయ శాఖకు సంబంధించిన అన్ని విషయాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. ఇప్పటికే హైకోర్టులో "రిజిస్ట్రార్" (కోర్టు కేస్ అండ్ మేనేజ్మెంట్) పోస్టు సృష్టికి కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) చట్టం కింద నమోదయ్యే కేసుల విచారణ కోసం విశాఖపట్నంలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేశామన్నారు. న్యాయ సేవలను విస్తృతం చేయడంద్వారా న్యాయ స్థానాలలో పెండింగ్ కేసులను తగ్గించేదుకు వీలు కలుగుతుందని న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.

## తీర ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- శాసన సభలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రానికి ప్రకృతి సిద్ధంగా లభించిన తీర ప్రాంత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, తీరప్రాంత అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి వెల్లడించారు. పోర్టులు, ఫిషింగ్ హార్బర్‌లలో మౌలిక సదుపాయాల కల్పనపై మంగళవారం అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సమాధానమిచ్చారు. కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టుల్లో కోల్డ్ స్టోరేజ్, మౌలిక సదుపాయాల సమస్యలు ప్రభుత్వం దృష్టిలో ఉన్నాయని, త్వరలో వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, అదానీ కృష్ణపట్నం పోర్టు యాజమాన్యం నేలటూరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు సీఎస్ఆర్ నిధులు రూ.25 కోట్లు ఇవ్వడానికి అంగీకరించారని, ఇప్పటికే రూ.15 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. పెండింగ్ అంశాలను పరిష్కరించి, మత్స్యకారులకు ఇబ్బంది లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. శ్రీకాకుళం జిల్లా బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ పనులు వేగవంతం చేస్తామని, మంచినీళ్లపేట ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. పశ్చిమగోదావరి జిల్లా బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్‌ను ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌గా మార్చామని చెబుతూ.. పూడిమడక ఫిషింగ్ హార్బర్‌లో సవరించిన పరిపాలన అనుమతులు మంజూరు కావాల్సి ఉందన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం తీరప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉందని, త్వరలో రాష్ట్రంలో చేపట్టిన అన్ని పోర్టులు, ఫిషింగ్ హార్బర్ ప్రాజెక్టులు పూర్తి చేయనున్నట్టు మంత్రి జనార్ధన్ రెడ్డి వెల్లడించారు.

### హస్తకళలకు సాంకేతికత జోడించి

## మార్కెట్ అవకాశాలు కల్పించాలి

**ఏపీహెచ్‌డీసీ క్రాఫ్ట్‌టెక్ హ్యాకథాన్-2026లో చైర్మన్ హరిప్రసాద్**



అమరావతి (చైతన్య రథం): సంప్రదాయ హస్తకళలకు ఆధునిక సాంకేతికత, డిజైన్, ఆవిష్కరణలను అనుసంధానం చేసి కళాకారులకు కొత్త మార్కెట్లు, మెరుగైన జీవనోపాధి అవకాశాలు కల్పించడమే ఏపీహెచ్‌డీసీ క్రాఫ్ట్‌టెక్ హ్యాకథాన్-2026 ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ హస్తకళా నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ అన్నారు. మంగళగిరిలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ నందు ఏపీహెచ్‌డీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రాఫ్ట్‌టెక్ హ్యాకథాన్-2026 తుది పోటీ, ప్రోటోటైప్ ప్రదర్శన మరియు మూల్యాంకన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దక్షిణ భారతదేశంలోని వివిధ ప్రాంతాలనుంచి మొత్తం 60మంది కళాకారులు పోటీల్లో పాల్గొనగా, ప్రతిభ ఆధారంగా 12 మందిని తుదిదశకు ఎంపిక చేశారు. తుది మూల్యాంకన అనంతరం అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురిని విజేతలుగా ఎంపిక చేశారు. తుది దశలో పాల్గొన్న కళాకారులు తమ వినూత్న ప్రోటోటైప్‌లను జ్యూరీ సభ్యుల ముందు ప్రదర్శించారు. ఓఎస్‌డీ లక్ష్మీనాథ్, డీసీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ అపర్ణా లక్ష్మి, స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌కు చెందిన మాధవరావు తదితరులు జ్యూరీ సభ్యులుగా పాల్గొని ప్రోటోటైప్‌లను పరిశీలించి మూల్యాంకనం చేశారు. ఈ సందర్భంగా పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ, "మన సంప్రదాయ హస్తకళలు మన సాంస్కృతిక సంపద. వాటికి సాంకేతికత, ఆధునిక డిజైన్, మార్కెట్ అవసరాలను జోడిస్తే మన కళాకారుల ప్రతిభకు ప్రపంచస్థాయి గుర్తింపు లభిస్తుంది" అన్నారు. కళాకారుడి చేతిలోని సంప్రదాయ నైపుణ్యానికి సాంకేతికత తోడైతే.. ఆ కళకు కొత్త మార్కెట్, కళాకారుడికి కొత్త భవిష్యత్తు ఏర్పడుతుంది అని పేర్కొన్నారు. క్రాఫ్ట్‌టెక్ హ్యాకథాన్‌లో సంప్రదాయ హస్తకళా బొమ్మలకు ఇంటరాక్టివ్, యాంత్రిక సాంకేతికతను జోడించడం, సహజ మరియు స్థానిక పదార్థాలతో స్థిరమైన ఆహార-గ్రేడ్ ప్యాకేజింగ్ పరిష్కారాలను అభివృద్ధి చేయడంవంటి అంశాలపై పాల్గొనేవారు వినూత్న పరిష్కారాలను రూపొందించారు. కేవలం పోటీలకే పరిమితం కాకుండా, అత్యుత్తమ ప్రోటోటైప్‌లను భవిష్యత్తులో ఉత్పత్తులుగా అభివృద్ధి చేసి, మార్కెట్‌కు అనుసంధానం చేసే దిశగా ఏపీహెచ్‌డీసీ కృషి చేస్తుందని తెలిపారు. "సంప్రదాయం నుంచి ఆవిష్కరణ వైపు.. ఆవిష్కరణ నుంచి మార్కెట్ వైపు" అనే లక్ష్యంతో ఏపీహెచ్‌డీసీ ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళాకారుల నైపుణ్యాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేసి, వారికి స్థిరమైన ఆదాయం, కొత్త మార్కెట్లు మరియు మెరుగైన అవకాశాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యంగా వివరించారు. కార్యక్రమంలో హస్త కళా నైపుణ్యాభివృద్ధి సంస్థ డైరెక్టర్ ఆర్డీఎస్ ప్రసాద్, యశస్వినీ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం

**మంత్రి కొలుసు పార్థసారథి**

అమరావతి (చైతన్య రథం): బీసీ సంక్షేమం ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని గృహ నిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పనపై మాట్లాడుతూ.. "రాష్ట్రంలో తొలిసారి బీసీలకు స్థానిక సంస్థల్లో 24 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత టీడీపీది. దాన్ని 34 శాతానికి పెంచి బీసీలకు సమాజంలో సముచిత గౌరవాన్నిచ్చి బీసీలకు అండగా నిలిచిన బాంధవుడు చంద్రబాబునాయుడు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి బీసీల రిజర్వేషన్‌ను 34శాతం నుండి 24శాతానికి తగ్గించి అన్యాయం చేస్తే.. నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రిమండలి సమావేశంలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్‌ను 34 శాతానికి పెంచుతూ తీసుకున్న నిర్ణయం బీసీలకు వరం. తెలుగుదేశంపార్టీకి వెన్నెముకగా నిలుస్తున్న బీసీలకు అడుగడుగునా అండగా నిలుస్తున్న చరిత్ర చంద్రబాబుది. నా బీసీలు అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు చేసిన జగన్మోహన్‌రెడ్డి బీసీలను నయవంచన చేశారు. 10శాతం రిజర్వేషన్లు తగ్గించడం వల్ల 2019-24 మధ్య 16,800మంది బీసీలు పదవులకు దూరమయ్యారు. బీసీల సంక్షేమం అంటూ 56 కార్పొరేషన్లు పెట్టి, వాటిని అలంకారప్రాయంగా మార్చడంతో పాటు, విధులు, నిధులులేని కార్పొరేషన్లుగా చేసి బీసీలకు అన్యాయం చేశారు. 2014-19 మధ్య కాలంలో 90శాతం రాయితీతో బీసీలకు ఆదరణ పథకం ద్వారా పనిముట్లు అందించే విధానంపై గొడ్డలివేటు వేసి, బీసీల సంక్షేమానికి మంగళంపాడిన నీచ చరిత్ర జగన్మోహన్ రెడ్డిది. అన్ని రంగాల్లో బీసీల గౌరవాన్ని పెంచేలా చంద్రబాబు తీసుకుంటున్న చర్యలు, జాగ్రత్తలపట్ల బీసీలంతా సంతోషంగా ఉన్నారు. జగన్మోహన్ రెడ్డి కుట్రపూరితంగా తగ్గించిన బీసీ రిజర్వేషన్‌ను నేడు 34శాతానికి పెంచుతూ మంత్రిమండలి సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయంపట్ల బీసీల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు. బీసీల రిజర్వేషన్ కొనసాగించేందుకు హైకోర్టు కాదంటే సుప్రీంకోర్టుకు కూడా వెళ్లేందుకు వెనకడుగు వేసే ప్రసక్తే లేదు. నేడు దళవాయి రమాదేవి అనే ఒక



బీసీ సామాజికవర్గానికి చెందిన సామాన్య కార్యకర్తకు పెద్దలసభలో స్థానాన్ని కల్పించి బీసీల ఆత్మగౌరవాన్ని పెంచారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత నారా లోకేష్, ఎన్డీయే నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు. బీసీల సంక్షేమం, అభివృద్ధి, సమాజంలో సముచిత స్థానం, గౌరవం చంద్రబాబుతోనే సాధ్యం" అని మంత్రి కొలుసు పేర్కొన్నారు.ఓన్లీ ఫొటో క్యాప్షన్: ఐటెం వస్తే మాత్రం ఇస్తాను.

# ప్రభుత్వ పాలసీలకు విస్తృత ప్రచారం

**మంత్రి జనార్ధన్‌రెడ్డిని కలిసిన అసోచామ్ ప్రతినిధులు**



అమరావతి (చైతన్య రథం): జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కీలక పాలసీలు, విధానపరమైన నిర్ణయాలను ప్రోత్సహించడంతోపాటు, విస్తృత ప్రచారం కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని అసోచామ్ ప్రతినిధి బృందం పేర్కొంది. సచివాలయంలోని ఆర్ అండ్ బి శాఖ కార్యాలయంలో మంగళవారం మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని కలిసిన అసోచామ్ సీనియర్ డైరెక్టర్లు ప్రేమిందర్ జీత్ కౌర్, వరుణ్ అగర్వాల్, సౌత్ స్టేట్స్ రీజనల్ డైరెక్టర్ మచ్చా దినేష్‌బాబు.. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిని వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనతో పెట్టుబడులు ఆకర్షణ, వాణిజ్యం, పరిశ్రమల వృద్ధికివున్న అనుకూలమైన వాతావరణాన్ని సద్వినియోగం చేసుకుని విస్తృతస్థాయి ప్రచార కల్పనకు కలిసి పని చేస్తామని తెలిపారు. గ్లోబల్‌గా ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌కు విస్తృతస్థాయిలో ప్రచారం కల్పించేందుకు ఉన్న అవకాశాలను మంత్రికి అసోసియేషన్ ప్రతినిధులు వివరించారు. అసోఛామ్ ప్రతినిధుల ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందించిన మంత్రి.. పూర్తిస్థాయి ఆలోచనలతో ముందుకు వస్తే, రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా కలిసి ముందుకు సాగుదామని హామీనిచ్చారు.

# ఆలయ ఉద్యోగాల్లో జోనల్ విధానం లేదు

**మెరిట్‌కే ప్రాధాన్యం: మంత్రి ఆనం రామనారాయణ**



అమరావతి (చైతన్య రథం): దేవాలయాల్లో అర్చకులు, వేద పండితులు, పరిచారకులు, ఇతర ధార్మిక సిబ్బంది నియామకాల్లో జోనల్ విధానం అమల్లో లేదని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా శాసనసభలో దేవాలయాల్లో ఉద్యోగాలకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ప్రధాన దేవాలయాల్లో అర్చకులు, వేద పండితుల నియామకాల్లో రాయలసీమకు అన్యాయం జరుగుతోందన్న విషయం ప్రభుత్వం దృష్టికి రాలేదని తెలిపారు. ఇటీవల భర్తీ చేసిన 344 పోస్టుల్లో 172 పోస్టులను రాయలసీమ ప్రాంతంలోని ప్రధాన దేవాలయాల్లో భర్తీ చేశామని చెప్పుకొచ్చారు. శ్రీశైలం, మహానంది, శ్రీకాళహస్తి, కాణిపాకం వంటి ప్రధాన దేవాలయాల్లో ఖాళీలను నిబంధనల ప్రకారం నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తున్నామని వెల్లడించారు. ప్రాంతంతో సంబంధం లేకుండా వేద, ఆగమ పరిజ్ఞానం, అర్హత, ప్రతిభ, మెరిట్‌కే ప్రాధాన్యం ఇస్తున్నట్లు మంత్రి చెప్పారు. ప్రముఖ దేవాలయాలకు చెందిన వేద, ఆగమ పండితులను ఎంపిక కమిటీల్లో సభ్యులుగా నియమించి ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. సుమారు 1,400 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరయ్యారని.. పోటీ తీవ్రంగా ఉండటంతో ఒకటి, రెండు మార్కుల తేడాతోనూ ఎంపికలు జరిగాయని తెలిపారు. రాయలసీమ ప్రాంతం నుంచి 1,431 దరఖాస్తులు వచ్చాయని.. అర్హత సాధించిన వారిలో 172 మందికి అవకాశం లభించిందని ఆనం తెలిపారు. వేదం, సంస్కృతం, ఆగమ పరిజ్ఞానంవంటి అంశాల ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక జరిగిందన్నారు. నియామక ప్రక్రియను వీడియో రికార్డింగ్‌తో అత్యంత పారదర్శకంగా నిర్వహించామని పేర్కొన్నారు. ఇంటర్వ్యూల రికార్డింగ్‌ను అభ్యర్థులకు కూడా చూపించే విధంగా పారదర్శకత పాటించామన్నారు. కృష్ణ యజుర్వేదం, శుక్ల యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేద నియామకాల్లోనూ అర్హత, వేద పరిజ్ఞానం, మెరిట్ ఆధారంగానే ఎంపికలు జరిగాయని చెప్పారు.

రాయలసీమ జోన్-4 పరిధిలో ప్రధాన దేవాలయాల్లో 440 పోస్టులు ఉన్నాయని.. ప్రస్తుతం జోన్-4 పరిధిలో 245 మంది పనిచేస్తున్నారని.. 147 పోస్టులు ఖాళీగా ఉన్నాయని మంత్రి అన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను నిబంధనల ప్రకారం త్వరలో భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రధాన దేవాలయాల్లో భక్తులకు శాస్త్రోక్తంగా, ఆగమబద్ధంగా సేవలు అందించేందుకు నైపుణ్యం కలిగిన అర్చకులు, వేద, ఆగమ పండితులు అవసరమన్నారు. రాయలసీమతో సహా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అర్హులకు పూర్తి పారదర్శకతతో, మెరిట్ ఆధారంగా న్యాయం జరిగేలా నియామకాలు జరిగాయని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు.

# సినీ పరిశ్రమకు కూటమి అండ

**- అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం**

**- మంత్రి కందుల దుర్గేష్**

విజయవాడ (చైతన్య రథం): రాష్ట్రంలో కళలను, కళాకారులను ప్రోత్సహించడంతోపాటు చిత్ర పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.
విజయవాడలోని ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో 'విబి ఎంటర్‌టైన్‌మెంట్స్' ఆధ్వర్యంలో 'సేవ్ ఆర్టిస్ట్ -సేవ్ టాలెంట్' పేరుతో నిర్వహించిన "వెండితెర మరియు ఓటీటీ అవార్డ్స్ 2025-26" కార్యక్రమానికి సినిమాటోగ్రఫీ మంత్రి దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడూతూ... విజయవాడ మొదటి నుంచీ సాంస్కృతిక, సినీ వ్యాపార రంగానికి అనుకూల ప్రాంతమని, ఇక్కడి నుంచి ఎందరో గొప్ప నటులు, సాంకేతిక నిపుణులు చిత్రసీమకు వెళ్లి ఉన్నత స్థానాలకు చేరుకున్నారని కొనియాడారు.
ఆంధ్రప్రదేశ్‌లో షూటింగ్‌లు జరుపుకునే చిత్రాలకు ఉచితంగా, సింగిల్ విండో విధానం ద్వారా వేగంగా అనుమతులు మంజూరు చేస్తున్నామని తెలిపారు.
రాష్ట్రంలో అద్భుతమైన లొకేషన్లు ఉన్నాయని, ఇక్కడ డబ్బింగ్ థియేటర్లు, రికార్డింగ్ థియేటర్లు, రీ రికార్డింగ్ థియేటర్ల ఏర్పాటుకు నిర్మాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే టాలీవుడ్ నిర్మాతలను ఈ విషయమై చర్చలు జరిపామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, స్వయాన కళాకారుడైన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో సినీ పరిశ్రమను విస్తరింపజేస్తామని చెప్పారు. మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ముందుకు వచ్చే వారికి భూ కేటాయింపులు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. హైదరాబాద్ తరహాలోనే విజయవాడలోనూ తరచూ సినీ ఈవెంట్లు, అవార్డు వేడుకలు నిర్వహించాలని, ప్రతి ఏటా ఈ అవార్డుల కార్యక్రమాన్ని దిగ్విజయంగా కొనసాగించాలని నిర్వాహకులకు సూచించారు. మంత్రి కందుల దుర్గేష్ పట్టుదల, చొరవ వల్ల ఆంధ్రప్రదేశ్‌లో చిత్ర పరిశ్రమకు మళ్లీ మంచి రోజులు వచ్చాయని వేడుకకు హాజరైన సినీ ప్రముఖులు ప్రశంసించారు. మన సంస్కృతిని పరిరక్షిస్తూ, యువ కళాకారుల కలలకు ప్రాణం పోయడమే ఈ అవార్డుల ప్రధాన ఉద్దేశమని విబి ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా రామకృష్ణ నిర్మాతగా, శరత్ దర్శకత్వంలో విక్రమ్, శ్రీగాయత్రి నటీనటులుగా పల్లెటూరి ప్రేమ కథగా తెరకెక్కిన "ఉత్తరం" సినిమా సాంగ్‌ను లాంచ్ చేశారు. మ్యూజిక్ డైరెక్టర్ మహిమదన్ మ్యూజిక్ బాగుందని కొనియాడుతూ సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యులు కేవిస్ రామారావు, ప్రముఖ హీరో వడ్డే నవీన్, సంగీత దర్శకులు రఘు కుంచె, సినీ నటులు దివ్యవాణి, అనిత, రాజీవ్ కనకాల, సమీర భరద్వాజ్, ఆట సందీప్, జ్యోతి, బింబిసార మూవీ ఫేమ్ బేబీ శ్రీదేవి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ అంబికా కృష్ణ, కార్యక్రమ నిర్వాహకులు విష్ణు బొప్పన, రవికుమార్, అనిత తదితరులు పాల్గొన్నారు.






# రెవెన్యూ రికార్డుల గోల్‌మాల్




- వైసీపీ నేతల ఆగడాలపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు
- గుండ్లపాడులో భూరికార్డుల గోల్‌మాల్..
- పట్టాదారు పేరు తొలగించి ఇతరుల పేర్లు నమోదు
- కోర్టు ఆర్డర్లను కాలరాస్తూ తమ్ముడి భూకబ్జా యత్నం
- ఉప్పలపాడులో రెవెన్యూ అధికారుల మాయాజాలం..
- క్షేత్రస్థాయి పరిశీలన లేకుండానే రికార్డుల మార్పు
- అర్జీలు స్వీకరించిన పెరిక అభివృద్ధి సొసైటీ ఛైర్మన్ వనపర్తి వీరభద్రరావు, ఖాదీ, గ్రామీణ పరిశ్రమల బోర్డు ఛైర్మన్ కేకే చౌదరి

మంగళగిరి (చైతన్య రథం): పెరిక అభివృద్ధి సొసైటీ ఛైర్మన్ వనపర్తి వీరభద్రరావు, ఏపీ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల బోర్డు ఛైర్మన్ కేకే చౌదరి సారథ్యంలో టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన బాధితులు భూ సమస్యలు, రెవెన్యూ రికార్డుల అక్రమాలపై అర్జీలు అందించారు. తిరుపతి జిల్లా కేవీబీపురం మండలం కాట్రపల్లికి చెందిన పూడి మధన్‌కు వారసత్వంగా వచ్చిన 2.80 ఎకరాల భూమిపై కోర్టు ఇంజంక్షన్ ఆర్డర్, పోలీస్ ప్రొటెక్షన్ ఉన్నా, వైసీపీ స్థానిక సర్పంచ్, ఎంపీపీ తదితరులు తనను పొలంలోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నారని, ఆ భూమిని 'గ్రామ స్థలం'గా చూపుతూ తప్పుడు ఫిర్యాదుతో ఎమ్మార్వో నోటీసులు పంపారని ఫిర్యాదు చేశాడు. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన కంబంపాటి ఏసుబాబుకు చెందిన 1.49 సెంట్ల భూమి ఆన్‌లైన్ రికార్డుల నుంచి తన పేరు తొలగించి ఇతరుల పేర్లు అక్రమంగా నమోదు చేశారని, తిరిగి తన పేరు నమోదు చేయాలని కోరాడు. అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె మండలం తవళానికి చెందిన ఎద్దుల క్రిష్ణప్పకు కోర్టు ఇంజంక్షన్ ఆర్డర్ ఉన్నా, తన సొంత తమ్ముడు ఎద్దుల రామచంద్ర కుటుంబం 0.54 సెంట్ల పిత్రార్జిత భూమిని ఆక్రమించేందుకు యత్నిస్తు న్నారని, పోలీసులకు తప్పుడు సమాచారం ఇస్తూ వేధిస్తున్నారని ఫిర్యాదు చేశాడు. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం ఉప్పలపాడుకు చెందిన సింగాల మల్లికార్జునరావుకు 40 ఏళ్లుగా స్వాధీనంలో ఉన్న 1.90 ఎకరాల భూమిని 2026 మార్చిలో ముందస్తు నోటీసులు, క్షేత్రస్థాయి పరిశీలన లేకుండానే తహశీల్దార్, సర్వేయర్, వీఆర్వో కుమ్మక్కై బైరెడ్డి వెంకటరెడ్డి పేరిట మార్చారని, ఆర్డీవో సైతం విచారణ చేయలేదని ఫిర్యాదు చేశాడు.

గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం ముట్లూరుకు చెందిన అనంతయ్యకు చెందిన 2.35 సెంట్ల పట్టా భూమిని ముందస్తు సమాచారం లేకుండా 22ఏ నిషేధిత జాబితా లో చేర్చడంతో 12 మంది వాటాదారులు క్రయవిక్రయాలు చేసుకోలేకపోతున్నామని వాపోయాడు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం అబ్బూరుకు చెందిన తొర్లికొండ నాగేశ్వరరావుకు హైకోర్టు తీర్పు అనుకూలంగా ఉన్నా (డబ్ల్యూపీ నెం. 10275/2000), 1.47 ఎకరాల భూమిని 22ఏ జాబితాలో చేర్చడంతో బ్యాంకు రుణాలు, రిజిస్ట్రేషన్లు నిలిచిపోయా యని ఫిర్యాదు చేశాడు. అనంతపురం జిల్లా రాయదుర్గంకు చెందిన సుశీలమ్మకు 2006లో మంజూరైన పట్టా స్థలంలో భాగమైన 0.02 సెంట్ల స్థలాన్ని పొరుగువారు, మాజీ కౌన్సిలర్ కలిసి ఆక్రమించి బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేసింది. పల్నాడు జిల్లా యడ్లపాడుకు చెందిన వెంకాయమ్మకు తన కుమారుడు శ్రీనివాస్ 2 సెంట్ల ఇంటిస్థలాన్ని పూర్తిగా తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకుని, ఆర్డీవో ఆదేశించినా తిరిగి రాయకుండా బెదిరిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. ఏలూరు జిల్లా పోలవరం మండలం పాతపట్టిసానికి చెందిన సుభాషిణికి చెందిన గోదావరి తీరాన 0.85 సెంట్ల గ్రామకంఠం భూమిలోని 'శ్రీ రామకృష్ణ గీతా ఆశ్రమాన్ని' తెలగంశెట్టి వెంకటేశ్వరరావు 2018లో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని, మహిళా నిర్వాహకులపై దాడులకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేసింది. వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణ సమస్యలపై అర్జీలు ఇవ్వగా, మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు, ఆర్థిక సాయం కోరుతూ అభ్యర్థనలు అందించారు.

# బీసీ రిజర్వేషన్ల పునరుద్ధరణ హర్షణీయం

- సాధారణ బీసీ మహిళకు ఎమ్మెల్సీ
- బీసీలకు ఒకే రోజు రెండు పండుగలు
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వ్యాఖ్య



అమరావతి (చైతన్య రథం): ఈరోజు రాష్ట్ర బీసీ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ అధ్యాయమని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతోపాటు ఈ బిల్లుపై అసెంబ్లీలో చర్చ జరగడం ముదావహమన్నారు. స్థానిక ఎన్నికల్లో గ్రామాల్లో 34 శాతం, పట్టణ ప్రాంతాల్లో 33.33 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయం తీసుకోవడంతో బీసీలకు నిజమైన రాజ్యాధికారం కల్పించినట్లైందన్నారు. రిజర్వేషన్ల పెంపు మాట నెరవేర్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. బీసీ అంటే తెలుగుదేశం.. తెలుగుదేశం అంటే బీసీ అని, బీసీల అభ్యున్నతికి తమ ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని మంత్రి కొండపల్లి అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లు 34నుంచి 24 శాతానికి తగ్గించిందని.. 10 శాతం రిజర్వేషన్లు తగ్గడంతో బీసీలు ఎన్నో పదవులు కోల్పోయారన్నారు. గత వైసీపీ పాలనలో బీసీలు రాజకీయంగానే కాకుండా అన్ని విధాలా అణిచివేతకు గురయ్యారని మంత్రి విమర్శించారు. యువగళం పాదయాత్రలో బీసీలకు జరిగిన అన్యాయం తెలుసుకున్న నారా లోకేష్ దీనిని సరి చేస్తానని హామీ ఇచ్చినట్టుగానే ఈరోజు స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లు 34 శాతానికి పునరుద్ధరించడంలో కీలక పాత్ర పోషించారని మంత్రి కొనియాడారు. గత 40 ఏళ్లలో ఎందరో బీసీ రాజకీయ యోధులను తయారు చేసిన రాజకీయ ఖార్ఖానా తెలుగుదేశం అని మంత్రి వ్యాఖ్యానించారు. బీసీ రిజర్వేషన్లు 34 శాతానికి పునరుద్ధరించిన రోజే బీసీ వర్గానికి చెందిన సాధారణ అంగన్వాడీ మహిళ దళవాయి రమాదేవిని ఎమ్మెల్సీకి ఎంపిక చేయాలని నిర్ణయం తీసుకోవడంతో ఒకే రోజు బీసీలకు రెండు పండగలు వచ్చినట్లైందని మంత్రి శ్రీనివాస్ పేర్కొన్నారు.

# పరిశ్రమల్లో పచ్చని సంకల్పం

- పకడ్బందీగా 33 శాతం గ్రీన్ కవర్ ప్రణాళికలు
- ఆచరణలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలు
- ఫస్ట్‌ఫేజ్‌లో 26 పరిశ్రమల్లో 14 రోజుల ప్రత్యేక కార్యాచరణ
- 129 ఎకరాల్లో 43,300 మొక్కలు నాటిన పారిశ్రామికవర్గాలు
- మిగిలిన పరిశ్రమల్లో అమలుకు డిప్యూటీ సీఎం దిశానిర్దేశం




అమరావతి (చైతన్య రథం): పారిశ్రామిక ప్రగతితోపాటు పర్యావరణ పరిరక్షణకు సమ ప్రాధాన్యమివ్వాలన్న డిప్యూటీ సీఎం, అటవీ, పర్యావరణ మంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచనలు కార్యరూపం దాలుస్తున్నాయి. పర్యావరణాన్ని పరిరక్షించే అభివృద్ధి ప్రస్థానం అనే మూల సిద్ధాంతాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు కాలుష్య నియంత్రణ మండలి ద్వారా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నారు. ప్రతి పరిశ్రమ తన పరిధిలోని భూభాగంలో 33 శాతం పచ్చదనంతో నింపాలన్న నిబంధనను కచ్చితంగా అమలు చేసే విధంగా రూపొందించిన ప్రణాళిక ఫలితాన్నిస్తోంది. పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు మొదటి దశలో జిల్లాకు ఒకటి చొప్పున పరిశ్రమను ఎంపిక చేసి రెండు వారాల్లో గ్రీన్ కవర్ లక్ష్యాలను చేరుకునేలా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జులై 28న ప్రారంభమైన డ్రైవ్ ఆగస్టు 11నాటికి ముగిసింది. 26 జిల్లాల పరిధిలో ఎంపిక చేసిన 26 పరిశ్రమలు నిర్దేశిత లక్ష్యాన్ని కేవలం 14 రోజుల్లో సాధించాయి. మొత్తం 129 ఎకరాల విస్తీర్ణంలో 43,300 మొక్కలు నాటారు. స్థానిక వాతావరణ పరిస్థితులు, నేలసారం ఆధారంగా అనువైన దేశీయ జాతులతోపాటు పండ్ల మొక్కలు, సుందరీకరణకు ఉపయోగించే మొక్కలు, వేప, కానుగ, రావి, నేరేడు తదితర జాతులకు ప్రాధాన్యత ఇచ్చారు. భారీ పరిశ్రమలు విడుదల చేసే వాయు కాలుష్యాన్ని హరించి, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి అందించే సంకల్పాన్ని పవన్ కళ్యాణ్ ముందుకు తీసుకువెళ్తున్నారు. పరిశ్రమల ఉత్పాదకత, ఉపాధి కల్పనకే పరిమితం కాకుండా పర్యావరణ సమతుల్యత పాటించేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి వేగం పుంజుకున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ బాధ్యతను ముందుకు తీసుకువెళ్లాల్సిన ఆవశ్యకతను చాటి చెబుతున్నారు. తొలి దశ 33 శాతం గ్రీన్ కవర్ విజయవంతంగా పూర్తి కావడంతో కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో కట్టుదిట్టంగా అమలు చేస్తూ, రాష్ట్రంలో మిగిలిన పరిశ్రమలు కూడా గ్రీన్ కవర్ లక్ష్యంలో భాగస్వాములయ్యేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులకు పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వికసిత్ భారత్-2047 విజన్‌లో భాగంగా రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి శాఖ, ప్రతి పరిశ్రమ, బాధ్యతాయుతంగా కట్టుబడి పనిచేయాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు.




*రాష్ట్ర అభివృద్ధికి వ్యవసాయం ఎంత కీలకమో, రైతు కుటుంబాల ఆదాయాన్ని పెంచడంలో సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక రంగాలు కూడా అంతే కీలకమైనవి. గత రెండేళ్లలో (2024-25, 2025-26) రాష్ట్ర ప్రభుత్వం ఈ మూడు శాఖల్లో అమలు చేసిన సంస్కరణలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా గణనీయమైన ఫలితాలు అందించాయి. రైతుకు రుణం నుంచి మార్కెట్ వరకు, ఎరువుల నుంచి పశుసంవర్ధక సేవల వరకు ప్రతి దశలో పారదర్శకత, సాంకేతికత, సేవల విస్తరణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది.*

# రైతులకు నిరంతర సహకారం


- సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక రంగాల్లో గణనీయమైన ప్రగతి
- కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో పారదర్శక, సాంకేతిక సేవలు

సహకార రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోంది. గత రెండేళ్లలో సహకార బ్యాంకుల ఆర్థిక బలం గణనీయంగా పెరిగింది. 2026 మార్చి నాటికి జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల (డీసీసీబీ) రుణాల పంపిణీ రూ.44,197 కోట్లకు చేరుకుంది. ఇది 2024తో పోలిస్తే 12.10 శాతం పెరుగుదల. మొత్తం 22.44 లక్షల మంది రైతులు ఈ రుణాల ద్వారా లబ్ధి పొందారు.

రాష్ట్ర సహకార బ్యాంకు (ఆప్కాబ్) పనితీరు కూడా విశేషంగా మెరుగుపడింది. మొత్తం వ్యాపారం రూ.43,972 కోట్ల నుంచి రూ.49,057 కోట్లకు పెరిగింది. డిపాజిట్లు 20.28 శాతం పెరిగి రూ.12,397 కోట్లకు చేరగా రుణాలు 8.90 శాతం పెరిగి రూ.36,660 కోట్లకు చేరుకున్నాయి. లాభదాయకత కూడా గణనీయంగా పెరిగి పన్నుల అనంతర లాభం రూ.228 కోట్లకు చేరింది. డీసీసీబీల మొత్తం వ్యాపారం కూడా రెండు సంవత్సరాల్లో రూ.52,979 కోట్ల నుంచి రూ.60,698 కోట్లకు పెరిగింది. డిపాజిట్లు 21.75 శాతం, రుణాలు 12.10 శాతం పెరగడం సహకార వ్యవస్థపై రైతుల విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది.

### ఈ-ప్యాక్స్ ద్వారా డిజిటల్ విప్లవం

రాష్ట్రంలోని 2,021 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను పూర్తిగా కంప్యూటరీకరించడం ఈ రెండేళ్లలో జరిగిన అతి పెద్ద సంస్కరణల్లో ఒకటి. రూ.64.24 కోట్ల వ్యయంతో అన్ని పీఏసీఎస్‌లను ఈ-పీఏసీఎస్‌గా మార్చి ఆధార్ ఆధారిత ఈ-కేవైసీ, డిజిటల్ సభ్యత్వ ధ్రువీకరణ, సీసీఎల్ఏ, జీఎస్‌డబ్ల్యూఎస్ అనుసంధానం, మొబైల్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. 6,000కు పైగా డిజిటల్ టచ్ పాయింట్ల ద్వారా రైతుల ఇంటి వద్దకే సేవలు చేరుతున్నాయి. 2024-25 నుంచి పూర్తిస్థాయి ఈ-ఆడిట్ విధానాన్ని ప్రవేశపెట్టి పారదర్శక ఆడిట్ వ్యవస్థను అమలు చేయడం మరో కీలక సంస్కరణ.




### సహకార సంఘాలకు కొత్త వ్యాపార అవకాశాలు

సహకార సంఘాలను కేవలం రుణాలకే పరిమితం చేయకుండా బహుళ సేవా కేంద్రాలుగా ప్రభుత్వం అభివృద్ధి చేసింది.

-1,951 పీఏసీఎస్‌లు కామన్ సర్వీస్ సెంటర్లుగా మారి 300కు పైగా డిజిటల్ సేవలు అందిస్తున్నాయి.

- 1.29 లక్షల సేవా లావాదేవీల ద్వారా గ్రామీణ ప్రజలకు రూ.10.93 కోట్ల విలువైన సేవలు అందాయి.



-1,155 పీఏసీఎస్‌లు ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలుగా పనిచేస్తున్నాయి.

- 57 పీఏసీఎస్‌లు పెట్రోల్ బంకులు నిర్వహిస్తున్నాయి.
- జన ఔషధి కేంద్రాల సంఖ్య 74 నుంచి 90కు పెరిగి గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ ధరలకు మందులు అందుబాటులోకి వచ్చాయి.

### ఎరువుల పంపిణీలో పారదర్శకత

సహకార సంఘాల ద్వారా ఎరువుల పంపిణీ గణనీయంగా పెరిగింది. 2024-25లో 12.08 లక్షల మంది రైతులకు 4.78 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు పంపిణీ చేయగా 2025-26లో 20.72 లక్షల మంది రైతులకు 7.54 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు పంపిణీ చేశారు. లబ్ధిదారుల సంఖ్య దాదాపు 87 శాతం పెరగడం విశేషం.

### వరి కొనుగోళ్లలో కొత్త రికార్డు

రైతులకు గిట్టుబాటు ధర అందించడంలో సహకార సంఘాలు కీలక పాత్ర పోషించాయి. 2023-24లో 25.99 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేయగా 2024-25లో అది 35.50 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగింది. 2025-26లో 43.46 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేసి 7.82 లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్పించారు.

### మార్కెటింగ్ శాఖ-ధరల స్థిరీకరణకు భారీ చర్యలు

రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో మార్కెటింగ్ శాఖ గత రెండేళ్లలో కీలక పాత్ర పోషించింది. ధరల స్థిరీకరణ నిధి కింద 2025-26లో రూ.428.33 కోట్లు కేటాయించగా... ఇప్పటికే రూ.342.05 కోట్లు విడుదల చేసి వివిధ మార్కెట్ జోక్య చర్యలు చేపట్టారు.

- మామిడి: 4.85 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు ద్వారా 48,734 మంది రైతులకు లబ్ధి.
- కోకో: 2,370 మెట్రిక్ టన్నుల కొనుగోలు.
- ఉల్లిపాయలు: 16,068 మెట్రిక్ టన్నుల కొనుగోలు.
- ఉల్లిపాయ ధర పరిహారంగా 37,752 మంది రైతులకు రూ.128.33 కోట్లు నేరుగా జమ. మొత్తంగా రూ.342 కోట్లతో 5.03 లక్షల మెట్రిక్ టన్నుల పంట కొనుగోలు చేసి 94వేల మందికిపైగా రైతులకు మద్దతు అందించారు.

### టమాటా, పత్తి రైతులకు అండగా ప్రభుత్వం



టమాటా ధరలు పడిపోయినప్పుడు ప్రభుత్వం మార్కెట్ జోక్యం చేసుకుని రైతుల నుంచి నేరుగా కొనుగోళ్లు చేపట్టి రైతు బజార్ల ద్వారా విక్రయించింది. పత్తి రైతులకు సీసీఐ ద్వారా కొనుగోళ్లు నిర్వహించి 2024-25లో రూ.1,478 కోట్ల విలువైన పత్తి కొనుగోలు చేయగా, 2025-26లో రూ.1,557 కోట్ల విలువైన కొనుగోళ్లు జరిగాయి.

### ఆధునిక మార్కెటింగ్ వ్యవస్థ

రైతు సేవా కేంద్రాల స్థాయిలో అగ్రివాచ్ ఆధారిత ధరల పర్యవేక్షణ, ఈ-నామ్ విస్తరణ, మార్కెట్ యార్డుల ఆధునికీకరణ, డిజి రైతుబజార్ల ద్వారా ఇంటి వద్దకే కూరగాయల సరఫరా వంటి చర్యలు మార్కెటింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేశాయి.

### గ్రామీణాభివృద్ధికి బలమైన పునాది

గత రెండేళ్లలో సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖలు అమలు చేసిన సంస్కరణలు కేవలం గణాంకాలకే పరిమితం కాలేదు. రైతుకు తక్కువ వడ్డీతో రుణం, పారదర్శక ఎరువుల పంపిణీ, గిట్టుబాటు ధర, డిజిటల్ సేవలు, పశుసంవర్ధక అభివృద్ధి, మార్కెట్ జోక్యాలు వంటి సమగ్ర చర్యల ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశను చూపించాయి.

**శశికుమార్**
తెలుగుదేశం సైనికుడు



### పశుసంవర్ధక రంగంలో రెండేళ్ల ప్రగతి

దేశంలో గుడ్ల ఉత్పత్తిలో మొదటి స్థానం, మాంస ఉత్పత్తిలో నాలుగో స్థానం, పాల ఉత్పత్తిలో ఏడో స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ రంగం రాష్ట్ర జీఎస్‌డీపీలో 12.17 శాతం వాటాతో 25 లక్షల కుటుంబాలకు జీవనాధారంగా ఉంది. 2025-26లో ఈ రంగం రూ.1.76 లక్షల కోట్ల స్థూల విలువ సాధించగా 2028-29 నాటికి రూ.3 లక్షల కోట్ల లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది.

పశుసంవర్ధక సేవల్లో గణనీయ పురోగతి. రెండేళ్లలో...

- 3.30 లక్షల సెక్స్ సార్టెడ్ సీమన్ వినియోగం



- 30,313 గోకులాలు ఏర్పాటు
- 31,202 మెట్రిక్ టన్నుల పశుగ్రాసం పంపిణీ
- 4,217 మెట్రిక్ టన్నుల పశుగ్రాస విత్తనాల పంపిణీ
- 26,512 పశు ఆరోగ్య శిబిరాల నిర్వహణ
- 60వేల పశువులకు బీమా సదుపాయం

ఈ కార్యక్రమాల ద్వారా పశుసంవర్ధక రంగంలో ఉత్పాదకత పెరగడంతో పాటు పశుపోషక రైతుల ఆదాయం కూడా మెరుగుపడుతోంది.

# ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి



ఎచ్చెర్ల (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న "రెండేళ్ల నమ్మకం - సంక్షేమం, అభివృద్ధి" కార్యక్రమంలో భాగంగా విజయనగరం పార్లమెంట్‌సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు మంగళవారం ఎచ్చెర్ల నియోజకవర్గం, ఎచ్చెర్ల మండలం హెడ్ క్వార్టర్‌లో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను కలిసి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి, తల్లికి వందనం, పెన్షన్ పెంపు, రైతు సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తూ పారదర్శక పాలన అందిస్తోందన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రతి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా పూర్వపు అధ్యక్షులు చౌదరి నారాయణమూర్తి, స్టేట్ కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వర్, మండల పార్టీ అధ్యక్షులు బెండు మల్లేశ్వరరావు, జనరల్ సెక్రటరీ వావులపల్లి రామకృష్ణ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గాలి వెంకటరెడ్డి, గాడు రామారావు, ముకల్ల భాస్కర్ రావు, విలేకర్ శ్రీరాములు, జరుగుళ్ళ వెంకటరమణ మూర్తి నాయుడు, జరుగుళ్ళ రవీంద్ర నాయుడు, జరుగుళ్ళ రామ్ నాయుడు, జె రాజారావు, జె నాగరాజు, చిలక శేఖర్, లచ్చుపోతు అప్పలనాయుడు, కుప్పిలి పోలరావు, గుంటూరు సంతోషం కుమార్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాతృభాష తెలుగును పరిరక్షించేందుకు విద్యావ్యవస్థలో మార్పులు అవసరం

**●తెలుగు భాష అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.10 కోట్లు కేటాయించిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు : యార్లగడ్డ**



గన్నవరం (చైతన్యరథం): మాతృభాష తెలుగును పరిరక్షించడం కోసం విద్యావ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. అసెంబ్లీలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యారంగంలో ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలను అభినందించారు. ముఖ్యమంత్రి తెలుగు భాష అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.10 కోట్లు కేటాయించడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యారంగంలో అనేక సంస్కరణలు అమలు చేస్తున్నారని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టుల భర్తీ చేయటం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర వంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ ఆధారిత విద్య, స్మార్ట్ తరగతి గదులు, డిజిటల్ బోధన వంటి ఆధునిక విధానాలను ప్రవేశపెట్టడం ద్వారా విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాలు 85.25 శాతానికి చేరుకోవడం, ప్రైవేటు పాఠశాలల నుంచి లక్ష మందికిపైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం ఈ మార్పుకు నిదర్శనమన్నారు. అయితే రాష్ట్రంలో తెలుగు భాష పరిస్థితిపై యార్లగడ్డ ఆందోళన వ్యక్తం చేశారు.

**తెలుగు బోధనలో అవసరమైన మార్పులపై అధ్యయనం చేయించాలి**

విద్యార్థులు తెలుగు మాట్లాడగలుగుతున్నా చదవడం, రాయడం రాని పరిస్థితి ఉండటం బాధాకరమన్నారు. ఇంటర్మీడియట్‌లో ద్వితీయ భాషగా తెలుగును ఎంచుకునే అవకాశం తగ్గిపోవడం కూడా ఇందుకు ఒక కారణమని చెప్పారు. కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు ర్యాంకులు, మార్కుల కోసం విద్యార్థులను ఇతర భాషల వైపు మళ్లిస్తున్నాయని పేర్కొన్నారు. మాతృభాషలో విద్యార్థుల ప్రావీణ్యం తగ్గిపోతున్న విషయాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని కోరారు. పదో తరగతి పరీక్షల్లో తెలుగులో 37,679 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించలేకపోయారని, అదే సమయంలో హిందీలో 1436 మంది, ఆంగ్లంలో సుమారు 8,771 మంది మాత్రమే ఫెయిల్ అయ్యారని తెలిపారు. మాతృభాషలోనే ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులు వెనుకబడటం ఆందోళన కలిగించే అంశమన్నారు. తెలుగు భాషను కేవలం ఒక పాఠ్యాంశంగా కాకుండా విద్యార్థుల్లో ఆసక్తి పెంచేలా బోధనా విధానంలో మార్పులు తీసుకురావాలని సూచించారు. గణితం, సైన్స్ మాదిరిగానే తెలుగులోనూ విద్యార్థులు 99 మార్కులు సాధించేలా ప్రశ్నపత్రాల రూపకల్పన, పరీక్షా విధానంలో మార్పులు చేయాలని కోరారు. వ్యాకరణం, క్లిష్టమైన పద్యాలకే పరిమితం కాకుండా గిడుగు రామమూర్తి పంతులు సూచించిన వ్యవహారిక భాషకు ప్రాధాన్యం ఇచ్చేలా పాఠ్యాంశాలను మార్చాలని యార్లగడ్డ సూచించారు. విద్యావేత్తలు, తెలుగు ఉపాధ్యాయులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి తెలుగు బోధనలో అవసరమైన మార్పులపై అధ్యయనం చేయించాలని ప్రభుత్వాన్ని కోరారు. భవిష్యత్ తరాలకు మాతృభాషను అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని, విద్యతోపాటు తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణకు ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇవ్వాలని అసెంబ్లీ వేదికగా యార్లగడ్డ వెంకట్రావు కోరారు.

# ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో డ్రైనేజీ సమస్యలపై దృష్టి



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 54వ డివిజన్ ఏనుగుల వారి వీధి ప్రాంతంలో డివిజన్ పార్టీ అధ్యక్షులు ఎస్.కే జీజ్ ఆధ్వర్యంలో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బుద్దా వెంకన్న పాల్గొని స్థానిక ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు ప్రధానంగా డ్రైనేజీ సమస్యలు, మురుగునీటి పారుదల, కాలువల నిర్వహణ తదితర సమస్యలను బుద్దా వెంకన్న దృష్టికి తీసుకువచ్చారు. డ్రైనేజీ సమస్యల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన స్వయంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని బుద్దా వెంకన్న తెలిపారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటికి పరిష్కారం చూపడమే 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోమహమ్మద్ ఫతావుల్లా, షేక్అశ, వడ్డది రమణ, ఉమామహేశ్వరరావు, కె.లక్ష్మి దుర్గ, షేక్ కరీముల్లా, షేక్ అజీజ్, సయ్యద్ సలీం, షేక్ తాజుద్దీన్, సత్తార్, ఫజల్, సాదిక్, జాహిద్, గంగాధర్ రెడ్డి, విజయలక్ష్మి, సురభి బాలు, కె శివ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బీసీల సాధికారతే సమాజ సాధికారత

**●అసెంబ్లీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హర్షం**

అమరావతి (చైతన్యరథం): బీసీల అభివృద్ధి రాష్ట్ర అభివృద్ధికి, బీసీల సాధికారత సమాజ సాధికారతకు దోహదపడుతుందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాల్లో భాగంగా బీసీల హక్కులు, రిజర్వేషన్లపై సభలో మాట్లాడిన ఆయన.. స్థానిక సంస్థల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్ల పునరుద్ధరణకు సంబంధించిన కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించారు. ప్రజాస్వామ్యానికి దేవాలయమైన శాసనసభలో వెనుకబడిన వర్గాల హక్కులు, రిజర్వేషన్ల వంటి కీలక అంశాలపై మాట్లాడే అవకాశం కల్పించినందుకు స్పీకర్‌కు ఆదిరెడ్డిశ్రీనివాస్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

**ఎన్టీఆర్, చంద్రబాబు కృషితో బీసీలకు రాజకీయ ప్రాధాన్యం**

బీసీల రాజకీయ సాధికారతకు పునాది వేసిన వారిలో నందమూరి తారక రామారావు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కీలక పాత్ర పోషించారని శ్రీనివాస్ పేర్కొన్నారు. సమాజంలో ఎన్నో ఏళ్లుగా అణగారిన బీసీ వర్గాలకు కేవలం ఆర్థిక సహాయం అందించడం మాత్రమే సరిపోదని, వారికి రాజకీయ అధికారం దక్కినప్పుడే సంపూర్ణ సాధికారత సాధ్యమవుతుందని గుర్తించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. ఎన్టీఆర్ హయాంలో రాష్ట్రంలో 25శాతం రిజర్వేషన్లకు పునాది పడగా, ఆ తర్వాత చంద్రబాబునాయుడు వాటిని 34 శాతానికి పెంచి స్థానిక సంస్థల్లో చట్టబద్ధంగా అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. బీసీలు తెలుగుదేశం పార్టీకి వెన్నెముకగా ఉంటారని, అయితే బీసీల రాజకీయ అభ్యున్నతికి, ఉన్నతికి తెలుగుదేశం పార్టీనే అసలైన పునాది వేసిందని శ్రీనివాస్ పేర్కొన్నారు.



**నా రాజకీయ ప్రస్థానానికి రిజర్వేషన్లే పునాది**

రిజర్వేషన్ల ద్వారా బీసీ వర్గాలకు రాజకీయంగా ఎదిగే అవకాశాలు లభిస్తాయని చెప్పిన ఆదిరెడ్డి శ్రీనివాస్.. తన కుటుంబమే అందుకు ప్రత్యక్ష నిదర్శనమని అన్నారు. రిజర్వేషన్ల కారణంగా తన తల్లి ఆదిరెడ్డి వీర రాఘవమ్మ రాజమహేంద్రవరం తొలి మహిళా మేయర్‌గా అవకాశం పొందారని, ఆమె వేసిన పునాదే ఈరోజు తాను శాసనసభ్యుడిగా చట్టసభలోకి రావడానికి మార్గం సుగమం చేసిందని గుర్తుచేశారు.

**బీసీల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధి**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. బీసీలకు మరోసారి న్యాయం చేసేందుకు తీసుకుంటున్న ఈ చారిత్రాత్మక నిర్ణయానికి శాసనసభ మద్దతు ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, అలాగే ఈ నిర్ణయం తీసుకోవడంలో కీలక బాధ్యత వహించిన వారందరికీ ఒక బీసీ బిడ్డగా, బీసీ వర్గాల ప్రతినిధిగా మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు. "బీసీల అభివృద్ధి రాష్ట్ర అభివృద్ధి.. బీసీల సాధికారతే సమాజ సాధికారత" అనే సంకల్పంతో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ తన ప్రసంగాన్ని ముగించారు.

# రాజమహేంద్రవరంలో టీడీపీ ఇంటింటి ప్రచారం



రాజమహేంద్రవరం (చైతన్యరథం): నియోజకవర్గం హుకుంపేట గ్రామంలోని రామకృష్ణ నగర్‌లో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆదేశానుసారం "రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన డోర్ టు డోర్ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు, ఆరోగ్య విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవిరామ్ కిరణ్ రూరల్ మండల అధ్యక్షులు మత్సేటి ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవిరామ్ కిరణ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు డోర్ టు డోర్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రజల నుంచి వచ్చే స్థానిక సమస్యలు, సూచనలను సంబంధిత అధికారుల ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. పేదలు, మహిళలు, రైతులు, యువత, వృద్ధులు సహా అన్ని వర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో హుకుంపేట గ్రామంలో మరింత అభివృద్ధి జరిగేలా ప్రజాప్రతినిధులు, నాయకులు సమన్వయంతో పనిచేస్తారని రవిరామ్ కిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, దుద్దుపూడి రమేష్, బొప్పన నానాజీ, తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ నగరంలో మృతదేహాల కలకలం... తొమ్మిది మానవ పుర్రెలు

విశాఖ (చైతన్యరథం): నగరంలో మృతదేహాలు బయటపడటం తీవ్ర కలకలం రేపింది. రోడ్డు మరమ్మతుల కోసం మట్టిని తరలిస్తుండగా.. నాలుగు మృతదేహాలు, తొమ్మిది మానవ పుర్రెలు బయటపడటం స్థానికంగా తీవ్ర సంచలనంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. విశాఖలోని షీలానగర్ జంక్షన్ వద్ద పోర్టు కనెక్టివిటీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇందుకోసం ఇతర ప్రాంతాల నుంచి మట్టిని తరలిస్తున్నారు. ఆ మట్టిలో మానవ అస్థిపంజరాలు, పుర్రెలు కనిపించాయి. అది గమనించిన స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురై, వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.

జోన్ - 3 (మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట)

చైతన్యరథం

## గుంటూరు జిల్లా ఎస్టీల తీరనున్న దశాబ్దాల కోరిక

**● మంత్రి నారా లోకేష్, పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు చొరవతో అందుబాటులోకి గిరిజన భవనం**



గుంటూరు (చైతన్యరథం): గుంటూరు జిల్లా గిరిజన బిడ్డల దశాబ్దాపు కాలం ఎదురుచూస్తున్న కల నెరవేరబోతుందని మేడా రామకృష్ణ అన్నారు. గత ఏడాది ఆగష్టు 3 తేదీన మంత్రి నారా లోకేష్ బాబుకు సోషల్ మీడియా ద్వారా గుంటూరు టౌన్ నందు అడవి తక్కెళపాడులోని గిరిజనభవనం గురించి తెలియజేయగా వెంటనే జిల్లా కలెక్టర్‌కు గిరిజన భవనం అభివృద్ధి పనులు వెంటనే జరగాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ గిరిజన భవనం గురించి తెలియజేయగా ఖచ్చితంగా అతి త్వరలో ప్రారంభోత్సవం జరుగుతుందని జిల్లా గిరిజన బిడ్డలకు మాట ఇచ్చియన్నారన్నారు. నాడు నేడు గిరిజనుల అభివృద్ధి ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. వైసీపీ పాలనలో ఆ గిరిజన భవనం ఊసే లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో ఆ గిరిజన భవనము రూపురేకలే మారిపోయాయి అన్నారు. అంతేకాకుండా పక్కనే ఉన్నటువంటి గిరిజన బాలుర హాస్టల్ బిల్డింగ్స్ కూడా అభివృద్ధి జరిగాయన్నారు. గుంటూరు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గిరిజన రాజకీయ నాయకులకు అతీతంగా వివిధ గిరిజన సంఘాలకు అతీతంగా గిరిజన ఎంప్లాయిస్ మరియు గిరిజన విద్యార్థులతో అంగరంగ వైభవంగా గిరిజన భవనం ప్రారంభోత్సవం అతి త్వరలో జరగుతుందని మేడా రామకృష్ణ పేర్కొన్నారు.

## గుడివాడలో లెగసీ వేస్ట్ తొలగించని ఏజన్సీపై పట్టాభిరామ్ ఆగ్రహం

**●మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి పరిస్థితి చక్కదిద్దే ప్రయత్నం**



గుడివాడ (చైతన్యరథం): కృష్ణా జిల్లా గుడివాడ మున్సిపాల్టీలోని డంపింగ్ యార్డ్ లో లెగసీ వేస్ట్‌ని తొలగించే ఏజన్సీ నిర్లక్ష్య వైఖరిపై స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్‌లో లెగసీ వేస్ట్ త్వరితగతిన తొలగించకపోవడం వల్ల, పట్టణంలో రోజువారీ వచ్చే చెత్తని డంప్ చేయడం మున్సిపాల్టీకి పెద్ద సమస్యగా మారింది. విషయం తెలుసుకున్న చైర్మన్ పట్టాభిరామ్ మంగళవారం గుడివాడ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, ఇతర అధికారులతో మాట్లాడి, లెగసీ వేస్ట్‌ని తొలగించడంలో ఏజన్సీవారి జాప్యం వల్ల సమస్య తలెత్తినట్లు తెలుసుకున్నారు. ప్రతిరోజూ వచ్చే చెత్తని తరలించే విషయంలో మున్సిపాల్టీవారు ఇబ్బందులుపడుతుంటే, ఏజన్సీ వారు లెగసీవేస్ట్‌ని తొలగించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లెగసీవేస్ట్ తొలగించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఏజన్సీవారిని ఆదేశించారు. లెగసీ వేస్ట్‌ని వెంటనే తొలగించకపోతే తగిన చర్యలు తీసుకుంటామని కూడా చైర్మన్ పట్టాభిరామ్ హెచ్చరించారు.

## విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌ని కలిసిన బుద్ధా వెంకన్న



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు బుద్ధా వెంకన్న మంగళవారం విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడ నగరంలో శాంతిభద్రతలు, ప్రజా భద్రత, పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ప్రజలకు మెరుగైన భద్రతా వాతావరణం కల్పించడంలో పోలీస్ శాఖ చేస్తున్న కృషిని బుద్ధా వెంకన్న అభినందించారు.

# బీసీల రాజకీయ సాధికారతకు చారిత్రాత్మక అడుగు

**●స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల దిశగా కేబినెట్ నిర్ణయం హర్షణీయం**

**●ఎన్టీఆర్‌తో మొదలైన బీసీల రాజకీయ సాధికారతకు సీఎం చంద్రబాబు నాయకత్వంలో మరింత బలం**

**●బీసీలను ఓటు బ్యాంకుగా కాకుండా అధికారంలో భాగస్వాములుగా నిలిపిన పార్టీ తెలుగుదేశం: జీవీ ఆంజనేయులు**




వినుకొండ (చైతన్యరథం): స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతులకు రాజకీయ ప్రాతినిధ్యం మరింత పెంచేలా రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం బీసీల రాజకీయ సాధికారతలో మరో చారిత్రాత్మక అడుగు అని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.13 శాతం రిజర్వేషన్ల అమలు దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన హృదయపూర్వకంగా స్వాగతించారు. బీసీలకు రాజకీయంగా పెద్దపీట వేసిన చరిత్ర తెలుగుదేశం పార్టీదేనని జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. నందమూరి తారక రామారావు స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించి సామాజిక న్యాయానికి బలమైన పునాది వేస్తే, అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బీసీలకు మరిన్ని రాజకీయ అవకాశాలు కల్పిస్తూ ఆ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. ఇప్పుడు స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా అడుగులు వేయడం ఆ ప్రయాణంలో మరో కీలక మైలురాయి అని పేర్కొన్నారు. "బీసీలు తెలుగుదేశం పార్టీకి కేవలం ఓటు బ్యాంకు కాదు... పార్టీ ఆవిర్భావం నుంచి జెండా మోసిన వెన్నెముక. వారి శ్రమకు, త్యాగాలకు రాజకీయ అధికారంతో గౌరవం ఇవ్వాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం" అని జీవీ ఆంజనేయులు స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహించిన పార్టీ టీడీపీ అని అన్నారు. సామాన్య కుటుంబాల నుంచి వచ్చిన బీసీ నాయకులను చట్టసభలకు పంపడంతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా తీర్చిదిద్దిన ఘనత తెలుగుదేశం పార్టీదేనన్నారు. బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచే కీలక నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి, మంత్రి నారా లోకేష్‌కి, రాష్ట్ర మంత్రివర్గానికి బీసీల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు.

# గత ప్రభుత్వ తప్పిదాల వల్లే పోలంపల్లి ప్రాజెక్టు డిజైన్‌లో లోపాలు

**● డిజైన్లు మార్చి ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలి : ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్**



జగ్గయ్యపేట (చైతన్యరథం): నియోజకవర్గం, వత్సవాయి మండలం పరిధిలోని పోలంపల్లి ప్రాజెక్టు గత ప్రభుత్వ కాలంలో చేసిన తప్పిదాల వలన సరైన డిజైన్ లేకుండా నిర్మించబడిందని, దాని ఫలితంగా ఆ ప్రాజెక్టు కింద ఉన్న 26 గ్రామాల రైతులకు సాగునీరు సక్రమంగా అందక ఏళ్ల తరబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన సభ దృష్టికి తీసుకువచ్చారు. రైతులు పడుతున్న ఈ కష్టాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత ప్రభుత్వం చొరవ తీసుకుని ఆ ప్రాజెక్టు డిజైన్‌ను సమూలంగా మార్పు చేసి, సంబంధిత అన్ని శాఖల ద్వారా అవసరమైన సాంకేతిక అనుమతులను పొందడం జరిగిందని, ప్రస్తుతం నిధులు విడుదల చేయడం ఒక్కటే మిగిలి ఉందని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య వివరించారు. ఇటీవల ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లాలోని అందరి శాసన సభ్యులతో సమావేశమై, ఆయా నియోజకవర్గాల్లోని ఫైనాన్స్, నాన్-ఫైనాన్స్ సమస్యలపై సమగ్రంగా చర్చించి, ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులను గుర్తించాలని కోరిన సందర్భంగా, పోలంపల్లి ప్రాజెక్టు జగ్గయ్యపేట నియోజకవర్గంలోని రైతులకు అత్యంత కీలకమైనదని, దీనికి తక్షణమే నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందని శాసన సభ్యులు స్పష్టం చేశారు.

# ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టేందుకు ప్రజల సహకారం అవసరం

**●సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై గుంటూరు నగర పాలక సంస్థ కఠిన చర్యలు అభినందనీయం : ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



గుంటూరు (చైతన్యరథం): నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించేందుకు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ (జీఎంసీ) చేపడుతున్న చర్యలు అభినందనీయమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. ప్లాస్టిక్ కాలుష్యం నేడు పర్యావరణానికే కాకుండా మానవాళికి, పశుపక్ష్యాదులకు తీవ్ర ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఒక సెల్ఫీ వీడియో ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని, అనేక జీవరాశులు ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని, ఈ సమస్యను నివారించేందుకు ప్రభుత్వం, అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని గతంలో ఎన్నోసార్లు కోరినట్లు తెలిపారు. ఆ దిశగా జీఎంసీ అధికారులు ముందడుగు వేయడం సంతోషకరమన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయదారులకు, వినియోగదారులకు ఇప్పటికే నెల రోజుల క్రితమే నోటీసులు జారీ చేసి అవగాహన కల్పించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నిర్దేశిత ప్రమాణాలకు లోబడని ప్లాస్టిక్ ఉత్పత్తులను పూర్తిగా నిషేధించాలని సూచించినప్పటికీ కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, అందుకే జీఎంసీ అధికారులు నిబంధనలను ఉల్లంఘించిన వారి వద్ద నుంచి పెద్ద ఎత్తున ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుంటున్నారని చెప్పారు. అయితే కేవలం వ్యాపారులను నియంత్రించడం మాత్రమే సరిపోదని, ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. ప్రతి ఇంట్లో ప్లాస్టిక్ వ్యర్థాల కోసం ప్రత్యేక డస్ట్‌బిన్ ఏర్పాటు చేసుకోవాలని, నీటి సీసాలు, చిప్స్ ప్యాకెట్లు, ఇతర ప్లాస్టిక్ వస్తువులను వేరు చేసి నిల్వ చేయాలని సూచించారు. వారానికి ఒకసారి వాటిని పారిశుధ్య సిబ్బందికి అప్పగించేలా అలవాటు చేసుకోవాలని కోరారు. జీఎంసీ ఆధ్వర్యంలో ఇంటింటి చెత్త సేకరణలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఇతర చెత్తతో కలిపి ఇస్తే వాటిని తిరస్కరించే విధానాన్ని అమలు చేయాలని సూచించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను కూడా బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : వైవీబీ రాజేంద్రప్రసాద్



ఉయ్యూరు (చైతన్యరథం): జెడ్పీహెచ్ పాఠశాలలో వ్యాపార వేత్త దండమూడి కిషోర్ సౌజన్యంతో ఏర్పాటు చేస్తున్న సరస్వతి దేవి విగ్రహా నిర్మాణానికి మాజీ ఎమ్మెల్సీ వై.వీ.బీ రాజేంద్ర ప్రసాద్ మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసి నాణ్యమైన విద్యను అందించేందుకు మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని అందుకనే ఎన్నికలలో ఇచ్చినహామీనీ నిలబెట్టుకుంటూ మెగా డీఎస్సీని పారదర్శకంగా నిర్వహించి సుమారు పదహారు వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేశారని అంతే కాకుండా ప్రైవేట్ పాఠశాలకు ధీటుగా పాఠశాలలో కూడా విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ, మరియు మౌలిక సదుపాయాలు కల్పించారని రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట నాగేశ్వరావు, దండమూడి కిషోర్, స్కూల్ ఛైర్మెన్ ఆరేపల్లి శివ సాయి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దివ్యాంగులకు అండగా వీపీఆర్ ఫౌండేషన్.. ఇద్దరికి ఎలక్ట్రిక్ ట్రైసైకిళ్ల పంపిణీ

**●కందుకూరు నియోజకవర్గానికి చెందిన బాధితులకు పంపిణీ చేసిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి**

**● నెల్లూరు జిల్లాలో ఇప్పటివరకు 1,042 ఎలక్ట్రిక్ ట్రైసైకిళ్ల పంపిణీ**



నెల్లూరు (చైతన్యరథం): జిల్లాలో వీపీఆర్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా కందుకూరు నియోజకవర్గానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మంగళవారం ఉచితంగా ఎలక్ట్రిక్ ట్రైసైకిళ్లను అందజేశారు. తీవ్రమైన శారీరక వైకల్యం, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న బాధితులకు ఈ వాహనాలు ఎంతో ఉపయోగపడతాయని ఎంపీ ఈ సందర్భంగా తెలిపారు. వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఇప్పటివరకు నెల్లూరు జిల్లాలో 1,042 ఎలక్ట్రిక్ ట్రైసైకిళ్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమంలో భాగంగా కందుకూరు నియోజకవర్గం, లింగసముద్రం మండలం, రాచెరువు రాజుపాలెం గ్రామానికి చెందిన బినిగి కోటేశ్వరరావు అనే బాధితుడికి ఎలక్ట్రిక్ ట్రైసైకిల్ అందించారు. ఈయన రెండు కాళ్లు పనిచేయని స్థితిలో ఉండటంతో పాటు క్రమం తప్పకుండా డయాలసిస్ చేయించుకుంటున్న బాధితుడు కావడం గమనార్హం. అలాగే గుడ్లూరు మండలం, రామయ్యపట్నం (మూర్తిపేట) గ్రామానికి చెందిన చెట్రోలు రమణమ్మ అనే మహిళకు కూడా వాహనాన్ని పంపిణీ చేశారు. ఆటో ప్రమాదంలో కుడి కాలు తీవ్రంగా దెబ్బతిని నడవలేని స్థితిలో ఉన్న ఆమె, భర్తను కోల్పోయి ఇద్దరు కుమార్తెలతో పడుతున్న కష్టాలను గుర్తించి ఈ సాయం అందించారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ... ఆపదలో ఉన్న వారిని, దివ్యాంగులను ఆదుకోవడమే వీపీఆర్ ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**● నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలో పర్యటించిన కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి**



నెల్లూరు (చైతన్యరథం): ప్రజాబాటలో భాగంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 20వ డివిజన్, గంగోత్రినగర్ నందు స్మశానవాటిక సమస్యను స్థానిక నాయకులతో కలిసి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికారి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి సమస్య లేకుండా చేసేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు సూచించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి 20వ డివిజన్ అభివృద్ధికి 7 కోట్ల 80 లక్షల రూపాయలను కేటాయించడం జరిగిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చేజర్ల మహేష్, కో క్లస్టర్ ఇంచార్జ్ ఖాదర్ బాషా, 20వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు దారా మల్లి, నెల్లూరు రూరల్ టీడీపీ ఎస్.టి. సెల్ అధ్యక్షుడు పాలకుర్తి శ్రీనివాసులు, టీడీపీ నాయకులు అన్నంగి రమణయ్య, దిలీప్ రెడ్డి, మాసా శ్రీనివాసులు, నాటకారాని నవీన్, ఎమ్.సి. సుబ్రహ్మణ్యం, గంటా డేవిడ్, దామోదర్ రెడ్డి ఓల్లూరు బాల సిద్దయ్య, భాస్కర్ నాయుడు, దారా దయాకర్, కోవూరు సునీల్ మరియు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడును రోడ్డు ప్రమాదాల రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం




పల్నాడు (చైతన్యరథం): పల్నాడు జిల్లాను రోడ్డు ప్రమాదాల రహిత జిల్లాలిగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు స్పష్టం చేశారు. మంగళవారం పల్నాడు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధ్యక్షతన జరిగిన "జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ" సమీక్షా సమావేశంలో ఎంపీ ముఖ్య అతిథిగా పాల్గొని, అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలో ఎక్కడా రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు, ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల మధ్య పూర్తి స్థాయి సమన్వయం ఉండాలని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో గుర్తించిన 34 బ్లాక్ స్పాట్స్‌లలో (వీటిలో 16 జాతీయ రహదారులపై ఉన్నాయి) ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు.

# డీఎస్సీపై లోకేష్ సవాల్‌ను జగన్ స్వీకరించాలి

**●ప్రజా సమస్యలు గాలికొదిలేసి బెంగుళూరులో పబ్జీగేమ్ ఆడుకుంటున్న జగన్**

**శాసనసభకు రావాలి : టీడీపీ నేత సప్తగిరి ప్రసాద్**




చిత్తూరు (చైతన్యరథం): రాష్ట్ర శాసనసభలో డీఎస్సీ, ప్రజాసమస్యలపై చర్చ జరుగుతుంటే శాసనసభకు రాకుండా బెంగళూరులో యలహంకా ప్యాలెస్‌లో ఎల్లకిలా పడుకుని పబ్జీగేమ్ ఆడుకుంటున్న జగన్‌కు దమ్ముంటే డీఎస్సీపై చర్చకు రావాలని టీడీపీ అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ సవాల్ విసిరారు. మంగళవారం టీడీపీ నేతలతో కలిసి ఆయన మాట్లాడుతూ... డీఎస్సీలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగిందని, రోడ్డు ఎక్కి తన సొంత సాక్షి పేపర్లో డబ్బా కొట్టుకోవడం తప్పించి మరొకటి చేయడం లేదన్నారు. దమ్ముంటే నారా లోకేష్ విసిరిన సవాల్‌కు జగన్మోహన్‌రెడ్డి సిద్ధపడాలన్నారు. డీఎస్సీ పైన చర్చ చర్చించడానికి శాసనసభకు రావాలని, లోకేష్‌బాబు సవాలు విసిరితే కనీసం స్వీకరించే ధైర్యం, సాహసం కూడా జగన్ లేకపోవడం దురదృష్టకరమన్నారు. శాసనసభ వెలుపులైనా సరే చర్చించడానికి సిద్ధమా? అని నారా లోకేష్ అంటే జగన్... పత్తా లేకుండా పోయారని అన్నారు. శాసనసభకు వస్తే నీకు ఎంత సమయం కావాలంటే అంత సమయం ఇస్తామని సాక్షాత్తు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆఫర్ ఇచ్చినా! కానీ జగన్ మోహన్ రెడ్డి శాసనసభకు రావడానికి సాహసించడం లేదు! ఒకప్పుడు శాసనసభలో రంకె లు వేసిన జగన్... ఈరోజు శాసనసభలోకి రావాలంటేనే వణికిపోతున్నాడు. డీఎస్సీనే కాకుండా గ్రూప్ వన్‌లో జరిగిన అక్రమాలపై కూడా చర్చించడానికి సిద్ధంగానే ఉన్నామన్నారు. జగన్మోహన్‌రెడ్డి ఇటీవల మీడియా సమావేశాలు గంటలు గంటలు మాట్లాడే బదులు... శాసనసభలో మాట్లాడి ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. జగన్మోహన్ రెడ్డి చేస్తున్న విమర్శల వలన లక్షలాదిమంది నిరుద్యోగుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉంది. కష్టపడి చదివినటువంటి నిరుద్యోగులు యొక్క కష్టాన్ని అపహాస్యం చేసే విధంగా ఉందని సప్తగిరి ప్రసాద్ అన్నారు.

# రోడ్డు భద్రతపై బాధ్యతగా ఉండాలి : అసెంబ్లీ జీరో అవర్లో ఎమ్మెల్యే నసీర్

**● రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలి**



గుంటూరు (చైతన్యరథం): రోడ్డు భద్రత పై అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాహనదారులు పాటించాల్సిన నియమాల గురించి గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ అసెంబ్లీ సాక్షిగా ప్రజల్లో చైతన్యం కలిగించేలా ప్రసంగించారు. బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా జీరో అవర్‌లో వాహనాలపై రిఫ్లెక్టివ్ స్టిక్కర్స్ అంశంపై సభ దృష్టికి తీసుకొచ్చారు. రోడ్డు పై జరిగే ఒక ప్రమాదం ఒక కుటుంబాన్ని చిన్నాభిన్నం చేస్తుందని, దీనిపై ఎప్పటికప్పుడు చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలియజేశారు. 2023లో 19497 రోడ్డు ప్రమాదాలలో 8147 మంది మరణించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్డు భద్రత ప్రమాణాలను పాటిస్తున్నామని, అయితే ప్రమాదాల సంఖ్య తగ్గినప్పటికీ మరణాల సంఖ్య పదిహేను శాతం పెరిగిందని చెప్పారు. ఇది దేశంలోని సగటు కంటే ఎక్కువని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్ల నిర్మాణం చేపడుతూనే భద్రత చర్యలు తీసుకున్నామన్నారు. రాష్ట్రంలో రిఫ్లెక్టివ్ స్టిక్కర్స్ లేకపోవడం వల్ల అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిపై ప్రజల్లో చైతన్యం రావాలని చెప్పారు.


# కోట గురుకులం కాపాడండి! : ఎమ్మెల్యే పాశిం



అమరావతి (చైతన్యరథం): కోటలోని డా. బీఆర్ అంబేద్కర్ ఎస్సీ గురుకుల పాఠశాలను అదే ప్రాంతంలో కొనసాగించాలని, ఎక్సలెన్స్ కాలేజీ ఏర్పాటుకు తరలింపు అనివార్యమైతే చిల్లకూరు మండలం వరగలిలో ప్రత్యామ్నాయ ఎస్సీ గురుకులాన్ని ఏర్పాటు చేయాలని గూడూరు ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కోరారు. కోట, పరిసర గ్రామాలకు చెందిన దాదాపు 600 మంది నిరుపేద విద్యార్థులు ఈ గురుకులంపై ఆధారపడి చదువుతున్నారని, పాఠశాల మార్పుతో వారి చదువుకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పేద విద్యార్థులకు IIT, NEET కార్పొరేట్ స్థాయి కోచింగ్ అందించేందుకు ఎక్సలెన్స్ కాలేజీ ఏర్పాటు లక్ష్యాన్ని స్వాగతిస్తూనే.. "ఎక్సలెన్స్ కాలేజీ రావాలి.. పేద విద్యార్థుల గురుకులం కూడా నిలవాలి" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రుల అభ్యర్థనలను సీఎం దృష్టికి తీసుకెళ్లగా.. అంశంపై పునరాలోచించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని చంద్రబాబు హామీ ఇచ్చినట్లు పాశం సునీల్‌కుమార్ తెలిపారు.

# ప్రేమోన్మాదుల దురాగతాలకు బలైన మైనారిటీ యువతుల కుటుంబాలను ఆదుకోండి

**ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి విజ్ఞప్తి**



చిలకలూరిపేట (చైతన్యరథం): ప్రేమ మాయలో పడి... నమ్మిన యువకుల వంచనకు గురై, చివరకు వారి చేతుల్లోనే దారుణంగా హత్య గావింపబడిన యువతులు షేక్ హసీనా, ఆషా కుటుంబాల్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి విజ్ఞప్తి చేశారు. మంగళవారం అసెంబ్లీ వాయిదా అనంతరం సచివాలయంలో మర్యాదపూర్వకంగా ముఖ్యమంత్రిని కలిసిన ప్రత్తిపాటి.. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన నియోజకవర్గానికి చెందిన ఇద్దరు మైనారిటీ యువతుల హత్యోదంతాన్ని, కేసు పురోగతిలో పోలీసుల విచారణ తీరును సీఎంకు వివరించారు. మైనారిటీ వర్గానికి చెందిన ఇద్దరు యువతులు నమ్మిన వారిచేతిలోనే హత్యగావింపబడటం దురదృష్టకరమని, చేతికందివచ్చిన బిడ్డల్ని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న వారి కుటుంబాల్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని ఈ సందర్భంగా ప్రత్తిపాటి, ముఖ్యమంత్రి చంద్రబాబును వేడుకున్నారు. బాలికలు, యువతులు, మహిళల పట్ల ఉన్మాదుల్లా ప్రవర్తించేవారికి చట్టప్రకారం కఠిన శిక్షలు పడేలా, ప్రభుత్వపరంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబును ప్రత్తిపాటి కోరారు. ఎల్‌నినో ప్రభావం చిలకలూరిపేట నియోజకవర్గంపై అధికంగా ఉందని, ఈ పరిస్థితుల్లో ప్రజల తాగు, సాగునీటి అవసరాలు తీర్చే ఎత్తిపోతల పథకాల (లిఫ్ట్ లు) ఆధునీకరణకు అవసరమైన నిధులు, పాలనా అనుమతులు వెంటనే మంజూరయ్యేలా చూడాలని ప్రత్తిపాటి, ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. చిలకలూరిపేటలో నిర్మించాలనుకున్న మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని ప్రత్తిపాటి, సీఎం చంద్రబాబును కోరారు. పెండింగ్‌లో ఉన్న నియోజకవర్గ సీ.ఎం.ఆర్.ఎఫ్, ఎల్.వో.సీ దరఖాస్తుల్ని త్వరగా పరిష్కరించి, వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్యసేవలకు అవసరమైన నిధులు వెంటనే అందించి వారిని ఆదుకోవాలని ప్రత్తిపాటి, ముఖ్యమంత్రిని కోరారు.

# పామిడిలో ఇంటింటికీ కూటమి ప్రభుత్వం : టీడీపీ నేత వెంకట శివుడు యాదవ్



గుంతకల్లు (చైతన్యరథం): అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గం పామిడి పట్టణంలోని 3వ వార్డులో "ఇంటింటికీ కూటమి ప్రభుత్వం" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్ పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా వెంకట శివుడు యాదవ్ మాట్లాడుతూ... గత పాలనలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులకు ముగింపు పలికి, అభివృద్ధి-సంక్షేమాన్ని సమతుల్యంగా ముందుకు తీసుకెళ్లే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్, పేదలకు ఇళ్ల నిర్మాణం, రైతులకు రైతు సంక్షేమ కార్యక్రమాలు, యువతకు ఉద్యోగ-ఉపాధి అవకాశాలు, విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వివరించారు. "ప్రజల వద్దకు ప్రభుత్వం" అనే ఆలోచనతో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వివరాలను తెలియజేయడంతో పాటు, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు. అభివృద్ధి అంటే కేవలం మాటలు కాదని, గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం, మౌలిక వసతులు మెరుగుపడినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అందుకే కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలన అనే మూడు ప్రధాన లక్ష్యాలతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ యువతకు అండగా నిలిచే నాయకత్వానికి ప్రజల మద్దతు మరింత బలపడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో పామిడి పట్టణ అధ్యక్షులు బొమ్మ మోహన్, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ జింకల సంజీవ, యూనిట్ ఇంచార్జి ఓబులకృష్ణ, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ సీనా, మాజీ గుత్తి పట్టణ అధ్యక్షులు నరేంద్ర చౌదరి, రామాంజనేయులు, బూత్ కన్వీనర్ పవన్, ఐటీడీపీ పురుషోత్తం, జగన్, రవి, సుంకప్ప, సుధాకర్‌నాయుడు, దాదా, బాబావలి, తిమ్మప్ప, రాజేంద్ర, శివ శంకర్ తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పసికందు వైద్యానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



పర్చూరు (చైతన్యరథం): కరంచేడు గ్రామానికి చెందిన పేద బీసీ యాదవ కులానికి చెందిన మద్దిన పవన్ కుమార్, కొత్తగొర్ల నాగలక్ష్మి దంపతులకు 8 నెలలకే పుట్టిన ఆ చిన్నారి లోకాన్ని చూడకముందే ఐసియు బెడ్‌పై ఊపిరి కోసం కొట్టుమిట్టాడుతుంది. కళ్ళముందే కరిగిపోతున్న బిడ్డను చూసి గుండెలు పగిలేలా రోదించటం తప్ప ఆ పేద తల్లిదండ్రులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి. వేలల్లో కాదు... లక్షల్లో ఖర్చు అయ్యే కార్పొరేట్ వైద్యం ఆ పేద కుటుంబానికి అందని ద్రాక్షలా మారింది. ఆ కటిక చీకట్లో వారికి ఆశా కిరణంగా కనిపించారు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు. కన్నీళ్లతో తమ బిడ్డ ప్రాణాలు కాపాడమని వారు వేడుకున్నప్పుడు ఒక ప్రజా ప్రతినిధిగా కాకుండా ఒక మానవతావాదిగా బిడ్డ పరిస్థితి ఎంత విషమంగా ఉందో తెలుసుకొని ఆయన క్షణం ఆలస్యం చేయకుండా వెంటనే స్పందించి ముఖ్య మంత్రి సహాయనిధి సీఎంఆర్ఎఫ్ ద్వారా 5,02,838 రూపాయల ఎల్ఓసి మంజూరు చేయించారు. రాష్ట్ర ఆర్థిక స్థితి కష్టాల్లో ఉన్నా ఇలా ఎంతో మంది పేద ప్రజలకు అత్యవసర వైద్య కోసం కొన్ని కోట్ల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నిధులు మంజూరు చేయించారు. ఆసుపత్రిలో ఆ చిన్నారి ఇంకా సీరియస్ కండిషన్లోనే ఉంది. ప్రతిక్షణం ప్రాణంతో పోరాడుతుంది. కానీ ఆ పోరాటంలో ఆ పేద దంపతులు ఒంటరి వారు కాదు, మీ బిడ్డ కాపాడే బాధ్యత నాది అని అంటూ ఎమ్మెల్యే ఇచ్చిన కొండంత భరోసా ఆ కుటుంబానికి నరకప్రాయమైన సమయంలో పెద్దదిక్కుగా నిలిచింది. ఆ పసిప్రాణాన్ని కాపాడుకోవడం కోసం అంతలా తపిస్తున్న ఎమ్మెల్యే మానవత్వానికి నియోజకవర్గ ప్రజలు చేతులు ఎత్తి మొక్కుతున్నారు.

# గంజాయి విక్రయిస్తున్న నిందితుల అరెస్టు

బద్వేల్ (చైతన్యరథం): వైఎస్ఆర్ కడప జిల్లా బద్వేల్ పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. బద్వేల్ నేషనల్ హైవే మార్గంలో తనిఖీలు చేస్తుండగా నిందితులను పోలీసులు గుర్తించి అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 1.26 లక్షల విలువైన 21 కేజీలు గంజాయి, వేయింగ్ మిషన్, రూ.6000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు బద్వేలు పట్టణ పోలీసులు తెలిపారు. పట్టుబడిన నిందితులు బద్వేలు మార్గమ్మ నగర్తో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాకు చెందినవారిగా పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

# పెద్దల సభకు సామాన్య కార్యకర్త... దళవాయి రమాదేవి

- నిబద్ధతకు మరోసారి పట్టం కట్టిన టీడీపీ... సాధారణ కార్యకర్తకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ
- కార్యకర్తే అధినేత అనే నినాదాన్ని ఆచరణలో చేసి చూపించిన అధిష్టానం... కార్యకర్తల్లో జోష్



అనంతపురం (చైతన్యరథం): పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన వారికి పదవులు దక్కుతాయనే విషయాన్ని తెలుగుదేశం పార్టీ మరోసారి నిరూపించింది. అధికారం కోసం కాకుండా పార్టీ కోసం పనిచేసిన సాధారణ కార్యకర్తకు పెద్దల సభలో అవకాశం కల్పిస్తూ టీడీపీ అధిష్టానం కీలక నిర్ణయం తీసుకుంది. అనంతపురం జిల్లాకు చెందిన దళవాయి రమాదేవిని గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా నామినేట్ చేసేందుకు రాష్ట్ర మంత్రి వర్గం సిఫార్సు చేసింది. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ నిర్ణయంతో రమాదేవికి ఈ అవకాశం దక్కింది. ఎవరి ఊహకూ అందని విధంగా వడ్డెర సామాజిక వర్గానికి చెందిన రమాదేవిని ఎమ్మెల్సీగా ఎంపిక చేయడం ద్వారా సామాజిక సమీకరణాలతో పాటు పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపు ఇచ్చే విధానాన్ని టీడీపీ అధిష్టానం చాటిచెప్పింది. ఎమ్మెల్సీ పదవి కోసం పలువురు పేర్లు పరిశీలనలో ఉన్నప్పటికీ.. చివరకు పదవుల కోసం పోటీ పడని, పార్టీ అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించిన రమాదేవికి అవకాశం దక్కడం ఇప్పుడు టీడీపీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దళవాయి రమాదేవి కుటుంబానికి తెలుగుదేశం పార్టీతో సుదీర్ఘ అనుబంధం ఉంది. దాదాపు 22 ఏళ్లుగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ.. స్థానికంగా టీడీపీ కుటుంబంగా గుర్తింపు తెచ్చుకున్నారు. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా తూచా తప్పకుండా నిర్వహించడం రమాదేవి ప్రత్యేకతగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం అనంతపురం పార్లమెంట్ టీడీపీ అంగన్వాడీ విభాగం అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రమాదేవి.. అనంతపురం నగరంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌గా కూడా పార్టీ కార్యక్రమాలను సమన్వయం చేస్తున్నారు. కార్యకర్తలతో నిరంతరం అందుబాటులో ఉంటూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంలో ఆమె కీలకంగా వ్యవహరించారు.

**ఓటమిలోనూ వెనక్కి తగ్గని నిబద్ధత**

ఓటమిలోనూ వెనక్కి తగ్గని నిబద్ధత 2021 అనంతపురం మున్సిపల్ ఎన్నికల్లో 47వ డివిజన్ కార్పొరేటర్‌గా రమాదేవి పోటీ చేశారు. రాజకీయ ఒత్తిళ్లు, వేధింపులను ఎదుర్కొంటూనే ఎన్నికల బరిలో నిలిచారు. కేవలం 37 ఓట్ల తేడాతో ఓటమి పాలైనా.. పార్టీ కార్యక్రమాలకు మాత్రం దూరం కాలేదు. ఓటమిని ఒక అడుగుగా తీసుకుని మరింత పట్టుదలతో పార్టీ కోసం పనిచేశారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో అనంతపురం నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ విజయానికి కూడా రమాదేవి కృషి చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలను సమన్వయం చేస్తూ.. ఎన్నికల ప్రచారం, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు.

**కార్యకర్తే అధినేత నినాదానికి ఆచరణ**

'కార్యకర్తే అధినేత' నినాదానికి ఆచరణ టీడీపీ ఇటీవల పార్టీ కమిటీల కూర్పులోనూ సాధారణ కార్యకర్తలకు ప్రాధాన్యం ఇచ్చింది. మండల స్థాయి పార్టీ అధ్యక్షురాలిగా, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేసిన వారికి కీలక బాధ్యతలు అప్పగిస్తూ పార్టీ నిర్మాణంలో కింది స్థాయి నుంచి పైస్థాయికి ఎదిగే అవకాశాలు ఉన్నాయని సంకేతాలు ఇచ్చింది. అదే విధానాన్ని ఇప్పుడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ఎంపికలోనూ కొనసాగించింది. పార్టీ కోసం రెండు దశాబ్దాలకు పైగా పనిచేసిన ఓ సాధారణ కార్యకర్తకు ఏకంగా శాసనమండలిలో అవకాశం కల్పించడం ద్వారా 'కార్యకర్తే అధినేత' అనే నినాదాన్ని ఆచరణలో చూపించినట్లయింది. పదవి కోసం పరుగులు తీసేవారికంటే.. పార్టీ కోసం నిశ్శబ్దంగా పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందనే సందేశాన్ని రమాదేవి ఎంపిక స్పష్టం చేస్తోంది. అనంతపురం రాజకీయాల్లో సాధారణ కార్యకర్తగా మొదలైన రమాదేవి ప్రస్థానం ఇప్పుడు శాసనమండలి వరకు చేరింది. పార్టీ కోసం చేసిన సేవలకు దక్కిన గుర్తింపుగా భావిస్తున్న ఈ ఎమ్మెల్సీ అవకాశం.. టీడీపీ క్షేత్రస్థాయి కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపే పరిణామంగా మారింది.

**లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపిన దళవాయి రమాదేవి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ మరియు ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్‌ను దళవాయి రమాదేవి కుటుంబసభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా, క్షేత్రస్థాయి కార్యకర్తగా తన సేవలను గుర్తించి, శాసనమండలి సభ్యురాలిగా అవకాశం కల్పించినందుకు మంత్రి నారా లోకేష్ కు ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రి నారా లోకేష్ ఆమెను అభినందిస్తూ, తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ పార్టీ కోసం నిస్వార్థంగా కష్టపడే నిజమైన కార్యకర్తలను, నాయకులను గుర్తిస్తుందని, వారికి సముచిత స్థానం కల్పించడంలో ముందుంటుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మరింత నిబద్ధతతో పనిచేయాలని ఈ సందర్భంగా ఆమెకు సూచించారు.

# రిజర్వేషన్ కోటాపై అనాడు చెప్పాం... ఈనాడు చేసి చూపించాం

- ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ



అమరావతి (చైతన్యరథం): 2024 ఎన్నికల సమయంలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో, నామినేటెడ్ పదవుల్లో 34 శాతం ప్రాతినిధ్యం కల్పిస్తామని ప్రజలకు స్పష్టమైన హామీ ఇచ్చామని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని కార్యాచరణలోకి తీసుకురావడం ద్వారా మాట ఇచ్చిన ప్రభుత్వం మాట నిలబెట్టుకుంటుందని నిరూపించామని ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ వ్యాఖ్యానించారు. బలహీన వర్గాలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ కోటాను తిరిగి 34 శాతానికి పెంచుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైనది. ఇది కేవలం ఎన్డీఏ ఎన్నికల హామీని అమలు చేయడం మాత్రమే కాదు- బీసీల రాజకీయ సాధికారత పట్ల తెలుగుదేశం పార్టీకి ఉన్న నిబద్ధతకు నిదర్శనం. బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమం, రాజకీయ సాధికారతకు ప్రాధాన్యత ఇవ్వడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆలోచనా విధానం, రాజకీయ సిద్ధాంతం. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తోంది. నందమూరి తారక రామారావు హయాంలో బీసీలకు స్థానిక సంస్థల్లో 20 శాతం రిజర్వేషన్లు కల్పించగా, చంద్రబాబునాయుడు నాయకత్వంలో వాటిని 34 శాతానికి పెంచారు. అయితే జగన్మోహన్ రెడ్డి బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడం ద్వారా బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం చేసింది. వైసిపి అంటేనే బలహీనవర్గాలకు వెన్నుపోటు పొడిచేటువంటి పార్టీ అనేది ఈ రాజకీయ రిజర్వేషన్లు తగ్గించిన దాన్ని బట్టి మనకు అర్థం అవుతుంది. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చి, బీసీలకు తిరిగి 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా వారి రాజకీయ సాధికారతకు మరింత బలమైన పునాది వేశారు. జాతీయ రాజకీయాల్లో బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేసి, వారికి రాజకీయ ప్రాధాన్యత కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీదే. అదే స్ఫూర్తితో, ఈరోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కూడా బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేస్తూ, వారికి మరింత రాజకీయ ప్రాధాన్యత, అవకాశాలు కల్పించే దిశగా ముందుకు సాగుతోంది. భవిష్యత్తులో బలహీన వర్గాలకు మరిన్ని అవకాశాలు, మరింత రాజకీయ సాధికారత కల్పించేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తెలియజేస్తూ, బడుగు, బలహీన వర్గాల ప్రజలందరూ ఈ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఇది కేవలం ఒక ప్రభుత్వ నిర్ణయం కాదు. బీసీల పట్ల తెలుగుదేశం పార్టీకి ఉన్న ప్రత్యేక ప్రేమ, అభిమానం, నిబద్ధతకు ఇది ప్రతీక. బీసీలకు రాజకీయంగా మరింత అవకాశాలు కల్పించి, వారి నాయకత్వాన్ని బలోపేతం చేయాలన్నది టీడీపీ రాజకీయ సిద్ధాంతమని అన్నారు.

# ఏపీఎన్ఆర్‌టీ అమెరికా సౌత్ ఈస్ట్ రీజినల్ కో-ఆర్డినేటర్‌గా ఠాగూర్



**యూఎస్ఏ:** అమెరికాలోను, ఇతర దేశాల్లో ఉన్న తెలుగువారి సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఏపీ నాన్-రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్ఆర్‌టీ) అమెరికా సౌత్ ఈస్ట్ కో-ఆర్డినేటర్‌గా మల్లినేని ఠాగూర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ అధికారిక నియామక పత్రాన్ని జారీ చేసింది. లూసియానా, ఫ్లోరిడా, జార్జియా, నార్త్ కరోలినా, సౌత్ కరోలినా, అలబామా, కెంటకీ, మిసిసిపీ, టెన్నెస్సీ రాష్ట్రాల్లో నివసిస్తున్న తెలుగు ఎన్ఆర్ఐల సంక్షేమం కోసం ఆయన కృషి చేయనున్నారు. ఎన్ఆర్ఐలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి, ఇతర వ్యవహారాల్లో ఇండియన్ ఎంబసీ, స్థానిక అధికారులను సమన్వయం చేసుకుంటూ ఆయన సేవలందించనున్నారు. తనకు ఈ పదవి అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, ఏపీఎన్ఆర్‌టీఎస్ చైర్మన్ డాక్టర్ రవికుమార్ వేమూరికి, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌లకు ఠాగూర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అమెరికాలోని సౌత్ ఈస్ట్‌లో ఉన్న తెలుగు వారికి అందుబాటులో ఉంటూ సంస్థ అభివృద్ధికి, ప్రవాసాంధ్రుల సంక్షేమానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కాగా మల్లినేని ఠాగూర్ 'తానా' ఫౌండేషన్ ట్రస్టీగా కూడా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఆయన 'తానా' ద్వారా గతంలో జన్మభూమిలో పలు సహాయ కార్యక్రమాలు చేశారు.


## సాకేత్ ఫౌండేషన్‌కు రూ.15 లక్షల విరాళాలు

**ఫ్రిస్కో (టెక్సాస్):** బీటా థలసీమియా మేజర్‌తో పోరాడిన సాకేత్ కొల్లా స్మారకార్థం సాకేత్ ఫౌండేషన్ సారథ్యంలో 15వ వార్షిక 5కే వాక్ అమెరికా టెక్సాస్‌లోని ఫ్రిస్కో కామన్స్ పార్కులో జరిగింది. ప్రవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని విరాళాలు అందజేశారు. ఈ వాక్ ద్వారా రూ.15 లక్షలు (16వేల డాలర్లు) అందాయని సాకేత్ తల్లిదండ్రులు శ్రీనివాస్, లక్ష్మి తెలిపారు. సాకేత్‌ని స్మరించుకుంటూ భారతదేశంలో ఆర్థికంగా వెనుకబడిన పిల్లల ఆరోగ్యం, విద్య కోసం ఈ నిధులను ఖర్చు చేస్తామని వారు చెప్పారు.

# యువ సాంకేతిక ప్రతిభకు 'తానా' తోడ్పాటు


## 'యూత్ కోడ్ ఎ థాన్-2026' పోటీల్లో యువతీ, యువకుల సత్తా: కోడింగ్‌లతో కొత్త గేమ్‌ల ఆవిష్కరణ

**మిడ్ అట్లాంటిక్:** ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) మిడ్ అట్లాంటిక్ విభాగం ఆధ్వర్యంలో యువ సాంకేతిక ప్రతిభకు పట్టంకట్టేలా 'యూత్ కోడ్ ఎ థాన్-2026' నిర్వహించింది. తానా పాఠశాల సహకారంతో జరిగిన పోటీల్లో యువతీ, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని తమ కోడింగ్‌ల ద్వారా కొత్త గేమ్‌లను ఆవిష్కరించారు. సృజనాత్మకత, నూతన సాంకేతిక ప్రతిభతో పలువురిని ఆకట్టుకున్నారు. తానా అధ్యక్షులు డాక్టర్ నరేన్ కొడాలి, ఈవీపీ శ్రీనివాస్ లావు, బోర్డు డైరెక్టర్ రవి పొట్లూరి, సెక్రటరీ సునీల్ పంత్ర, బెనిఫిట్ కో-ఆర్డినేటర్ వెంకట్ సింగు, మిడ్-అట్లాంటిక్ రీజినల్ రిప్రజెంటేటివ్ ఫణి కంతేటి, సతీష్ తుమ్మల విద్యార్థులను అభినందించారు. పోటీలకు సహకరించిన తల్లిదండ్రులు, స్పాన్సర్లు, వలంటీర్లకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా సమన్వయం చేసిన అపర్ణ వాగ్వాలకి, సాంకేతిక వేదికను అత్యుత్తమంగా నిర్వహించిన సుజిత్ వాగ్వాలకి 'తానా' నాయకత్వం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది. ఈవెంట్ విజయవంతం కావడానికి సహకరించిన ధీరజ్ యలమంచి, కేతన్ మామిడి, క్రిషిత నందమూరి, సాత్విక దుడాలకు, విద్యార్థులను నిరంతరం ప్రోత్సహిస్తూ మార్గదర్శకత్వం వహించిన మెంటర్ గోపి వాగ్వాలకు కూడా అభినందనలు తెలియజేసింది.










'తానా' బోర్డు డైరెక్టర్ రవి పొట్లూరి మాట్లాడుతూ... యువత తమ ఆలోచనలకు పదును పెడుతూ, కొత్త విషయాలు నేర్చుకోవడానికి ఇటువంటి వేదికలు ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు పెద్ద కలలు కంటూ సాంకేతికతను తెలుసుకోవడంతో పాటు దానిలో రాణించి, ఆత్మవిశ్వాసంతో ముందుకు దూసుకెళ్లాలని కోరారు.

**విజేతలు వీరే:**

మిడిల్ స్కూల్ విభాగంలో వృషిన్ వడకట్టు (ప్రథమ), అబ్దుల్ రెహమాన్ (ద్వితీయ), దివిజ్ కృష్ణ కోనేరు (తృతీయ) స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నారు.

హైస్కూల్ విభాగంలో ప్రథమ బహుమతి: రిషి నాగబండి, ద్వితీయ బహుమతి: సర్వేష్ కొమర్రాజు

**ప్రత్యేక పురస్కార గ్రహీతలు**

బెస్ట్ వీడియో: దివిజ్ కృష్ణ కోనేరు, బెస్ట్ గేమ్‌ప్లే: రిషి నాగబండి, బెస్ట్ ఆడియో: రిషి నాగబండి, బెస్ట్ థీమ్ ఇన్ కార్పొరేషన్: వృషిన్ వడకట్టు, కహూట్ విజేత: వృషిన్ వడకట్టు

# లండన్‌లో ఘనంగా 'తాల్' ప్రీమియర్ లీగ్

## ఛాంపియన్‌గా 'ఐటీ ట్రీ వారియర్స్'




**లండన్:** తెలుగు అసోసియేషన్ ఆఫ్ లండన్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన వార్షిక క్రికెట్ టోర్నమెంట్ (తాల్) ప్రీమియర్ లీగ్-2026 ఘనంగా ముగిసింది. మెగా ఫైనల్ మ్యాచ్‌లు ఇంగ్లాండ్‌లోని లాంగ్లీ, స్లౌ క్రికెట్ క్లబ్‌లో జరిగాయి. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్‌లో ఐటీ ట్రీ వారియర్స్ జట్టు అద్భుత ప్రదర్శనతో విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. గట్టి పోటీ ఇచ్చిన సూపర్ స్టార్స్ రన్నర్-అప్‌గా నిలిచింది. వైజాగ్ బ్లూస్ మూడో స్థానాన్ని దక్కించుకుంది. 14 వారాలుగా సాగిన పోరులో 10 జట్లు 51 మ్యాచ్‌లు ఆడాయి. లీగ్‌లో 200 మందికి పైగా ఆటగాళ్లు ప్రతిభ, పోటీతత్వం, క్రీడాస్ఫూర్తి ప్రదర్శించారు.

మెగా ఫైనల్స్‌కు ముఖ్య అతిథిగా హాజరైన పార్లమెంట్ మాజీ సభ్యుడు వీరేంద్ర శర్మ మాట్లాడుతూ యూకేలోని భారతీయ సమాజానికి 'తాల్' అందిస్తున్న సేవలను ప్రశంసించారు. 'తాల్' వ్యవస్థాపక సభ్యుడు డాక్టర్ రాములు దాసోజు మాట్లాడుతూ తమకు దీర్ఘకాలంగా మద్దతిస్తున్న వీరేంద్ర శర్మకు కృతజ్ఞతలు తెలిపారు. విజేత, రన్నర్స్-అప్ జట్లకు వారు ట్రోఫీలను అందజేశారు.

**ఛాంపియన్‌షిప్ పురస్కారాలు:**

ఛాంపియన్స్: ఐటీ ట్రీ వారియర్స్ (కెప్టెన్: ఆకాశ్ బండారి । ఫ్రాంచైజీ యజమాని: వికాస్ పత్రే)

రన్నర్స్-అప్: సూపర్ స్టార్స్ (కెప్టెన్: కృష్ణ అల్ల । ఫ్రాంచైజీ యజమాని: వేణు నవులూరి)

మూడో స్థానం: వైజాగ్ బ్లూస్ (కెప్టెన్: శ్రీనివాస్ సురభి । ఫ్రాంచైజీ యజమాని: రవి బండారు)

ఫెయిర్ ప్లే అవార్డు: డీజే వారియర్స్ (కెప్టెన్: సాయి అమృత్ రెడ్డి వెన్న । ఫ్రాంచైజీ యజమాని: శ్రీనివాస్ రెడ్డి చెరుకు)

**వ్యక్తిగత పురస్కారాలు:**

మ్యాన్ ఆఫ్ ది సిరీస్: ధనంజయ మద్దుకూరి, ఐటీ ట్రీ వారియర్స్

ఉత్తమ బౌలర్: ధనంజయ మద్దుకూరి, ఐటీ ట్రీ వారియర్స్

ఉత్తమ బ్యాట్స్‌మన్: ఆకాశ్ బండారి, ఐటీ ట్రీ వారియర్స్

ఉత్తమ ఫీల్డర్/కీపర్: సాయి అమృత్‌రెడ్డి వెన్న, డీజే వారియర్స్

300 మందికి పైగా పాల్గొనగా పిల్లలు, పెద్దల కోసం వివిధ ఆటలు, వినోద కార్యక్రమాలు నిర్వహించారు. భారతదేశం, యునైటెడ్ కింగ్‌డమ్ జాతీయ గీతాలతో ఘనంగా ప్రారంభమైన కార్యక్రమం రోజంతా ఉత్సాహం, క్రీడాస్ఫూర్తి , సమాజ ఐక్యతకు నాంది పలికింది.

'తాల్' చైర్మన్ రవి సబ్బా విజేతలు, రన్నర్స్-అప్‌లను అభినందిస్తూ... 2008లో ప్రారంభమైన తమ సంస్థ క్రికెట్ ప్రయాణం 2012లో 'తాల్ ప్రీమియర్ లీగ్'గా రూపాంతరం చెందిన విధానాన్ని గుర్తు చేశారు. టోర్నమెంట్ నిర్వహణకు కృషి చేసిన స్పోర్ట్స్ ఇన్చార్జి సింధూర చెరకును ఆయన ప్రత్యేకంగా అభినందించారు. స్పోర్ట్స్ ట్రస్టీ సత్య పెద్దిరెడ్డి దూరదృష్టి, చురుకైన భాగస్వామ్యం, అంకితభావం టోర్నమెంట్ విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించాయి.

అమూల్యమైన సహకారం అందించిన టీపీఎల్ కమిటీ సభ్యులు హర్ష కాగితాల, శరత్ పుట్ట, ట్రస్టీలు సత్య పెద్దిరెడ్డి, కిరణ్ కప్పెట, అనిల్ అనంతుల, అశోక్ మాడిశెట్టి, రవి మోచర్ల, వెంకట్ నేలలకు అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాల నిర్వహణకు ఉదారంగా సహకరిస్తున్న స్పాన్సర్లకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

**1 మిలియన్ స్టెప్స్ ఛాలెంజ్**

మరొక స్ఫూర్తిదాయకమైన అంశంగా TAL 1 Million Steps in 100 Days (100 రోజుల్లో 10 లక్షల అడుగులు) ఛాలెంజ్‌లో పాల్గొన్న వారిని సత్కరించారు. పతకాలు అందజేశారు. వెంకట్ తోటకూర, శ్రీహరి అరిగె, సునీత అరిగె నాయకత్వంలో మే 7 నుంచి ఆగస్టు 15 వరకు కొనసాగిన ఛాలెంజ్‌లో కమ్యూనిటీ నుంచి సుమారు 80 మంది పాల్గొన్నారు. వారంతా భారతదేశంలోని వెనుకబడిన పిల్లలకు మద్దతుగా నిధులు సేకరించారు.






### 'అయోధ్య' విరాళాల చోరీ కేసు..

## చంపత్ రాయ్‌కు సిట్ క్లీన్ చిట్

అయోధ్య రామ మందిరం విరాళాల కేసులో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌కు యూపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) క్లీన్ చిట్ ఇచ్చినట్లు సమాచారం.



ఆయనతో పాటు.. ట్రస్ట్ మాజీ సభ్యుడు అనిల్ మిశ్రాకు కూడా క్లీన్‌చిట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. చంపత్ రాయ్‌కు విరాళాల చోరీ కేసుతో ఎలాంటి సంబంధం లేదని సిట్ తన తొలి నివేదికలో పేర్కొన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. సిట్ తన నివేదికను రాష్ట్ర హోంశాఖకు ఇవ్వగా.. ఈ నివేదిక పరిశీలన అనంతరం తదుపరి చర్యల కోసం శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు అందించినట్లు సమాచారం.

యూపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ నివేదికలో చంపత్ రాయ్‌తో పాటు మాజీ ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రా పేర్లు కూడా లేవని సమాచారం. అయితే, విరాళాల వ్యవహారంలో అవకతవకల ఆరోపణల నేపథ్యంలో వీరిద్దరూ జూన్ 27న ట్రస్ట్‌లోని తమ పదవులకు రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

### సుప్రీంకోర్టు పర్యవేక్షణలో మరో సిట్..

రామ మందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో మరో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) విచారణ నిర్వహిస్తోంది. దర్యాప్తును వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సుప్రీంకోర్టు సోమవారం సిట్‌ను ఆదేశించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జయమల్య బాగ్చి, జస్టిస్ వి. మోహన్‌లతో కూడిన ధర్మాసనం.. దర్యాప్తు పురోగతిని వివరిస్తూ సీల్డ్ కవర్‌లో స్టేటస్ రిపోర్ట్ సమర్పించాలని సిట్‌ను ఆదేశించింది. ఫోరెన్సిక్ ఆడిటర్‌తో కూడిన సిట్ నివేదికను ముందుగా కోర్టు పరిశీలిస్తుందని, అనంతరం దాన్ని కేసులోని సంబంధిత పక్షాలతో పంచుకోవాలా వద్దా అనే విషయంపై నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం తెలిపింది.

## బీహార్‌లో ఎస్పీపై బదిలీ వేటు

### - విద్యార్థుల నిరసనల్లో ఏకే-47తో కానిస్టేబుల్ కాల్పుల వ్యవహారం

బీహార్‌లో నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థుల నిరసనల సందర్భంగా ఓ పోలీసు కానిస్టేబుల్ ఏకే-47తో గాల్లో కాల్పుల జరిపిన ఉదంతం కలకలం రేపుతున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. శివాన్ జిల్లాలో ఈ ఘటన జరిగిన నేపథ్యంలో ఎస్పీ పురన్ కుమార్‌ను జిల్లా బాధ్యతల నుంచి తప్పించింది.



మొత్తం 18 మంది సీనియర్ ఐపీఎస్ అధికారులను బదిలీ చేసింది. ఏకే-47తో కాల్పులు జరిపిన కానిస్టేబుల్‌పై ఇప్పటికే సస్పెన్షన్ వేటు పడింది. పురన్ కుమార్ ఝా స్థానంలో భరత్ సోనీ శివాన్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు చెపట్టారు. భోజ్‌పూర్‌లో మరో కార్యకర్త ఎన్‌కౌంటర్ తో కలకలం రేగడంతో ఆ జిల్లా ఎస్పీపై కూడా వేటు పడింది. భోజ్‌పూర్ బాధ్యతలను మరో అధికారి అవధేశ్ దీక్షిత్‌కు ప్రభుత్వం అప్పగించింది. మరోవైపు, ఏకే-47తో కాల్పుల ఉదంతంపై బిహార్ ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్ పలుప్రశ్నలు సంధించారు. విద్యార్థుల నిరసనను అదుపు చేసేందుకు వెళ్లిన కానిస్టేబుల్‌కు ఏకే-47 ఎలా వచ్చిందని అన్నారు. ఏ ఆర్మరీ దీన్ని జారీ చేసిందని ప్రశ్నించారు.

కాగా విద్యార్థులమధ్య చిక్కుకుపోయిన కానిస్టేబుల్ ఏకే-47తో గాల్లోకి కాల్పులు జరిపాడని సుప్రీం కోర్టు కు సమర్పించిన అఫిడవిట్‌లో బీహార్ ప్రభుత్వం పేర్కొంది. ఈ ఘటనలో నాలుగు రౌండ్‌ల కాల్పులు జరిగాయని,ఎవరికీ ఎలాంటి గాయాలుకాలేదని కూడా ప్రభుత్వం తెలిపింది. పోలీసు దౌర్జన్యంపై సర్వోన్నత న్యాయస్థానంలో విచారణ సందర్భంగా బీహార్ ప్రభుత్వం ఈ మేరకు అఫిడవిట్‌ను దాఖలు చేసింది.

## సీజేపీ పార్లమెంట్ మార్చ్‌లో..

# భద్రతా బలగాల బలప్రయోగంపై విచారణకు ఉన్నతస్థాయి కమిటీ




నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా గత జులై 20న కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన 'చలో పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థులపై భద్రతా బలగాల బల ప్రయోగం ఆరోపణలపై విచారణ జరిపేందుకు హైపవర్డ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నామని మంగళవారం సుప్రీంకోర్టు తెలిపింది. ఆ రోజు జరిగిన మార్చ్ ఫుటేజీని ఈ ఉన్నతస్థాయి కమిటీ పరిశీలిస్తుందని చెప్పింది. ఆ నిరసనల్లో భాగంగా మహిళా ఆందోళనకారుల్ని లక్ష్యంగా చేసుకున్నారంటూ ఆరోపణలు వచ్చాయి. వాటిపైనా దర్యాప్తు జరుగుతుందని వెల్లడించింది. ఈ ప్యానెల్లో మాజీ న్యాయమూర్తులు, సీబీఐ మాజీ డైరెక్టర్, రాష్ట్ర మాజీ డీజీపీ సభ్యులుగా ఉంటారని చెప్పింది. నిరసనకారులపై పోలీసు చర్యకు వ్యతిరేకంగా కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టాలని అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే.

ఈ పిటిషన్లపై విచారించిన చీఫ్ జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జాయ్‌మల్య బాగ్చీ, జస్టిస్ వీ మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. ఈ కమిటీ ఏర్పాటుకు సంబంధించిన ఆదేశాలు బుధవారం వెలువడనున్నాయని ధర్మాసనం ప్రకటించింది.

పార్లమెంట్ మార్చ్ సందర్భంగా చోటు చేసుకున్న హింసకు సంబంధించిన వీడియో ఫుటేజీ, సీసీటీవీ రికార్డింగ్స్‌ను కమిటీకి అందజేయాల్సిందిగా ఆదేశాలు ఇస్తామని పేర్కొంది. బాధితులందరి వాదనలను కమిటీ వింటుందని, కమిటీ సిఫార్సుల ఆధారంగా చర్యలు తీసుకుంటామని ధర్మాసనం స్పష్టం చేసింది.

విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల వివరాలను అందజేయాలని సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ధర్మాసనం ఆదేశించింది. నేర చరిత్ర లేని విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపింది. ఆర్టికల్ 19 కింద నిరసనలు తెలిపే అధికారం విద్యార్థులకు ఉందని, విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఎఫ్ఐఆర్‌లపై నిర్ణయం తీసుకుంటామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

# ఆందోళన బాటలో ఉద్యోగులు

### ఝార్ఖండ్ ప్రభుత్వానికి కొత్త తలనొప్పి



ఝార్ఖండ్ ప్రభుత్వానికి కొత్త తలనొప్పులు మొదలయ్యాయి. వారాల తరబడి సాగిన విద్యార్థుల నిరసనలు ముగిశాయని ఊపిరి తీసుకునేలోపే ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యమ బాట పట్టారు. 2014 నుంచి ఝార్ఖండ్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (జేఎస్ఎస్సీ) ద్వారా నియమితులైన ఉద్యోగులంతా రోడ్లెక్కారు. జేఎస్ఎస్సీ-సీజీఎల్ పరీక్షను ప్రభుత్వం రద్దు చేయడంపై వారంతా కదం తొక్కారు. రాంచీలోని ప్రాజెక్ట్ భవన్ వద్దకు చేరుకుని పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. పరీక్షను రద్దు చేయడంపై మండిపడ్డారు. తమ జీవితాలను రోడ్డున పడేసే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విద్యార్థి ఉద్యమ ఒత్తిడి కారణంగానే జేఎస్ఎస్సీ-సీజీఎల్ పరీక్షను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆందోళన చేపట్టిన ఉద్యోగులు ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయంతో వేలాది మంది ఉద్యోగులు తక్షణ ప్రమాదంలో పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. 2014 నుంచి నిర్వహించిన పరీక్షలను రద్దు చేయాలన్న నిర్ణయంతో సుమారు 2 వేల మంది ప్రభుత్వ ఉద్యోగాలు ప్రభావితమవుతాయని తెలిపారు. ఇతరుల తప్పులకు తమను శిక్షించకూడదని చెప్పుకొచ్చారు.

పరీక్షల్లో అవకతవకలను పరిష్కరించడానికి పరీక్షను రద్దు చేయడం సరైన మార్గమా? అంటూ ఉద్యోగులు ప్రశ్నించారు. ఈ వివాదంలో ప్రభుత్వం ఒక పక్షం వాదననే విన్నదని.. తమ వాదనలు వినిపించే అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. నిబంధనల ప్రకారమే నియామక ప్రక్రియ ద్వారా ఉద్యోగాల్లో చేరామని, మౌఖిక ఉత్తర్వుల ద్వారా తమను తొలగించలేరని తేల్చి చెప్పారు. తామంతా చట్టపరమైన మార్గాల ద్వారా పోరాటం కొనసాగిస్తామని, ఈ విషయంపై అంతిమ నిర్ణయం కోర్టు తీసుకుంటుందన్నారు.

కాగా, జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ-సీజీఎల్ నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ ఈ ఏడాది జులై 29 నుంచి విద్యార్థులు ఆందోళనలకు దిగారు. రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియం వేదికగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దాదాపు 24 రోజుల పాటు ఆందోళనలు కొనసాగడంతో ప్రభుత్వం తలొగ్గింది. దీంతో జేఎస్ఎస్సీ-సీజీఎల్ పరీక్షతో పాటు ప్రైవేటు సంస్థ టీడీపీఎల్ ద్వారా నిర్వహించిన పరీక్షలు, చేపట్టిన నియామకాలను రద్దు చేస్తున్నట్లు సీఎం హేమంత్ సోరెన్ ప్రకటించారు. అదేవిధంగా ఆయా నియామకాలపై సీఐడీతో పాటు రిటైర్డ్ న్యాయమూర్తితో విచారణ చేపడతామని ఆయన హామీ ఇచ్చారు.

# దేశ చట్టాలకు లోబడే వ్యవహరించాలి

### - మెటాకు కేంద్రం స్పష్టీకరణ

చట్టాలను ఉల్లంఘిస్తే రక్షణ ఉందబోదని ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌ల మాతృ సంస్థ 'మెటా'కు కేంద్రం స్పష్టం చేసింది. ఇన్‌స్టాగ్రామ్ ప్రకటనల్లో చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్‌ను వ్యాప్తి చేస్తుండడంపై 'మెటా' అధికారులతో కేంద్ర ఐటీశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సహా పలువురు అధికారుల బృందం చర్చలు కొన సాగిస్తోంది. ఈ క్రమంలో బాలలపై లైంగిక వేధింపులకు సంబంధించిన ఏ పోస్టులను సహించబోమని మెటాకు కేంద్రం స్పష్టం చేసింది. అంతే కాకుండా కంటెంట్ రూపకపల్పనలో దేశంలోని విభిన్న భాషలు, సాంస్కృతిక సున్నితత్వాలను దృష్టిలో ఉంచుకోవాలని సూచించింది. కంటెంట్‌లో బాలలపై లైంగిక వేధింపుల మెటీరియల్‌కు సంబంధించిన ఉల్లంఘనల విషయంలో సోషల్ మీడియా వేదికలు, వ్యక్తులు చట్టపరమైన రక్షణ కోల్పోతారని స్పష్టం చేసింది. బాలలపై లైంగిక వేధింపుల మెటీరియల్‌ను భారత్ సహా ఇతర ప్రపంచ దేశాలుకూడా వ్యతిరేకిస్తున్నాయని కేంద్రం పేర్కొంది. ప్లాట్ఫామ్ నియమాలను అమలు చేసే టప్పుడు మోడరేషన్ వ్యవస్థలు వివిధ దేశాల




సంస్కృతుల్లో ఉన్న వ్యత్యాసాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. వాక్ స్వాతంత్ర్యం ముఖ్యమైనదే అయినప్పటికీ, సాంస్కృతిక.. సామాజిక పరిస్థితులు దేశాన్ని బట్టి మారుతుంటాయని తెలిపింది. అదే సమయంలో సోషల్ మీడియా మాధ్యమాల్లో ఏఐ వీడియోలపైనా కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది

### నిబంధనలు పాటించాల్సిందే..

ఏ ఖాతాను అయినా కేంద్రం తొలగించాలని సూచిస్తే.. ఆ సూచనను బహిర్గతం చేసేలా సోషల్ మీడియా మాధ్యమం 'ఎక్స్' కొత్తరూల్ తీసుకు వచ్చింది. దీంతో తమ అకౌంట్‌ను బ్లాక్ చేయాలని ఎవరు కోరారనే విషయాన్ని వినియోగదారులు తెలుసుకునే అవకాశం ఉంటుంది. అటువంటి చర్యలు తీసుకోవడానికి గల చట్టపరమైన కారణాలు కూడా అందుబాటులో ఉంటాయి. దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పందిస్తూ.. ఏ సోషల్ మీడియా మాధ్యమాలైనా దేశంలోని చట్టాలను కచ్చితంగా పాటించాల్సి ఉంటుందని పేర్కొంది.

# హర్మూజ్.. అమెరికా భూ భాగమే

**- సోషల్ మీడియాలో ట్రంప్ సంచలన పోస్ట్**




హర్మూజ్ జలసంధిపై పూర్తిగా నియంత్రణ తమకే ఉందని మొండిగా వాదిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా సోషల్ మీడియా వేదికగా చేసిన పోస్ట్ అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపుతోంది. హోర్ముజ్ మూసివేత కొనసాగుతుందని ఇప్పటికే ఇరాన్ ప్రకటించిన నేపథ్యంలో ట్రంప్ మరో సంచలనానికి తెరతీశారు. 'హర్మూజ్.. అమెరికా కొత్త భూభాగం' అని ఆ జలసంధి మ్యాప్‌పై రాసి ఉన్న ఏఐ ఫొటోను 'ట్రూత్' సోషల్' వేదికగా ట్రంప్ షేర్ చేశారు. ప్రస్తుతం హర్మూజ్‌ను దిగ్బంధనం చేసిన అమెరికా.. ఇరాన్ నౌకలను అడ్డుకుంటున్న విషయం తెలిసిందే. హోర్ముజ్‌ను యూఎస్‌కు చెందిన ప్రాంతంగా ప్రకటిస్తామని గత కొద్ది రోజులుగా చెబుతూ వస్తున్న ట్రంప్ చివరకు కొత్త మ్యాపుతో వివాదాన్ని మరో మలుపు తిప్పారు.

హోర్ముజ్ పూర్తిగా తమ అధీనంలో ఉందని చాలా కాలంగా ట్రంప్ చెబుతున్నారు. ఈ విషయమై సోమవారం విలేకరులతో మాట్లాడుతూ హోర్ముజ్‌ను యూఎస్‌కు చెందిన ప్రాంతంగా ప్రకటించాలన్న ఆలోచన మంచిదేనన్నారు. 'అది గొప్ప ఐడియానే.

ఇప్పటికే హోర్ముజ్ చుట్టూ నిర్బంధాన్ని అమలు చేస్తున్నాము. పూర్తిగా అది మా అధీనంలో ఉంది. కాబట్టి యూఎస్‌కు చెందిన ప్రాంతంగా కూడా ప్రకటించవచ్చు' అని ట్రంప్ అన్నారు. అంతకుముందు మరో సందర్భంలో ట్రంప్ మాట్లాడుతూ తాను త్వరలో హోర్ముజ్‌ను యూఎస్‌కు చెందిన ప్రాంతంగా ప్రకటిస్తానని చెప్పారు. ఈ నేపథ్యంలో తాజాగా ట్రంప్ షేర్ చేసిన మ్యాప్ కలకలం రేపుతోంది.

మరోవైపు.. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు హర్మూజ్‌పై పట్టును కొనసాగిస్తామని ఇరాన్ పార్లమెంటరీ స్పీకర్ మహమ్మద్ బాఘేర్ గాలిబాఫ్ మంగళవారం స్పష్టం చేశారు. "ఒప్పందం ప్రకారం దిగ్బంధనాన్ని ఎత్తేయాలి. స్తంభింపజేసిన ఆస్తులను విడుదల చేయాలి. చమురుపై ఆంక్షలను తొలగించాలి. అదేవిధంగా సైనిక చర్యలకు ముగింపు పలకాలి. అప్పటివరకు హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవబోమని స్పష్టంచేశారు.

హర్మూజ్ జలసంధి తమదేనని, అది తమ నియంత్రణలోనే ఉంటుందని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి కాజెమ్ ఘరీబాబాదీ కూడా స్పష్టం చేశారు. హర్మూజ్ ఇంతకు ముందు ఇరాన్‌దే. ఇకపైనా ఇరాన్ ఆధీనంలోనే ఉంటుందన్నారు.

ప్రస్తుతం హర్మూజ్‌ను తిరిగి తెరవడం అమెరికా, ఇరాన్ చర్చల్లో ప్రధాన అంశంగా మారింది. అమెరికా ఆంక్షలు, నౌకాదళ చర్యలను ఉపసంహరించుకోవాలని ఇరాన్ కోరుతుండగా.. అమెరికా మాత్రం జలసంధిని స్వేచ్ఛగా తెరవాలని ఒత్తిడి చేస్తోంది. ఇరువైపులా రాజీ కుదరకపోవడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది.

హర్మూజ్ జలసంధి మూసివేత లేదా రవాణాపై పరిమితులు కొనసాగితే ప్రపంచ ఇంధన సరఫరాకు భారీ దెబ్బ తగిలే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ ప్రాంతంలోని ఉద్రిక్తతల కారణంగా నౌకల రాకపోకలు గణనీయంగా తగ్గాయి. ఫలితంగా చమురు ధరలు, రవాణా వ్యయాలు, బీమా ఖర్చులు పెరిగే ప్రమాదం ఉంది.

# ఇమ్రాన్‌కు ఆసుపత్రిలో చికిత్స అందించండి

**- పాక్ సుప్రీంకోర్టు ఆదేశం**



పాకిస్థాన్‌లో జైలు శిక్ష అనుభవిస్తున్న ఆ దేశ మాజీ ప్రధాని, పీటీఐ అధినేత ఇమ్రాన్ ఖాన్‌కు తాజాగా భారీ ఊరట దక్కింది. అనారోగ్యంతో బాధపడుతున్న ఖాన్‌ను ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించాలని పాక్ సుప్రీం కోర్టు తాజాగా ఆదేశించింది. 48 గంటల్లోపు ఆయనను ఆసుపత్రిలో చేర్పించాలని స్పష్టం చేసింది. ఖాన్ ఆరోగ్యంపై దృష్టి సారించేందుకు త్వరలో ఓ మెడికల్ బోర్డు కూడా ఏర్పాటు కానుందని తెలిపింది. ఈ బోర్డులో ఖాన్ వ్యక్తిగత వైద్యుడితో పాటు ఆయన సోదరి డా. ఉజ్మాఖాన్ కూడా సభ్యులుగా ఉంటారని తెలిపింది. అయితే, ఇమ్రాన్ ఖాన్ ఆసుపత్రిలో ఉన్న సమయంలో వైద్య రికార్డులను బహిరంగ పరిచి రాజకీయ వివాదాలను రెచ్చగొట్టొద్దని ఆయన తరపు లాయర్లకు స్పష్టం చేసింది. ఇమ్రాన్ ఖాన్‌ను వారానికి ఒకసారి తన కుటుంబసభ్యులను కలిసేందుకు అనుమతించాలని కూడా ప్రభుత్వానికి స్పష్టం చేసింది.

2023 నుంచి ఇమ్రాన్ ఖాన్ జైల్లో ఉంటున్న విషయం తెలిసిందే. అవినీతితో పాటు ఇతరత్రా కేసుల్లో దోషిగా తేలిన ఆయన అడియాలా జైల్లో ఉంటున్నారు. అయితే తాను నిర్దోషినని ఇమ్రాన్ ఖాన్ మొదటి నుంచీ వాదిస్తున్నారు. రాజకీయ దురుద్దేశాలతో కేసులు పెట్టి జైలుపాలు చేశారని పలుమార్లు ఆరోపించారు. మరోవైపు, ఆయన ఆరోగ్యం అంతకంతకూ దిగజారుతోందని ఇమ్రాన్ ఖాన్ తనయులు, వారి లాయర్లు గతేడాదిగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయన కుడి కంటి చూపు బాగా తగ్గిపోయిందని కూడా చెప్పారు ప్రస్తుతం వైద్య కారణాలతో ఇమ్రాన్ ఖాన్‌కు కాస్త ఊరట లభించడంతో పీటీఐ అధికార ప్రతినిధి హర్షం వ్యక్తం చేశారు. ఇంకాస్త ముందుగా ఇది జరిగి ఉంటే మెరుగ్గా ఉండేదని అభిప్రాయపడ్డారు. ఆరోగ్యం పూర్తిగా మెరుగయ్యే వరకూ ఇమ్రాన్ ఖాన్‌ను ఆసుపత్రిలోనే ఉంచాలని డిమాండ్ చేశారు.

2018 ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచి ప్రధాని అయిన ఇమ్రాన్ ఖాన్ ఆ తరువాత 2022 నాటి బలనిరూపణలో ఓడిపోయి ప్రధాని పదవి నుంచి తప్పుకున్నారు. ఆ తరువాత ఆయనపై అవినీతి, చట్టవ్యతిరేకంగా వివాహం చేసుకోవడం వంటి అనేక కేసులు దాఖలయ్యాయి. కొన్నింట్లో ఆయన దోషిగా తేలారు. మరికొన్నిటిని కోర్టులు కొట్టేశాయి. మరికొన్ని కేసుల్లో అప్పీళ్లపై ఇంకా విచారణ జరుగుతోంది. పీటీఐ తన పార్టీ గుర్తు కూడా కోల్పోవడంతో 2024 ఎన్నికల్లో పీటీఐ నేతలు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసి గెలుపొందారు. ఇప్పటికీ పాక్‌లో పీటీఐకి ప్రజల మద్దతు చెప్పుకోదగ్గ స్థాయిలోనే ఉందని అక్కడి మీడియా చెబుతోంది.



# హర్మూజ్‌లో నౌకపై దాడి

హర్మూజ్ జలసంధిలో ఓ వాణిజ్య నౌకపై మంగళవారం దాడి జరిగింది. గుర్తుతెలియని క్షిపణి లేదా డ్రోన్ నౌకను ఢీకొట్టడంతో ఇంజిన్ రూమ్ పూర్తిగా ధ్వంసమైనట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందినట్లు బ్రిటన్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సంస్థ వెల్లడించింది. నౌకలోని మిగతా సిబ్బందిని కాపాడేందుకు ఒమన్ కోస్ట్‌గార్డ్ సిబ్బంది రంగంలోకి దిగినట్లు తెలిపింది. దాడి ఎవరు చేశారనే దానిపై ఇంకా స్పష్టత రాలేదని పేర్కొంది. ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్న వేళ ఈ దాడి చోటుచేసుకోవడం గమనార్హం. హర్మూజ్ జలసంధి పూర్తిగా ఇరాన్ సైనిక దళాల నియంత్రణలోనే ఉందని ఇటీవల ఆ దేశ సైనిక ప్రతినిధి ఇబ్రహీం జోల్ఫ్ ఘారి స్పష్టం చేశారు. ఇరాన్ నిర్దేశించిన నిబంధనలు, ముందస్తు అనుమతి లేకుండా ఏ నౌక కూడా జలసంధిని దాటలేదని ఆయన హెచ్చరించారు. ఈ క్రమంలోనే వాణిజ్య నౌకపై దాడి జరగడం చర్చనీయంశంగా మారింది.

హర్మూజ్‌లో ప్రస్తుతం నౌకల రాకపోకలు దాదాపు నిలిచిపోయాయి. ఆదివారం కేవలం మూడు నౌకలు మాత్రమే ఈ మార్గంలో ప్రయాణించినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

## భారత్‌లో ఓటర్ గుర్తింపు కార్డు విధానం భేష్

**- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రశంసలు**




అమెరికాలో ఓటర్ల గుర్తింపు నిబంధనలను కఠినతరం చేయాలని కోరుతూ, భారత్‌లో అమలవుతున్న ఓటర్ గుర్తింపు విధానాన్ని ఉదాహరణగా ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రస్తావించారు. అమెరికా ఎన్నికల్లో ఓటర్ గుర్తింపు కార్డు, పౌరసత్వ ధ్రువీకరణను తప్పనిసరి చేసే 'సేవ్ అమెరికా చట్టం'ను ఆమోదించాలని ఆయన మరోసారి పిలుపునిచ్చారు.

భారత్ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఇటీవల అమెరికా ఎన్నికల విధానంపై ప్రశ్నించారని ట్రంప్ తెలిపారు. చెల్లుబాటు అయ్యే ఫొటో గుర్తింపు పత్రం లేకుండా అమెరికాలో ఎన్నికలు ఎలా నిర్వహిస్తున్నారని జ్ఞానేశ్ కుమార్ అడిగినట్లు ట్రంప్ పేర్కొన్నారు. భారత్‌లో జరిగిన గత సార్వత్రిక ఎన్నికల్లో సుమారు 64.6 కోట్ల మంది ఓటర్లు పాల్గొన్నారని ట్రంప్ పేర్కొన్నారు. వారిలో ఒక శాతం కంటే తక్కువ మంది మాత్రమే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారని, ప్రతి ఓటరుకూ చెల్లుబాటు అయ్యే ఫొటో గుర్తింపు పత్రం అవసరమైందని ఆయన అన్నారు. ఈ విధానాన్ని అమెరికాలోనూ అమలు చేయాల్సిన అవసరం ఉందని ట్రంప్ అభిప్రాయపడ్డారు.

అమెరికాలో ఎన్నికల నమోదుకు పౌరసత్వ ధ్రువీకరణ, ఎన్నికల్లో ఓటు వేసేందుకు దేశవ్యాప్తంగా గుర్తింపు పత్రం తప్పనిసరి చేయడం, పోస్టల్ ఓటింగ్‌పై ఆంక్షలు విధించడం వంటి ప్రతిపాదనలు 'సేవ్ అమెరికా చట్టం'లో ఉన్నాయి. ఎన్నికల్లో అక్రమాలను అరికట్టేందుకు ఈ చట్టం అవసరమని ట్రంప్ వాదిస్తున్నారు. అయితే ఈ బిల్లుపై అమెరికా రాజకీయ నాయకుల్లో ఏకాభిప్రాయం లేదు. డెమొక్రాట్లతో పాటు కొంతమంది రిపబ్లికన్ల మధ్య కూడా విభేదాలు ఉన్నాయి. దీంతో బిల్లు ఆమోదం దిశగా స్పష్టమైన పురోగతి కనిపించలేదు.

## కుర్దిస్థాన్ ప్రాంతీయ ప్రభుత్వ ప్రధాని కార్యాలయంపై డ్రోన్ల దాడి



ఇరాక్ లోని కుర్దిస్థాన్ ప్రాంతీయ ప్రభుత్వ ప్రధాని మస్రూర్ బర్జానీ కార్యాలయంపై సోమవారం రాత్రి డ్రోన్ల దాడి జరిగింది. ఈ దాడులకు ఇరానే కారణమని కుర్దిస్థాన్ భద్రతా సంస్థ ఆరోపించింది. ప్రధాని కార్యాలయంతో పాటు కుర్దిస్థాన్ భద్రత, నిఘా సంస్థ 'పరాస్తిన్' అధిపతి నివాసాన్ని కూడా డ్రోన్లు లక్ష్యంగా చేసుకున్నాయని తెలిపింది. ఈ దాడుల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పేర్కొంది. కీలక ప్రభుత్వ, భద్రతా వ్యవస్థలను లక్ష్యంగా చేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగించే పరిణామమని తెలిపింది. కుర్దిస్థాన్ ప్రధాని మస్రూర్ బర్జానీ ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని, చట్టవిరుద్ధమైన చర్య అని పేర్కొన్నారు. ఈ తరహా చర్యలు ప్రాంతీయ ఉద్రిక్తతలను మరింత పెంచుతాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కుర్దిస్థాన్ ప్రాంతీయ స్థిరత్వాన్ని దెబ్బతీసేందుకు ఇరాన్ చేసిన తీవ్రమైన చర్య అని ఆరోపించారు.

**ఖండించిన ఇరాన్**

కుర్దిస్థాన్ ఆరోపణలను ఇరాన్ ఖండించింది. ఈ దాడులు తాము చేయలేదని స్పష్టం చేసింది. ఇరాన్‌పై నిందలు మోపేందుకు ఇతర శక్తులు కావాలనే ఇలాంటి చర్యలకు పాల్పడి ఉండొచ్చని ఆ దేశ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ అనుమానం వ్యక్తం చేశారు. ఇరాక్‌లోని కుర్దిస్థాన్ ప్రాంతం ఇరాన్‌కు సమీపంలో ఉండటంతో గత కొంతకాలంగా ఇరు పక్షాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇరాన్‌కు వ్యతిరేకంగా పనిచేస్తున్న సంస్థలు, బలగాలకు కుర్దిస్థాన్‌లో స్థావరాలు ఉన్నాయన్న ఆరోపణలూ ఉన్నాయి. తాజా ఘటనతో కుర్దిస్థాన్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉంది.

# విజయానికి ఆరు వికెట్ల దూరంలో భారత్

**- మొదటి టెస్ట్‌లో శ్రీలంక లక్ష్యం 372, ప్రస్తుతం 84/4**

**- నేడు మ్యాచ్‌కు చివరి రోజు**



గాలే వేదికగా శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టు నాలుగో రోజు మంగళవారం ఆట ముగిసే సమయానికి భారత జట్టు విజయానికి ఆరు వికెట్ల దూరంలో నిలిచింది. రెండో ఇన్నింగ్స్‌లో శ్రీలంక 4 వికెట్ల నష్టానికి 84 పరుగులు చేసింది. గెలవాలంటే లంక మరో 288 పరుగులు చేయాలి. క్రీజులో ధనంజయ డిసెల్వా(31 నాటౌట్), సోనల్ దినూష (25 నాటౌట్) కొనసాగుతున్నారు. నాలుగో రోజు ఛేదనకు దిగిన లంక బ్యాటర్లు పరుగులు రాబట్టడానికి తీవ్రంగా శ్రమించారు. ఓపెనర్లు నిశాన్ మదుశంక(6), లాహిరు ఉదారా(16), పసిందు సూర్యబందరా(0), కమిందు మెండిస్(2) స్వల్ప వ్యవధిలోనే పెవిలియన్ చేరారు. ధనుంజయ, దినూష ఐదో వికెట్‌కు 74 బంతుల్లో 37 పరుగులు చేశారు.

ఇక బుధవారం ఆటకు చివరి రోజు కాగా.. లంక విజయానికి 288 పరుగుల దూరంలో ఉండగా.. చేతిలో ఆరు వికెట్లు ఉన్నాయి. కాగా వీలైనంత త్వరగా ధనంజయ, దినూష జోడీని భారత బౌలర్లు విడదీయాల్సి ఉంటుంది. దినూష తొలి ఇన్నింగ్స్ లో సెంచరీ (100) చేసిన సంగతి తెలిసిందే.

శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో భారత బౌలర్లలో మానవ్ సుతార్ 2, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ తలొక వికెట్ పడగొట్టారు.

అంతకుముందు మంగళవారం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా.. 193 పరుగులకు ఆలౌటైంది. రిషభ్ పంత్(66) హాఫ్ సెంచరీ.. దేవదత్ పడిక్కల్(44), కేఎల్ రాహుల్(35) కీలక ఇన్నింగ్స్ ఆడారు. లంక బౌలర్లలో అసిత ఫెర్నాండో 3, ప్రభాత్ జయసూర్య 3, లాహిరు కుమార 2, కేశర ఒక వికెట్ తీశారు. అంతకు ముందు తొలి ఇన్నింగ్స్‌లో 178 పరుగుల ఆధిక్యాన్ని కలుపుకుని శ్రీలంకకు భారత్ 372 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

# శత సిక్సర్ల వీరుడు పంత్!




టీమ్ ఇండియా డాషింగ్ ఆటగాడు రిషబ్ పంత్ చరిత్ర సృష్టించాడు. భారత టెస్టు చరిత్రలో అరుదైన రికార్డు నెలకొల్పిన తొలి బ్యాటర్‌గా ఘనత సాధించాడు. ఇప్పటి వరకు ఎవరికీ సాధ్యం కాని విధంగా టెస్టుల్లో భారత్ తరపున శత సిక్సర్ల వీరుడిగా నిలిచాడు. శ్రీలంకతో జరుగుతోన్న తొలి టెస్టులో పంత్ 66 పరుగులు చేశాడు. ఇందులో రెండు సిక్సులు ఉన్నాయి. దీంతో 100 సిక్సులు కొట్టిన తొలి భారత బ్యాటర్‌గా అవతరించాడు. అతడి తర్వాత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ (90), రోహిత్ శర్మ (88) ఉన్నారు. ప్రస్తుతం భారత్ తరపున ఆడుతున్నవారిలో రవీంద్ర జడేజా (82) మాత్రమే పంత్‌కు కాస్త దగ్గరగా ఉన్నాడు. యువ ఆటగాళ్లు శుబ్‌మన్ గిల్ (47), యశస్వి జైస్వాల్ (45)కు ఈ మార్క్ ను అందుకొనే అవకాశం ఉంది.

**మొత్తమ్మీద నాలుగో బ్యాటర్..**

అంతర్జాతీయంగా రిషభ్ పంత్ కంటే ముందు ముగ్గురు మాత్రమే ఈ ఫీట్‌ను సాధించారు. ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ బెన్ స్టోక్స్ (122 టెస్టుల్లో 138 సిక్సులు), బ్రెండన్ మెక్కల్లమ్ (101 మ్యాచుల్లో 108), ఆడమ్ గిల్‌క్రిస్ట్ (96 టెస్టుల్లో 100) వంద సిక్సుల మైలురాయిని దాటారు. అత్యంత వేగంగా ఈ ఫీట్‌ను సాధించిన బ్యాటర్ రిషభ్ పంత్. అతడు కేవలం 51 టెస్టుల్లోనే వంద సికర్లు నమోదు చేశాడు. మున్ముందు బెన్ స్టోక్స్ అత్యధిక సిక్సుల రికార్డును పంత్ బద్దలు కొట్టేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయి.

# ట్రీసా-గాయత్రి జోడీ సంచలన విజయం

***- బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ చాంపియన్‌షిప్ మహిళల డబుల్స్***




బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళల డబుల్స్ జోడి ట్రీసా జాలీ-గాయత్రీ గోపిచంద్ సంచలన విజయం సాధించింది. మంగళవారం జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో 16వ సీడ్ అమెరికా జోడీ లారెన్ లామ్-అల్లిసన్ క్విన్ లీని వరుస గేముల్లో ఓడించి ప్రీ-క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ట్రీసా-గాయత్రీ జోడీ కేవలం 38 నిమిషాల్లో 21-15, 21-12 తేడాతో అమెరికా జోడీని చిత్తు చేసింది. ఆరంభం నుంచే ట్రీసా-గాయత్రీ దూకుడైన ఆటతో ప్రత్యర్థులపై ఒత్తిడి పెంచారు. దీంతో తొలి గేమ్‌ను 21-15తో సొంతం చేసుకుంది. రెండో గేమ్ లోనూ భారత జోడీ అదే దూకుడును కొనసాగించింది. విరామ సమయానికి 11-4 ఆధిక్యం సాధించింది. ప్రత్యర్థుల అనవసర తప్పిదాలను కూడా సద్వినియోగం చేసుకున్న ట్రీసా- గాయత్రీ జోడీ 21-12తో మ్యాచ్ గెలిచింది.

**కవిప్రియ-సిమ్రాన్‌కు నిరాశ**

మరో భారత మహిళల డబుల్స్ జోడీ కవిప్రియ సెల్వం- సిమ్రాన్ సింఘి మాత్రం రెండో రౌండ్లో నే నిష్క్రమించింది. 9వ సీడ్ బల్గేరియా జోడీ గాబ్రియేలా స్టోయేవా- స్టెఫానీ స్టోయేవా చేతిలో 7-21, 14-21 తో ఓటమిపాలైంది. కేవలం 32 నిమిషాల్లోనే ఈ మ్యాచ్ ముగిసింది.

**మిక్స్‌డ్ డబుల్స్‌లో నిరాశ**

మిక్స్‌డ్ డబుల్స్ భారత జోడీలకు శుభారంభం దక్కలేదు. రోహన్ కపూర్ - రుత్విక శివాని గద్దె జోడీ కెనడాకు చెందిన జొనాథన్ బింగ్ త్సాన్ లై-క్రిస్టల్ లై చేతిలో 22-20, 19-21, 17-21తో పోరాడి ఓడింది.

మరో జోడీ ఆశిత్ సూర్య- అమృత ప్రముతేష్ కూడా టర్కీకి చెందిన ఎమ్రే సోన్మాజ్- యాసెమెన్ బెక్లాస్ జోడీ చేతిలో తీవ్ర పోరాటం తర్వాత 21-16, 29-30, 22-24తో పరాజయం పాలైంది.

అయితే 15వ సీడ్ భారత జోడీ ధ్రువ్ కపిల- తనీషా కాస్ట్రో ఇంకా పోటీలో ఉంది. తొలి రౌండ్లో బై లభించడంతో.. రెండో రౌండ్‌లో మకావుకు చెందిన ఐక్ ఎంగ్ లియోంగ్- వెంగ్ చి ఎన్నో జోడితో తలపడనుంది.

**ఉనతి హుడా ముందుకు**

మహిళల సింగిల్స్ లో భారత యువ షట్లర్ ఉనతి హుడా కూడా రెండో రౌండ్లో కి ప్రవేశించింది. మయన్మార్‌కు చెందిన థెట్ హార్ తుజారును 22-20, 21-16తో ఓడించింది. ఉనతి.. తదుపరి రెండ్లో 13వ సీడ్ కెనడా షట్లర్ మిషెల్ లీతో తలపడనుంది.

## బంతి తగిలి.. ఐసీయూలో అంపైర్



ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో-2026లో అనూహ్య ఘటన చోటు చేసుకుంది. బ్యాటర్ కొట్టిన బంతి నేరుగా అంపైర్ ముఖానికి తాకింది. దీంతో ఆయన అక్కడే కింద పడిపోవడంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఆయనను ఐసీయూలో చేర్చినట్లు తెలిసింది. డీపీఎల్‌లో భాగంగా మంగళవారం ఈస్ట్ ఢిల్లీ రైడర్స్, న్యూఢిల్లీ టైగర్స్ మధ్య మ్యాచ్ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఈస్ట్ రైడర్స్ 20 ఓవర్లలో 192/7 స్కోరు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో టైగర్స్ 156 పరుగులకు ఆలౌటైంది. టైగర్స్ ఇన్నింగ్స్ 18వ ఓవర్‌ను ఆశిశ్ మీనా వేశాడు. బ్యాటర్ లక్ష్య ధారేజా స్ట్రెయిట్ డ్రైవ్ కొట్టగా.. బంతి నేరుగా వెళ్లి అంపైర్ ధర్మేశ్ భరద్వాజ్‌ను తాకింది. దీంతో ఆయన బాధతో విలవిలాడిపోయారు. మరోవైపు ఏమవుతుందోనని లక్ష్య కంగారుపడిపోయాడు. వెంటనే ధర్మేశ్‌ను మైదానం నుంచి ఆసుపత్రికి తీసుకెళ్లారు.

## తండ్రికి తగ్గ తనయ.. గాయత్రికి అర్జున పురస్కారం



భారత బ్యాడ్మింటన్ మహిళల డబుల్స్‌లో రాకెట్ స్పీడ్‌తో దూసుకెళుతున్న పుల్లెల గాయత్రికి కేంద్రం తాజాగా అర్జున అవార్డు ప్రకటించింది. భారత బ్యాడ్మింటన్ దిగ్గజం పుల్లెల గోపీచంద్ కుమార్తెగా తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ బ్యాడ్మింటన్ లో గాయత్రి విశేషంగా రాణిస్తోంది. ట్రీసా జాలీతో కలిసి ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్ 2022లో మహిళల డబుల్స్ సెమీ ఫైనల్‌కు చేరడంతో గాయత్రి బ్యాడ్మింటన్ అభిమానుల దృష్టిని ఆకర్షించింది. అప్పట్నుంచి వరుస విజయాలతో అంచెలంచెలుగా ఎదుగుతూ తండ్రికి తగ్గ తనయ అనిపించుకుంటోంది. తండ్రి బ్యాడ్మింటన్ ప్లేయర్ కావడంతో చిన్నప్పటి నుంచే ఆటపై ఆసక్తిని పెంచుకుంది. గోపీచంద్ అకాడమీలో స్టార్ షట్లర్లు సైనా నెహ్వాల్, పీవీ సింధులను దగ్గర నుంచి గమనించి వారితో కలిసి శిక్షణ పొంది తన నైపుణ్యాలను మరింత మెరుగుపర్చుకుంది.

## చెస్ సంచలనం దివ్యా దేశ్‌ముఖ్‌కు అర్జున అవార్డు



చెస్ యువ సంచలనం దివ్యా దేశ ముఖ్‌ను అర్జున అవార్డు వరించింది. దివ్య గతేడాది ఫిడే మహిళల ప్రపంచకప్ విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. ఆ ఘనత సాధించిన తొలి భారతీయురాలిగా నిలిచిన ఆమెను క్రీడారంగంలో రెండో అత్యున్నత పురస్కారంతో కేంద్రం ప్రభుత్వం సత్కరించింది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన దివ్యా దేశముఖ్ తల్లిదండ్రులు నమ్రత, జితేంద్ర దేశముఖ్.. ఇద్దరూ వైద్యులే. తన బలం అమ్మే అని చెప్పే దివ్య.. చెస్లో అడుగుపెట్టడం అనుకోకుండా జరిగిందనే చెప్పాలి. సోదరి బ్యాడ్మింటన్ ఆడుతుంటే తానూ వెంట వెళ్లి, సరదాగా చెస్ నేర్చుకొని గతేడాది ప్రపంచకప్ గెలిచి చరిత్ర సృష్టించింది. అదీ అనుభవజ్ఞురాలైన కోనేరు హంపిని సైతం ఓడించి విజేతగా నిలవడం విశేషం.

## తెలుగు హీరోలు వద్దనుకున్నారా?



సూర్య హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో వచ్చి భారీ విజయం అందుకున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమా ముందు పలువురు ఇతర హీరోల వద్దకు వెళ్లగా వారు కాదన్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ చిత్ర కథను దర్శకుడు మొదట రవితేజతో పాటు మరికొందరు తెలుగు హీరోలకు వినిపించారని వాళ్లు రిజెక్ట్ చేశారని సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. తాజాగా దీనిపై వెంకీ అట్లూరి ఓ ఇంటర్వ్యూలో స్పష్టత ఇచ్చారు. ఈ సినిమా పూర్తి కథను తెలుగు హీరోలు ఎవరికీ చెప్పలేదన్నారు. 2020–2022 మధ్యలో ఇండస్ట్రీ చాలా ఒడుదొడుకులు ఎదుర్కొంది. థియేటర్లు తెరుచుకోలేదు. ఎవరూ కొత్తగా సినిమాలు ప్రారంభించలేదు. గతంలో మొదలు పెట్టిన సినిమాలు మాత్రమే పూర్తి చేసుకున్నారు. ఆ తర్వాత షూటింగ్స్ ప్రారంభించాక నేను తొలుత సంప్రదించిన హీరోలందరూ గతంలో అంగీకరించిన కథలను మాత్రమే తెరకెక్కించడం మొదలు పెట్టారు. నాకు సమయం ఇవ్వలేకపోయారు. దీంతో ధనుష్, దుల్కర్ సల్మాన్లను సంప్రదించినా వేరే కారణాలతో వాళ్లు కూడా నో చెప్పారు. తర్వాత మా టీమ్ అందరం కలిసి సూర్యకు చెప్పాలని నిర్ణయించుకున్నాం. అలా ఈ కథ సూర్య దగ్గరకు వెళ్లింది. ఆయన ఓకే చేశారు అని వివరించారు. క్లైమాక్స్ మాత్రం జాగ్రత్తగా తీయాలని సూర్య సలహా ఇచ్చినట్లు తెలిపారు. క్లైమాక్స్ లో హీరో, హీరోయిన్ ఇద్దరి పాత్రలకు ప్రాధాన్యం ఉండాలని చెప్పారన్నారు. ఈ సినిమా కుటుంబ ప్రేక్షకులకు బాగా నచ్చుతుందని ముందే అనుకున్నానని, అదే విధంగా నేడు భారీ వసూళ్లు వస్తున్నాయని వెంకీ అట్లూరి ఆనందం వ్యక్తం చేశారు.

మొదటి రోజు నుంచే కలెక్షన్ల జోరు చూపిస్తోన్న ఈ సినిమా నాలుగు రోజుల్లోనే రూ.121కోట్లు వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. తమిళంలో అత్యధిక వసూళ్లు సాధించిన కరుప్పు(రూ.198కోట్లు), జన నాయగన్ (రూ.196కోట్లు) రికార్డులను ఇది అధిగమిస్తుందని అభిమానులు భావిస్తున్నారు.



## బాలయ్య అంకితభావం!

వృత్తిపట్ల నటసింహం బాలకృష్ణ ఎంత అంకిత భావంతో ఉంటారో అందరికీ తెలిసిందే. తన వల్ల ఎట్టి పరిస్థితుల్లోనూ తన నిర్మాతలు ఇబ్బంది పడకూడదనేది ఆయన ఆలోచన. తాజాగా శస్త్ర చికిత్స అనంతరం డాక్టర్లు నిర్దేశించిన విశ్రాంతికి ముందుగానే సినిమా షూటింగ్కు సిద్ధమవుతున్నారు. బాలకృష్ణ తన 111వ చిత్రంలో ఓ యాక్షన్ సీన్ షూటింగ్లో ప్రమాదానికి గురయ్యారు. ఆయన మోకాలికి గాయం తగలటంతో డాక్టర్లు శస్త్ర చికిత్స చేసి, రెండు నెలలు విశ్రాంతి తీసుకోమని వైద్యులు సూచించారు. అయితే బాలయ్య మాత్రం అంతకు ముందుగానే సెప్టెంబర్ నుంచే షూటింగ్లో పాలుపంచుకోవడానికి సుముఖంగా ఉన్నట్టు సమాచారం. సెప్టెంబర్లో తనకు సంబంధించిన షూటింగ్ మొత్తం పూర్తి చేయాలని బాలయ్య భావిస్తున్నారు. అలా చిత్రీకరణ పూర్తి కాగానే అక్టోబర్లో ప్యాచ్ వర్క్, నవంబర్లో పోస్ట్ ప్రొడక్షన్ను పూర్తి చేయాలని ప్లాన్. డిసెంబర్లో ఎట్టి పరిస్థితుల్లోనూ సినిమాను జనం ముందు నిలపాలన్నది బాలయ్య యోచన. అందుకు దర్శకుడు గోపీచంద్ మలినేని, నిర్మాత వెంకట సతీశ్ కిలారు కూడా సిద్ధమవుతున్నట్టు సమాచారం.

బాలయ్యకు డిసెంబర్ నెల బాగానే కలిసి వచ్చింది. ఆయన కెరీర్లో ఫస్ట్ టైమ్ భారీ ఓపెనింగ్స్ చూసిన 'పట్టాభిషేకం', భారీ విజయం సాధించిన 'లారీ డ్రైవర్', కరోనా తరువాత జనాన్ని థియేటర్స్కు రప్పించిన 'అఖండ' చిత్రాలు డిసెంబర్ లోనే రిలీజయ్యాయి. అందువల్లే తాను గోపీచంద్ మలినేని డైరెక్షన్లో నటిస్తోన్న రెండో సినిమాను డిసెంబర్ లోనే విడుదల చేయాలని బాలయ్య భావిస్తున్నారు.

### నేటి నుంచి ఓటీటీలో
## 'మిస్టర్ మిడిల్ క్లాస్'

శ్రీకాంత్, లయ జంటగా నటించిన చిత్రం 'మిస్టర్ మిడిల్ క్లాస్'. జి. నాగేశ్వర్రెడ్డి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్ర పోషించారు. జులై 17న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. ఆగస్టు 19 నుంచి ఆహా వేదికగా స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆహా పోస్టర్ను పంచుకుంది.


వెంకటరమణ (శ్రీకాంత్) మధ్యతరగతి మనిషి. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంటాడు. భార్య పద్మావతి (లయ), తండ్రి ఏడుకొండలు, చెల్లి, బావ, పిల్లలతో ఒక అద్దె ఇంట్లో ఉంటాడు. ఒకప్పుడు టిఫిన్ సెంటర్ పెట్టి బాగా సంపాదించిన వెంకట రమణ.. అత్యాశకు పోయి, వడ్డీలకి డబ్బు తెచ్చి పెద్ద రెస్టారెంట్ పెడతాడు. దాంట్లో నష్టాలొచ్చి, చివరికి ఆ రెస్టారెంట్ అమ్మేసి, దాంట్లోనే పనిచేస్తుంటాడు. ఆదాయం చాలక కష్టాలు పెరిగిపోవడంతో తనని చంపేయాలని దేవుడిని వేడుకుంటాడు. అప్పుడు వేంకటేశ్వర స్వామి (రాజేంద్రప్రసాద్) ప్రత్యక్షమై మహిమ గల పుస్తకం ఇస్తాడు. మరి ఆ పుస్తకం వెంకట రమణ జీవితాన్ని ఎలాంటి మలుపు తిప్పింది.. దానివల్ల కొత్తగా వచ్చిన కష్టాలేంటి.. అన్నది చిత్ర కథ.




## అక్టోబర్ 2న 'సిగ్మా'

కోలీవుడ్ అగ్రకథానాయకుడు, తమిళనాడు సీఎం విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న సినిమా 'సిగ్మా'. సందీప్ కిషన్ హీరోగా రూపొందిన ఈ మూవీ విడుదల తేదీ ఖరారైంది. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న దీన్ని విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది . మొదట ఈ సినిమాను జులై 31న విడుదల చేయాలని భావించారు. అయితే, ఈ తేదీకి వారం ముందు విజయ్ నటించిన 'జన నాయగన్' విడుదల కావడంతో దీన్ని వాయిదా వేశారు. తాజాగా కొత్త విడుదల తేదీని ప్రకటిస్తూ పోస్టర్ విడుదల చేశారు. ఈ సినిమాలో ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటించగా.. రాజు సుందరం, సంపత్ రాజ్, తదితరులు కీలక పాత్రలు పోషించారు. దీనికి తమన్ సంగీతమందించారు.

ఇక జాసన్ సంజయ్ త్వరలోనే హీరోగానూ పరిచయం కానున్నట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ప్రముఖ నిర్మాత జీకేఎమ్ తమిళ్ కుమారన్ తన సొంత బ్యానర్పై సంజయ్ను హీరోగా పరిచయం చేయనున్నట్లు తమిళ సినీ వర్గాల్లో బలంగా వినిపించింది. విజయ్ సినిమాల నుంచి వైదొలగిన నేపథ్యంలో ఆయన కుమారుడు వెండితెరకు పరిచయం కానున్నట్లు వార్తలు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.




## ట్రోల్స్, మీమ్స్ తెచ్చిన అదృష్టం!

నవ్విన నాపచేనే పండినట్లు అందరూ ఎగతాళి చేసిన సినిమానే వసూళ్ల వర్షం కురిపిస్తోంది. సోషల్ మీడియాలో వేలాదిగా వచ్చిన ట్రోల్స్, మీమ్స్ ఇందుకు కారణం కావటం విశేషం. ఆగస్టు 9న చైనాలో విడుదలైన ఓ యానిమేషన్ సినిమా కథ ఇది. సాధారణంగా ఒక సినిమా హిట్ కావాలంటే గొప్ప కథ, అద్భుతమైన విజువల్స్, కోట్ల బడ్జెట్, వీటన్నింటికీ మించి భారీ ప్రచారం ఉండాలి. కానీ, ఈ సినిమాకు ఇవేమీ లేవు. పైగా సినిమా చూసిన ప్రతి ఒక్కరూ "ఛీ.. ఇంతచెత్త సినిమా జీవితంలో చూడలేదు" అని తిట్టుకున్నారు. కానీ, ఇప్పుడదే బాక్సాఫీస్ దగ్గర హిట్టయింది. ఆ సినిమ పేరు "న్యూ లాయ్". అంటే తెలుగులో ఆవు వస్తోంది' అని అర్థం.

### 10 రోజుల్లో 300 టిక్కెట్లు

86 నిమిషాల నిడివి ఉన్న ఈ యానిమేషన్ చిత్రంలో లేగదూడ, పిచ్చుక మధ్య జరిగే విచిత్రమైన కలల ప్రపంచాన్ని చూపించారు. ఈ సినిమాను రూపొందించింది కూడా హాలీవుడ్ స్టూడియోలు కాదు.. కేవలం ఇద్దరే అని ప్రచారంలో ఉంది. తల్లీకొడుకు ఐదేళ్లపాటు శ్రమించి, రైటింగ్, డైరెక్షన్, డబ్బింగ్, ప్రొడక్షన్.. అన్నీ వాళ్లే చేసి దీన్ని విడుదల చేశారు. దీనికి దాదాపు రూ.లక్ష ఖర్చు అయ్యింది. సినిమారిలీజ్ అయ్యాక మొదటి 10రోజుల్లో చైనా అంతాకలిపి కేవలం 300మంది మాత్రమే టికెట్లు కొన్నారు. దీంతో 7,700 యువాన్ల కలెక్షన్స్ మాత్రమే వచ్చాయి. ఈ సినిమాకు ఈ మాత్రం రావడమే ఎక్కువ అనుకున్నారంతా. 2026లో విడుదలైన చెత్త సినిమా ఇదేనంటూ ట్రోల్స్ వచ్చాయి.

### ట్రోల్స్ తెచ్చిన లక్..

అయితే, ఊహించని మలుపు అక్కడ మొదలైంది. ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు, (గ్రాఫిక్స్ వీడియోలు సోషల్ మీడియాలో 'షేర్ అయ్యాయి. 'ఇది మరీ ఘోరంగా ఉంది', 'దీని కంటే ఏఐ బాగా తీస్తుంది'అని నెటిజన్లు దారుణంగా ట్రోల్స్ చేశారు. అక్కడితో ఆగకుండా మీమ్స్ చేయడం మొదలుపెట్టారు. అవి విపరీతంగా వైరల్ అయ్యాయి. దీంతో అసలు ఈ సినిమాలో ఏముందో మనమూ చూద్దాం.. అని జనాలు థియేటర్లకు క్యూ కట్టడం ప్రారంభించారు. దీంతో ట్రోలింగే ఈ సినిమాకు ఉచిత ప్రచారంగా మారింది.

### హాలీవుడ్ సినిమాలకు షాక్...

ట్రోల్స్ దెబ్బకి థియేటర్లలో జనం పెరిగారు, చూస్తుండగానే ఈ చిత్రం ఇప్పటివరకు చైనా బాక్సాఫీస్ వద్ద 14.0 మిలియన్ యువాన్లు (సుమారు రూ.30 కోట్లు) వసూలు చేసింది. ఏకంగా భారీ హాలీవుడ్ చిత్రాల కలెక్షన్ల రికార్డులకే పోటీగా నిలిచింది. ఏది ఏమైనా, సినిమా బాగుంటేనే కాదు.. మరీ ఘోరంగా ఉన్నా జనాలు చూస్తారు... అని నిరూపిస్తూ ఈ 'న్యూ లాయ్' బాక్సాఫీస్ చరిత్రలోనే ఒక విచిత్రమైన రికార్డును క్రియేట్ చేసింది.

